సంగీత మేరు శిఖరాలు
రూ॥120/-
పేజీలు:138


నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



బెంగాల్ ఎన్నికల్లో వామపక్షాలు పునరుజ్జీవనం

భారత్‌కు కొనసాగుతోన్న ఎల్‌పిజి ప్రవాహాలు

హిందీ రుద్దే కుట్ర
తమిళనాడు సిఎం స్టాలిన్ 05



సంపుటి 09, సంచిక: 125 | ఆదివారం | 05-04-2026 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00




# దేశంలో రాజకీయాలు భ్రష్టు పట్టాయ్

- అవినీతికి వ్యతిరేకంగా ప్రజాపోరాటాలు నిర్వహించాలి
- రాజకీయ అవినీతిని ప్రజలకు వివరిస్తాం
- ప్రజా ఉద్యమాలవైపు మళ్లించేందుకే సిపిఐ ఇంటింటి కార్యక్రమం
- సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ నారాయణ

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశంలో రాజకీయ వ్యవస్థ పూర్తిగా భ్రష్టు పట్టిపోయి, అవినీతి మయమైందని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ అన్నారు. అవినీతికి వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు నిర్వహించాల్సిన అవసరముందని లేకపోతే ప్రజాస్వామ్యానికే ప్రమాదమని ఆయన పేర్కొన్నారు. ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో భాగా సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కార్యకర్తలను ఉద్దేశించి డాక్టర్ నారాయణ మాట్లాడుతూ రాజకీయ అవినీతిని ప్రజలకు వివరించడం ద్వారా వారిని ప్రజా ఉద్యమాల వైపు ముందుకు నడిపించేందుకు ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ ఉద్యమాలను నిర్వహించేందుకు కావాల్సిన వనరులను కూడా ఇందులో భాగంగా ప్రజల నుంచే సేకరిస్తున్నామని తెలిపారు. దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు అన్ని విధాలుగా భయాందోళనలకు గురువుతున్నారని, ఈ నేపథ్యంలో ఇతర రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చేందుకు సైతం వెనకాడుతున్న తరుణంలో ప్రజల నుంచే విరాళాలను సేకరించడంతో పాటు ఈ దేశంలో నెలకొన్న సమస్యలను ప్రజలకు వివరిస్తున్నామని నారాయణ వెల్లడించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.ఛాయాదేవి, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు యూసుఫ్, నాయకులు బి.వెంకటేశం, ఎం.నర్సింహా, చంద్రమౌళి, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఎన్.శ్రీకాంత్, సిపిఐజిల్లా కౌన్సిల్ సభ్యులు చెట్టుకింద శ్రీనివాస్, అటుకుల రాజు ,లక్ష్మి , మదన్ సింగ్, కిష్టమ్మ కళ్యాణ్ అనిల్ , సుశాంత్ మనోజ్, భాను పాల్గొన్నారు.

# అమెరికాకు ఎదురుదెబ్బలు



## రెండు యుద్ధవిమానాలు, డ్రోన్‌ను కూల్చిన ఇరాన్

**తెహ్రాన్ :** ఇరాన్‌తో జరుగుతోన్న యుద్ధంలో అమెరికాకు భారీ ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఒకే రోజు అమెరికాకు చెందిన రెండు యుద్ధ విమానాలను ఇరాన్ కూల్చేసింది. మరో రెండు హెలికాప్టర్లపైనా దాడి చేసింది. అలాగే యూఎస్ ఎంక్యూ1 డ్రోన్‌ను కూడా ఇరాన్ కూల్చివేసింది. ఇరాన్ కూల్చివేత ఘటనల్లో ఇద్దరు పైలెట్లు సురక్షితంగా బయటపడగా... మరో పైలెట్ గల్లంతయ్యారు. అతని ఆచూకీ కోసం అమెరికా తీవ్ర ప్రయత్నాలు చేసుతన్నది. కాగా, 'శత్రుదేశ పైలెట్‌ను కనిపెట్టాలంటూ ఇరాన్ తన సైన్యానికి సూచించింది. అమెరికాకు చెందిన ఎఫ్15ఈ స్ట్రైక్ ఈగల్ విమానాన్ని ఇరాన్ శుక్రవారం దాడి చేసి కూల్చేసింది. ఇందులో ఓ పైలట్, వెపన్ సిస్టమ్ అధికారి ఉన్నారు. వీరిలో ఒకరిని రక్షించామని, మరొకరి కోసం గాలింపు కొనసాగుతోందని అమెరికా, ఇజ్రాయిల్ అధికారిక వర్గాలు వెల్లడించాయి. అటు హోర్ముజ్ సమీపంలో ఏ10 వార్‌థగ్ యుద్ధవిమానాన్ని ఇరాన్ కూల్చేసింది. దీని శకలాలు కువైట్‌లో పడగా... అందులోని పైలెట్ సురక్షితంగా బయటపడ్డారు. ఈ రెండు ఘటనలు దాదాపు ఒకే సమయంలో జరిగినట్లు అమెరికా అధికారులు వెల్లడించారు. ఇరాన్ గగనతల రక్షణ సామర్థ్యాన్ని ధ్వంసం చేశామని అమెరికా, ఇజ్రాయిల్ చెబుతోన్న వేళ... ఈ ఘటనలు చర్చనీయాంశమయ్యాయి. 20 సంవత్సరాల కాలంలో ఒక శత్రుదేశం దెబ్బకు రెండు యుద్ధ విమానాలను అమెరికా కోల్పోవడం ఇదే ప్రథమం. అమెరికా అంచనాలకు మించి తెహ్రాన్ గగనతల రక్షణ వ్యవస్థలు పనిచేస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. మొదటి యుద్ధ విమానంలో గల్లంతైన పైలెట్ కోసం రెండు బ్లాక్‌హాక్ హెలికాప్టర్లు గాలింపు చేపట్టాయి. వీటిపైనా ఇరాన్ దాడి చేసినట్లు అమెరికా అధికారిక వర్గాలు వెల్లడించాయి. అయితే, ఇవి దాడి నుంచి త్రుటిలో తప్పించుకొని ఇరాన్ గగనతలం నుంచి బయటకు వచ్చేసినట్లు పేర్కొన్నాయి. ఈ ఘటనలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు సమాచారం ఇచ్చినట్లు వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లివిట్ తెలిపారు. ఏ10 యుద్ధ విమానం కూలిన దశ్యాలను ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ఇజ్రాయిల్, అమెరికాలపై ఇరాన్ పెద్ద ఎత్తున దాడులు చేస్తోంది. ఆ దేశాల దాడులను సమర్థవంతంగా అడ్డుకుంటోంది. తాజాగా, అమెరికాకు చెందిన ఎమ్‌క్యూ1 డ్రోన్‌ను ఇరాన్ కూల్చేసింది. ఇస్ఫహాన్ ప్రావిన్స్‌లో ఎమ్‌క్యూ1 డ్రోన్‌ను అడ్వాన్స్‌డ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ సాయంతో ఐఆర్‌జీసీ కూల్చేసిందని ఇరాన్‌కు చెందిన ఫార్స్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది.



# ఆలయాల పరిసరాల్లో తిరుమల తరహా నిబంధనలు

- రాజకీయ పార్టీల సభలు, జెండాలు, ప్రదర్శనలు ఉండకూడదు
- ఆధ్యాత్మికతకు పెద్దపీట వేయాలి
- సంప్రదాయాలకు అనుగుణంగా బాసర ఆలయ అభివృద్ధి పనులు
- జ్ఞాన సరస్వతి ఆలయ అభివృద్ధిపై సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో ప్రముఖ ఆలయాల పరిసరాల్లో తిరుమల తరహాలో నిబంధనలు అమలు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాజకీయ పార్టీల సభలు, జెండాలు, ప్రదర్శనలు లేకుండా ఆధ్యాత్మికతకు పెద్దపీట వేయాలని సిఎం సూచించారు. బాసర జ్ఞాన సరస్వతి దేవాలయ అభివృద్ధి పనులపై సిఎం ఎ.రేవంత్ రెడ్డి శనివారం హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. తొలుత బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సిఎంకు వివరించారు. ఆలయ అభివృద్ధి పనులకు రూ.225 కోట్ల వ్యయమవుతుందని అధికారులు తెలియజేశారు. మాస్టర్‌ప్లాన్‌ను పరిశీలించిన సిఎం పలు మార్పులు సూచించారు. ఈ నెల 6వ తేదీన బాసర ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. భక్తుల విశ్వాసాలను

తరువాయి 2లో



## పంటల సమగ్ర ప్రణాళికకు దిక్సూచిగా

# ఉపగ్రహ ఇమేజింగ్

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు
- రాష్ట్రంలో వ్యవసాయరంగాన్ని శాటిలైట్ డేటా ఆధారంగా ముందుకు తీసుకెళ్లడం అత్యవసరమని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

పంటల సమగ్ర ప్రణాళికకు ఉపగ్రహ ఇమేజింగ్ ఒక దిక్సూచి కావాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సచివాలయంలో శనివారం ఉపగ్రహ ఆధారిత పంట మ్యాపింగ్‌పై వ్యవసాయ యూనివర్సిటీ, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మరింత సమర్థవంతంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో శాటిలైట్ మ్యాపింగ్ చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని శాటిలైట్ డేటా ఆధారంగా ముందుకు తీసుకెళ్లడం అత్యవసరమని, మార్కెటింగ్, డిమాండ్ అంచనా, ఉత్పత్తి, సరఫరా వ్యవస్థ, గిడ్డంగి సదుపాయాలు, పంట నష్టాల అంచనా, పంట బీమా వంటి అంశాలు పరస్పరం అనుసంధానమై ఉంటాయన్నారు. వీటన్నింటినీ సమన్వయం చేయడంలో ఉపగ్రహ సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ సమాచారం ఆధారంగా రాష్ట్రంలో పంటల ప్రణాళికను మరింత శాస్త్రీయంగా రూపొందించుకోవచ్చని, ఉపగ్రహ మ్యాపింగ్ ద్వారా ప్రతి సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు, సాగులో ఉన్న పంటల రకాలు, ఉత్పత్తి అంచనాలు, గిడ్డంగి సదుపాయాల అవసరాలు వంటి అంశాలపై ముందుగానే స్పష్టత లభిస్తుందని తెలిపారు. అలాగే భారీ వర్షాలు, వరదలు, కరువు వంటి ప్రకృతి విపత్తుల వల్ల పంటలకు కలిగే నష్టాలను త్వరితగతిన గుర్తించి ప్రభుత్వానికి సమాచారం అందించడం ద్వారా సహాయక చర్యలను వేగంగా చేపట్టే అవకాశం ఉంటుందన్నారు. పంట నష్టాల అంచనాలు ఖచ్చితంగా లభించడం వల్ల

తరువాయి 2లో

# బడా కంపెనీలే లక్ష్యం

## వాట్సాప్‌లో కొత్త తరహా మోసం

**వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలి**
**హైదరాబాద్ సిపి విసి. సజ్జనార్**



ప్రజాపక్షం/హైదరాబాద్

వ్యాపార సంస్థల అధినేతలు, సిఇఓలు, సిఎఫ్ఓలే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు సరికొత్త వాట్సాప్ మోసాలకు పాల్పడుతున్నారని హైదరాబాద్ సిపి విసి.సజ్జనర్ తెలిపారు. సంస్థల అధికారిక ఈమెయిల్స్‌కు హానికరమైన ఫిషింగ్ లింకులు పంపడం ద్వారా కంప్యూటర్లలోకి మాల్వేర్‌ను ప్రవేశపెడుతున్నారని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల సిస్టమ్స్‌పై నేరగాళ్లు పూర్తిస్థాయి రిమోట్ యాక్సెస్‌ను పొందుతూ అక్రమాలకు తెరలేపుతున్నారని చెప్పారు. సిస్టమ్ నియంత్రణలోకి వచ్చిన తర్వాత అందులో యాక్టివ్‌గా ఉన్న వాట్సాప్ వెబ్ సెషన్లను నేరగాళ్లు చాకచక్యంగా వినియోగిస్తున్నారని అన్నారు. సిఇఓ లేదా సిఎఫ్ఓల పేరుతో అకౌంటెంట్లకు తప్పుదారి పట్టించే సందేశాలను పంపిస్తూ నమ్మిస్తున్నారని తెలిపారు. తాము అత్యవసర సమావేశంలో ఉన్నామని, ఫోన్ ఎత్తడం వీలుపడదని చెబుతూ కోట్లాది రూపాయలు కాజేస్తున్నారని పేర్కొన్నారు. సోషల్ ఇంజనీరింగ్ వ్యూహాలతో తక్షణమే తమ ఖాతాలకు డబ్బును బదిలీ చేయించుకుంటున్నారని చెప్పారు. పై అధికారుల నంబర్ల నుంచే సందేశాలు వస్తుండటంతో అకౌంటెంట్లు కూడా నిజమేనని నమ్మి మోసపోతున్నారని అన్నారు. ఇటీవల హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇటువంటి కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. ప్రతి కంపెనీ కూడా ఇటువంటి సైబర్ దాడుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాట్సాప్ పై అధికారుల పేరుతో వచ్చే ఆర్థిక అభ్యర్థనలను గుడ్డిగా నమ్మకూడదని పేర్కొన్నారు. వెంటనే అధికారులకు నేరుగా ఫోన్ చేసి ఆ సందేశం నిజమేనా కాదా అని ధృవీకరించుకోవాలని చెప్పారు. ఆఫీసు సిస్టమ్స్‌లో నాణ్యమైన ఫైర్వాల్స్, యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్‌లను నిరంతరం అప్‌డేట్ చేసి ఉంచాలని అన్నారు. వాట్సాప్ వెబ్ వాడిన ప్రతిసారి తప్పకుండా లాగౌట్ చేయడం మర్చిపోవద్దని తెలిపారు. సాంకేతిక భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారానే

తరువాయి 2లో



# ప్రజల్లోకి రావాలి

- కల్యాణలక్ష్మి , షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేయాలి
- కెసిఆర్ క్యాంపు ఆఫీస్‌ను ముట్టడించిన డిసిసి అధ్యక్షుడు అంక్షారెడ్డి
- సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని బిగించిన కాంగ్రెస్ శ్రేణులు
- కెసిఆర్ స్పందించకుంటే ఎర్రవల్లి ఫామ్ హౌస్ ముట్టడిస్తామని హెచ్చరిక

ప్రజాపక్షం/గజ్వేల్

గజ్వేల్ ప్రజలకు కెసిఆర్ అందుబాటులోకి రావాలని డిమాండ్ చేస్తూ ఆయన క్యాంపు కార్యాలయాన్ని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూంకుంట అంక్షారెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు ముట్టడించారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని బిగించి బిఆర్‌ఎస్ పార్టీ, కెసిఆర్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గజ్వేల్ ఎమ్మెల్యేగా పనిచేస్తున్న కెసిఆర్ ఇప్పటికే రూ. కోటి 20 లక్షల వేతనం, ఇతర అలవెన్సులు పొందినట్లు అంక్షారెడ్డి ఆరోపించారు. ప్రజల సొమ్ము అప్పనంగా మేస్తున్న ఆయనను ఎమ్మెల్యే పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండని కెసిఆర్ ఒక్క క్షణం కూడా ఎమ్మెల్యేగా కొనసాగే నైతిక హక్కు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కెసిఆర్ అందుబాటులో లేకపోవడంతో కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ నిలిచినట్లు స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఆయన స్పందించకుంటే కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎర్రవల్లి ఫాంహౌజ్ ముట్టడిస్తామని హెచ్చరించారు. సమస్యల పరిష్కారంలో కెసిఆర్ వైఫల్యం చెందగా, గజ్వేల్ ప్రజలు, నిర్వాసితులను నట్టేట ముంచినట్లు ఎద్దేవా చేశారు. దమ్ముంటే కెసిఆర్ నిర్వాసిత గ్రామాల్లో పర్యటించాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ గజ్వేల్ ప్రజలను గాలికి వదిలేసినా సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం

తరువాయి 2లో



బావిలోకి దూసుకెళ్లిన కారు

## ఒకే కుటుంబానికి చెందిన తొమ్మిది మంది దుర్మరణం

**ముంబయి :** కారు బావిలోకి దూసుకెళ్లడంతో ఒకే కుటుంబానికి చెందిన తొమ్మిది మంది దుర్మరణం చెందారు. ఈ విషాద ఘటన మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డిండోరీ ప్రాంతానికి చెందిన ఓ కుటుంబం శివాజీనగర్‌లో ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. అక్కడి నుంచి తిరిగివస్తుండగా వీరు ప్రయాణిస్తున్న

తరువాయి 12లో

## 6 నుంచి 11 వరకు

# హెల్త్ వీక్



**మంత్రి దామోదర రాజ నర్సింహ**

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకూ (హెల్త్ వీక్) ఆరోగ్య వారంగా నిర్వహించనున్నట్లు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఇందులో భాగంగా రోజువారీగా నిర్వహించనున్న కార్యక్రమాలపై ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో శనివారం మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచేలా, ప్రభుత్వ వైద్య సేవలను మరింత చేరువ చేసేలా కార్యక్రమాలు ఉండాలనిసూచించారు.ఈ కార్యక్రమాలల్లో విద్యార్థులు, మహిళలు, యువతను భాగస్వాములను చేయడంతో పాటు అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. ఆహార నాణ్యత ప్రాముఖ్యతను తెలిపేలా 6వ తేదీన ఫుడ్ సేఫ్టీ ఫోకస్‌లో భాగంగా ఉదయం 6.30 గంటలకు హైదరాబాద్ నెక్లెస్ రోడ్ వద్ద ఈట్ రైట్ వాక్ నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా .నేచురోపతి హాస్పిటల్‌లో 40 స్టాళ్లతో మిల్లెట్ మేళా ఏర్పాటు, ఫుడ్ హ్యాండ్లర్లకు శిక్షణ, స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులకు సర్టిఫికేట్ల పంపిణీ, హైజీన్ రేటింగ్ సర్టిఫికేట్ల పంపిణీ

తరువాయి 2లో

## క్యాతనపల్లి, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలు

# బిఆర్‌ఎస్ కైవసం



టేకుల సుదర్శన్‌రెడ్డి



ముత్యాల శ్యామల

ఇబ్రహీంపట్నం చైర్మన్‌గా టేకుల సుదర్శన్‌రెడ్డి

వైస్ చైర్‌పర్సన్‌గా ముత్యాల శ్యామల

క్యాతనపల్లి చైర్మన్‌గా సంధ్యారాణి



సంధ్యారాణి

ప్రజాపక్షం/న్యూస్‌నెట్‌వర్క్

గతంలో వాయిదా పడిన మున్సిపాలిటీలో శనివారం మున్సిపల్ చైర్మన్ల ఎన్నికలు జరిగాయి. రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ, మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటినీ బిఆర్‌ఎస్ కైవసం చేసుకుంది. ఇక ఖానాపూర్ చైర్‌పర్సన్ ఎన్నికల మరోసారి కూడా వాయిదా పడింది. కాగా, ఇబ్రహీంపట్నం చైర్మన్‌గా సుదర్శన్‌రెడ్డి ఎన్నికయ్యారు. వైస్ చైర్‌పర్సన్‌గా బిజెపి కౌన్సిలర్ ముత్యాల శ్యామలను ఎన్నుకున్నారు. మరోవైపు మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీని

తరువాయి 12లో

## క్యాతనపల్లి వైస్‌చైర్‌పర్సన్‌గా సిపిఐ కౌన్సిలర్ మిట్టపల్లి సరిత



మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ పీఠాన్ని సిపిఐ దక్కించుకుంది. 22వ వార్డు నుంచి గెలుపొందిన సిపిఐ అభ్యర్థి మిట్టపల్లి సరితను వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. 51 రోజుల ఉత్కంఠకు తెరదించుతూ చైర్‌పర్సన్‌గా బిఆర్‌ఎస్ 17వ వార్డు అభ్యర్థి గొడిసెల సంధ్యారాణి ఎన్నికయ్యారు. క్యాతనపల్లిలో మొత్తం 22 స్థానాలకు గానూ 14 స్థానాలలో బిఆర్‌ఎస్ సీపిఐ సభ్యులు గెలిచారు. ఏడింటిని కాంగ్రెస్ గెలుచుకుంది. ఇప్పటికే 2 సార్లు వాయిదా పడ్డ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు హైకోర్టు ఆదేశాలతో అధికారులు శనివారం ఏర్పాట్లు చేశారు. డిసిపి భాస్కర్ ఆధ్వర్యంలో నలుగురు ఎసిపిలు, ఇద్దరు సిఐలు, 27 మంది ఎస్‌ఐలతో పాటు మొత్తం 650 మంది పోలీసులతో బందోబస్తు చేపట్టారు.

## వాషింగ్టన్ మేయర్ రేసులో
# భారత సంతతి యువతి



**వాషింగ్టన్:** అమెరికాలోని ఎన్నికల చరిత్రలో మరో భారతీయ మహిళ చరిత్ర సృష్టించారు. వాషింగ్టన్ డీసీ మేయర్ ఎన్నికల బరిలో నిలిచిన తొలి దక్షిణాసియా మహిళగా 31 ఏళ్ల రినీ సంపత్ చరిత్ర సృష్టించారు. 'అమెరికన్ డ్రీమ్' సాకారం కోసం ఏడేళ్ల వయసులోనే అమెరికాకు వలస వచ్చిన ఆమె 2026 మేయర్ ఎన్నికల్లో పోటీ చేయడానికి అవసరమైన నామినేషన్ అర్హత సాధించారు. తమిళనాడు తేనిలో జన్మించిన రినీ సంపత్... తన ఏడవ ఏట తల్లిదండ్రులతో కలిసి అమెరికాకు వలస వెళ్లారు. యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా నుండి ఇంటర్నేషనల్ రిలేషన్స్ అండ్ సెక్యూరిటీ స్టడీస్‌లో పట్టా పొందారు. సైబర్ సెక్యూరిటీ నిపుణురాలు, ప్రభుత్వ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం 'థారోస్' అనే సంస్థకు డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. గత పదేళ్లుగా వాషింగ్టన్ డీసీలోనే నివసిస్తున్న రినీ మేయర్ పదవికి జరిగే ఎన్నికల బ్యాలెట్‌లో స్థానం సంపాదించారు. నగరంలోని ప్రాథమిక సేవలను మెరుగుపరచడమే తన లక్ష్యమని ఆమె నొక్కి చెప్పారు. 'ఫిక్స్ ద బేసిక్స్' 'కొత్త డీసీ' అనే నినాదంతో ఆమె ప్రచారం సాగిస్తున్నారు. రోడ్లపై గుంతలు పూడ్చడం, పోటోమాక్ నదిలో మురుగునీరు కలవకుండా అడ్డుకోవడం, ధరలు తగ్గించడం వంటి హామీలు ఇస్తున్నారు. అలాగే 911 అత్యవసర సేవల వెయిటింగ్ సమయాన్ని తగ్గిస్తానని చెబుతున్నారు. తమ కుటుంబం అమెరికాకు రావాలని తీసుకున్న నిర్ణయం తన జీవితాన్ని మార్చివేసిందని రినీ చెబుతారు. తన మూలాలే ప్రజా సేవకు తన ప్రేరణకు కేంద్రమన్నారు. తాతగారు తనకు పెద్ద స్ఫూర్తి అని, ప్రజాసేవలో ఆయన మార్గమే తనను నడిపిస్తుందని రినీ సంపత్ చెప్పారు. 'నేను రాజకీయ నాయకురాలిని కాదు. నాకు ఎటువంటి ప్రత్యేక ప్రయోజన గ్రూపులతో సంబంధం లేదు. నగర ప్రాథమిక సేవలు మెరుగుపరచడంపై దృష్టి పెట్టే ఒక బయటి వ్యక్తి అవసరం ఉంది' అని రినీ పేర్కొన్నారు. ఈసారి ఎన్నికల్లో రినీ సంపత్... జనీస్ లూయిస్ జార్జ్, కెన్యాన్ మెక్‌డఫీ, గ్యారీ గుడ్‌వెదర్, రాబర్ట్ ఎల్ గ్రాస్, రోండా హామిల్టన్ వంటి వారితో తలపడుతున్నారు. ఆమె నామినేషన్ పత్రాలపై 4,500 కంటే ఎక్కువ మంది ప్రజలు సంతకాలు చేసి మద్దతు తెలపడం విశేషం.

# యుద్ధం కోసం రష్యా సైనికుల నియామకం



**మాస్కో:** ఉక్రెయిన్‌తో నాలుగేళ్లుగా యుద్ధం కారణంగా దాదాపు 3.25 లక్షల మంది రష్యా సైనికులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో మళ్లీ తన సైన్యాన్ని బలోపేతం చేసేందుకు అధికారులు కాంట్రాక్టు పద్ధతిలో భారీగా సైన్యాన్ని సమీకరిస్తున్నారు. ఇందుకోసం రహస్య నియామకాలు జరుగుతున్నాయి. సైనిక శిక్షణ తీసుకున్నవారే కాకుండా వివిధ వర్గాల పౌరులు కూడా రష్యా సైన్యంలో చేరాలని ప్రజలను అధికారులు కోరుతున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. సైనిక సేవల కోసం ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలలోని ఉద్యోగులను నామినేట్ చేయాల్సిందిగా పలు పెద్ద కంపెనీలు, వ్యాపార సంస్థలకు ర్యాజాన్ నగర గవర్నర్ రహస్య నోటీసులు పంపినట్లు బిజినెస్ ఇన్‌సైడర్ వెల్లడించింది. కంపెనీల్లో పని చేసే ఉద్యోగులను సైనిక అభ్యర్థులుగా ఎంపిక చేసి... ఆ జాబితాను సెప్టెంబర్ 20లోగా తమకు పంపాల్సిందిగా ఆయన కోరినట్లు తెలిపింది. నోటీసు ప్రకారం... సైన్యంలోకి ఎంపిక చేసే అభ్యర్థుల సంఖ్య కంపెనీ పరిమాణంపై ఆధారపడి ఉంటుంది. 150300 మంది ఉద్యోగులు ఉన్న సంస్థలు కనీసం రెండు పేర్లను, 300500 మంది ఉద్యోగులు ఉన్న సంస్థలు మూడు పేర్లు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొంది. 500 లేదా అంత కంటే ఎక్కువమంది ఉద్యోగులు ఉన్న సంస్థలు ఐదుగురిని ఎంపిక చేయాల్సి ఉంటుంది. ఈ ఆదేశాలు పాటించని కంపెనీలకు పెద్ద మొత్తంలో జరిమానా విధించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సైనిక సమీకరణ ప్రక్రియను వీలైనంత తొందరగా పూర్తి చేసి... ఎంపిక చేసిన వారిని పోరాటానికి సిద్ధం చేయడానికి రష్యా సైన్యం, నావికాదళ కమాండర్లు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. శిక్షణ పూర్తైన వెంటనే వారిని యుద్ధంలో భాగం చేసే అవకాశం ఉంది.

## అఫ్గాన్‌లో భారీ భూకంపం
### ఎనిమిది మంది మృతి

**కాబూల్:** అఫ్గానిస్థాన్‌లోని హిందూ కుష్ ప్రాంతంలో సంభవించిన భారీ భూకంపంలో ఎనిమిది మంది మరణించారు. శుక్రవారం సంభవించిన ఈ భూకంపం తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.9గా నమోదైంది. భూకంపం భూమికి 177 కిలోమీటర్ల లోతులో సంభవించిందని జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ నివేదించింది. కాబూల్‌లో ఒక ఇల్లు కూలిపోవడంతో మరణాలు సంభవించాయని జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ తెలిపింది. ఈ ప్రమాదంలో ఒక చిన్నారి గాయపడిందని తెలిపారు. ప్రకంపనలు పలు దేశాలలో సంభవించినట్లు తెలుస్తోంది. అఫ్గాన్ రాజధాని కాబూల్‌తో పాటు పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్, భారతదేశంలోని న్యూఢిల్లీలో కూడా ప్రకంపనలు సంభవించాయి. విపత్తు ప్రభావిత ప్రాంతాల్లో ప్రస్తుతం సహాయక చర్య లు కొనసాగుతున్నాయి. దాని భౌగోళిక లక్షణాల కారణంగా ఇది ప్రకతి వైపరీత్యాలకు ఎ క్కువగా గురయ్యే ప్రాంతం. గణాంకాల ప్రకా రం అఫ్గానిస్థాన్‌లో ప్రతి సంవత్సరం భూకంపాల వల్ల సగటున 560 మంది మరణిస్తున్నారు.

## ఫ్రాన్స్‌లో పెట్రోలుకు రుణాలు


**పారిస్:** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్తంగా ఇంధన సెగ పెంచుతున్నాయి. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో అతలాకుతలమవుతున్న చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఆదుకునేందుకు ఫ్రాన్స్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెరుగుతున్న ఇంధన భారంతో సతమతమవుతున్న వ్యాపారుల కోసం 'ఫ్లాష్ ఫ్యూయల్ లోన్లు' పేరుతో ఒక అత్యవసర రుణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఫ్రాన్స్ ప్రకటించింది. అర్హత కలిగిన సంస్థలు 50,000 యూరోల (సుమారు రూ.53.64 లక్షలు) వరకు రుణం పొందవచ్చు. రవాణా, వ్యవసాయం, మత్స్య పరిశ్రమలకు చెందిన చిన్న, మధ్య తరహా సంస్థలకు ఈ పథకం వర్తిస్తుంది. మూడేళ్ల కాల పరిమితి గల ఈ రుణాలపై 3.8 శాతం వడ్డీ వసూలు చేస్తారు. పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ 'బీపీఐఫ్రాన్స్' ద్వారా డిజిటల్ పద్ధతిలో కేవలం ఏడు రోజుల్లోనే రుణ ప్రక్రియ పూర్తి చేసి నిధులు మంజూరు చేస్తారు. ఇంధన ధరల పెరుగుదల వల్ల కలిగే ఆర్థిక ఇబ్బందులను అరికడతామని ఫ్రాన్స్ ప్రధాన మంత్రి సెబాస్టియన్ లెకోర్ను గత వారం ఇచ్చిన హామీని ఈ పథకం ద్వారా నెరవేర్చారు. యుద్ధ ప్రభావం వల్ల సామాన్యులపై, వ్యాపారాలపై పడుతున్న భారాన్ని తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆర్థిక మంత్రిత్వ శాఖ పేర్కొంది. మరోవైపు, అంతర్జాతీయ యుద్ధ పరిస్థితులను ఆసరాగా చేసుకుని యూరప్‌లోని రిఫైనరీలు ఇంధన ధరలను అడ్డగోలుగా పెంచుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ దుర్వినియోగంపై విచారణ జరపాలని కోరుతూ ఫ్రెంచ్ ఆర్థిక మంత్రి రోలాండ్ లెస్క్యూర్ యూరోపియన్ కమిషన్‌కు లేఖ రాశారు. యుద్ధం పేరుతో కంపెనీలు అక్రమంగా లాభాలు గడిస్తున్నాయా అనే కోణంలో దర్యాప్తు చేయాలని ఆయన కోరారు. ఇంధన సంక్షోభం నుంచి దేశీయ పరిశ్రమలను కాపాడుకునేందుకు ఫ్రాన్స్ తీసుకున్న ఈ చర్యలు ఐరోపాలో చర్చనీయాంశంగా మారాయి.

## ఇరాన్ లక్ష్యం 'బాబ్ అల్ మాండెబ్'



**తెహ్రాన్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు ముగింపు ఎప్పుడో తెలియని అనిశ్చితి ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికే హార్ముజ్ దిగ్బంధంతో చాలా దేశాల్లో చమురు, గ్యాస్ సంక్షోభం నెలకొంది. ఇలాంటి నేపథ్యంలో యుద్ధాన్ని విస్తరించేలా ఇరాన్ నుంచి హెచ్చరికలు వచ్చాయి. తమ తదుపరి లక్ష్యం 'బాబ్ అల్ మాండెబ్' జలసంధి అని అర్థం వచ్చేలా ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాగేర్ గాలిబఫ్ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. 'అంతర్జాతీయంగా చమురు, ఎల్ఎన్‌జీ, గోధుమలు, బియ్యం, ఎరువుల రవాణాలో ఎంత వాటా బాబ్ అల్ మాండెబ్ మీదుగా వెళ్తోంది. ఏఏ దేశాలు, కంపెనీలు ఎక్కువగా లబ్ధి పొందుతున్నాయి' అని అర్థం వచ్చేలా ఇరాన్ స్పీకర్ తన 'ఎక్స్' ఖాతాలో రాసుకొచ్చారు. ఈ జలమార్గం కూడా మూసుకుపోతే ప్రపంచం మరింతగా కష్టాల్లో కూరుకుపోనుంది. మాండెబ్ జలసంధి... యెమన్, జిబౌటి మధ్య ఉంది. ఎర్ర సముద్రాన్ని అరేబియా సముద్రంతో అనుసంధానం చేస్తోంది. సూయెజ్ కాలువ దిశగా వెళ్లే నౌకలు, చమురు ట్యాంకర్లకు ఇది కీలక మార్గంగా మారింది. ఎర్ర సముద్రానికి, గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌కు మధ్య ద్వారంలా వ్యవహరిస్తోంది. దీని వెడల్పు 30 మీటర్లు మాత్రమే. ఆసియా, ఐరోపా, ఉత్తర అమెరికా, పశ్చిమాసియా మధ్య ప్రయాణించే నౌకల మధ్య మాండెబ్ జలసంధి ఒక గేట్‌వేలా పనిచేస్తోంది. నిత్యం ఈ మార్గంలో 45 లక్షల బ్యారెళ్ల చమురు రవాణా అవుతోంది. అంతర్జాతీయ వాణిజ్యంలో 1012 శాతం ఈ మార్గం ద్వారానే పయనిస్తోంది. ప్రధాన మార్కెట్ల మధ్య ఎల్ఎన్‌జీ, తయారీ వస్తువులు, ఆహార పదార్థాలు ఈ మార్గంలోనే రవాణా అవుతున్నాయి. ఏటా రూ.93.95 లక్షల కోట్ల విలువైన సరకులు మాండెబ్ జలసంధి గుండా రవాణా అవుతున్నట్లు అంచనా. మాండెబ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధిస్తే సరకు రవాణా నౌకలు ఆఫ్రికాలోని దక్షిణ భాగం నుంచి పయనించాల్సి వస్తుంది. దీనివల్ల ప్రయాణ సమయంతోపాటు ఖర్చులూ పెరుగుతాయి. మాండెబ్ జలసంధిలో జిబౌటి వైపున అమెరికా భారీ సైనిక స్థావరం ఉంది. అందువల్ల దానిని మూసేస్తే అమెరికా నుంచి తీవ్ర ప్రతిఘటన రావొచ్చన్న అంచనాలున్నాయి.

## అప్పు చెల్లించాలని పాక్‌పై యుఎఇ ఒత్తిడి



**ఇస్లామాబాద్:** అమెరికాఇజ్రాయిల్, ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియా అట్టుడుకుతున్న వేళ... తమ అప్పు తీర్చాల్సిందిగా పాకిస్థాన్‌ను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) కోరింది. తమ డబ్బులు తిరిగి చెల్లించాల్సిందిగా ఒత్తిడి తీసుకువస్తోంది. దీంతో పాకిస్థాన్ ఏప్రిల్‌లో మొత్తం 3.5 బిలియన్ డాలర్ల రుణం తిరిగి చెల్లించాలని నిర్ణయించుకుంది. ప్రస్తుతం జరుగుతున్న ఇరాన్ యుద్ధం నేపథ్యంలో యూఏఈ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇరాన్ దాడులతో యూఏఈ కూడా ఇబ్బందుల పాలవుతోంది. దుబాయ్, అబుదాబీపై ఇరాన్ దాడులు చేస్తోంది. ఈ పరిస్థితుల్లో యూఏఈ తన రుణాన్ని త్వరగా తిరిగి పొందాలని భావిస్తోంది. పాకిస్థాన్ యూఏఈకి ఇవ్వాల్సిన రుణ చెల్లింపులను షెడ్యూల్ చేసింది. ఏప్రిల్ 11న 450 మిలియన్ డాలర్లను, ఏప్రిల్ 17న రెండు బిలియన్ డాలర్లను, ఏప్రిల్ 23న బిలియన్ డాలర్లు తిరిగి చెల్లించాలని నిర్ణయించుకుంది. ఇదే నెలలో 1.3 బిలియన్ డాలర్ల యూరోబాండ్ కూడా చెల్లించాల్సి ఉంది. దీంతో ఏప్రిల్‌లో మొత్తం 4.8 బిలియన్ డాలర్లను పాకిస్థాన్ చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం పాకిస్థాన్ వద్ద 16.4 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు మాత్రమే ఉన్నాయి. ఇందులో మిత్రదేశాలైన యూఏఈ, సౌదీ అరేబియా, చైనా నుంచి వచ్చిన డిపాజిట్లే ఎక్కువ. ఈ వ్యవహారంపై ఇటీవల పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మాట్లాడుతూ... విదేశీ సాయంపై ఆధారపడాల్సి రావడం తనకు ఇబ్బందికరంగా ఉందని అన్నారు. మరోవైపు, పాకిస్థాన్ ఆర్థిక ఇబ్బందులు తీవ్రంగా పెరిగాయి. ఇరాన్ యుద్ధం కారణంగా పాకిస్థాన్ చమురు ఇబ్బందులు ఎదుర్కొంటోంది. దేశంలో ద్రవ్యోల్బణం పెరిగింది. ఎగుమతులు 8 శాతం తగ్గాయి. విదేశీ పెట్టుబడులు తగ్గడంతో పాటు అంతర్జాతీయ ఒత్తిడి పెరిగింది. ఆర్థిక సంక్షోభం కారణంగా పాకిస్థాన్ ఐఎంఎఫ్ నుంచి ఏడు బిలియన్ డాలర్లను అప్పుగా తీసుకుంది.



## ప్రజల్లోకి రావాలి
(మొదటి పేజీ తరువాయి)

అడిగినన్ని నిధులు ఇస్తున్నట్లు తెలిపారు. ఇక్కడి ప్రజలను నమ్మించి గొంతు కోసిన కెసిఆర్‌ను ఎమ్మెల్యే పదవి నుండి తొలగించాలని గవర్నర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు గుర్తు చేశారు. కెసిఆర్ క్యాంపు ఆఫీస్ అన్నింటికీ అడ్డాగా మరిందని, ఆయన మాత్రం ఇక్కడ అడుగుపెట్టిన దాఖలాలు లేవని విమర్శించారు. కెసిఆర్ క్యాంపు కార్యాలయాన్ని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు పేదలకు చేరుతుండడంతో జీర్ణించుకోలేక బిఆర్ఎస్ అడ్డు తగులుతున్నట్లు వివరించారు. కాగా మొదటగా గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుండి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున కెసిఆర్ క్యాంపు ఆఫీస్ వద్దకు ర్యాలీ నిర్వహించి సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని బిగించి నిరసన కార్యక్రంమ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్లు సర్దార్ ఖాన్, ప్రభాకర్ గుప్త, మండల పార్టీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, సుఖేందర్ రెడ్డి, కనకయ్య గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు అశోక్ రెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ నేత సమీర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, కౌన్సిలర్లు, నేతలు సత్యలక్ష్మి యాదగిరి, షరీఫ్, సారిక శ్రీనివాస్ రెడ్డి, సంతోష రాములు గౌడ్, నర్సింహా రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, గుంటుకు శ్రీనివాస్, జంగం రమేష్ గౌడ్, కరుణాకర్ రెడ్డి, అస్గర్, అజహర్ పాల్గొన్నారు.

## బడా కంపెనీలే లక్ష్యం
(మొదటి పేజీ తరువాయి)

ఇటువంటి దాడులను ఎదుర్కోగలమని పేర్కొన్నారు. ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని సజ్జనర్ చెప్పారు. అలాగే బాధితులు http://cybercrime.gov.in పోర్టల్‌లో తమ ఫిర్యాదును వెంటనే నమోదు చేయాలని అన్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత్త వహించాలని ఆయన తెలిపారు.

## హెల్త్ వీక్ (మొదటి పేజీ తరువాయి)

చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. జిల్లాల్లో కూడా ఉదయం ఈట్ రైట్ వాక్‌లు, మధ్యాహ్నం ఫుడ్ రిజిస్ట్రేషన్ మేళాలు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రి సూచించారు. 8న సేఫ్ మదర్ డే, 9వ తేదీనఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు ఉంటాయని, జైళ్లలో ప్రత్యేక వైద్య శిబిరాలు, ట్రాన్స్ జెండర్ క్లినిక్స్‌లో వైద్య సేవలు, ఉచిత పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. 10న హోమియోపతి, ఆయుష్ డే , 11న డ్రగ్స్ కంట్రోల్ రెగ్యులేటరీ స్ట్రెంథెనింగ్ డేగా నిర్వహించనున్నట్లు మంత్రి తలెఇపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యనారాయణ, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవింద్ర నాయక్ , వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బాబూ జగ్జీవన్ రామ్ జీవితం దేశానికి ఆదర్శం : సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్వాతంత్ర్య సమర యోధుడు, మాజీ ఉప ప్రధానమంత్రి డాక్టర్. బాబూ జగ్జీవన్ రామ్ జీవితం దేశానికి ఆదర్శమని, ఆయన సేవలు చిరస్మరణీయమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కొనియాడారు. ఆదివారం బాబూ జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా సిఎం ఆయనను గుర్తు చేసుకున్నారు. పేదరికంలో పుట్టినా, తన పట్టుదలతో ఉన్నత స్థాయికి ఎదిగిన ఆయన దళితుల హక్కులు, కుల వివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా జీవితాంతం పోరాటం చేశారని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని, తొలి ప్రధాని నెహ్రూ మంత్రివర్గంలో మంత్రిగా సేవలందించిన ఆయన అణగారిన వర్గాలు, కార్మికుల సంక్షేమం కోసం ఎనలేని కృషి చేశారన్నారు. బాబూజీ స్ఫూర్తితోనే తెలంగాణలో ప్రజా పాలన కొనసాగిస్తున్నామని, సామాజిక న్యాయం, అన్ని వర్గాల మేలుకు ప్రభుత్వం కృషి చేస్తోందని సిఎం చెప్పారు.

దేశానికే ఆదర్శంగా కుల గణన చేపట్టామని, బీసీ రిజర్వేషన్ల పెంపు, ఎస్‌సి వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. బాబూజీ ఆశయాలే తమకు మార్గదర్శకమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## వెనక్కి తగ్గిన పాక్ సర్కారు

**లీటర్ పెట్రోల్‌పై రూ.80 తగ్గింపు**



**ఇస్లామాబాద్:** పశ్చిమాసియా ఘర్షణలు చాలా దేశాల్లో ఇంధన సంక్షోభానికి దారితీస్తున్నాయి. దాంతో ఆయా దేశాలు పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలు పెంచుతుండటంతో సామాన్యులపై భారం పడుతోంది. ఇప్పటికే ఆర్థిక సమస్యలతో సతమతమవుతోన్న పాకిస్థాన్... చమురు ధరలు పెంచి విమర్శల పాలైంది. దాంతో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ ధరను 80 పాకిస్థానీ రూపాయ లు తగ్గిస్తూ రాత్రికి రాత్రే షరీఫ్ ప్రకటన చేయా ల్సి వచ్చింది. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో పాక్ ఇంధన ధరలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. పెట్రోల్‌పై 43 శాతం, హైస్పీడ్ డీజిల్‌పై 55 శాతం పెంపు ప్రకటించింది. దాంతో పెట్రోల్ ధర 458 పాకిస్థానీ రూపాయలకు పెరిగింది. హెచ్ఎస్‌డీ ధర 520 పీకేఆర్‌కు చేరింది. దీంతో ప్రజల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. ఈ క్రమంలోనే శుక్రవారం అర్ధరాత్రి షరీఫ్ మాట్లాడుతూ.. 'పెట్రోల్‌పై 80 పీకేఆర్ తగ్గిస్తున్నాం. దాం తో లీటర్ ఇకనుంచి 378 పీకేఆర్‌కే లభిస్తుంది. కనీసం ఒక నెల రోజుల పాటు ఈ ధరలో మార్పు ఉండదు. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులే పెట్రోల్ ధరలు పెరుగుదలకు కారణం. అయితే వాటిని నియంత్రణలో ఉంచడానికి ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుంటోంది' అని వెల్లడించారు. హెచ్ఎస్‌డీపై కూడా లెవీని తొలగించింది. పెట్రోల్ ధరలు పెంచడంతో ప్రజలు రోడ్డుపైకి వచ్చారు. 'మమ్మల్ని చంపేయండి' అంటూ నినాదాలు చేశారు. పెట్రోలు బంకుల వద్ద భారీగా బారులు తీరారు.

## విజయన్ దక్షిణాది ఆశాకిరణం: ప్రకాశ్ రాజ్

**తిరువనంతపురం:** దేశవ్యాప్తంగా అన్యాయం, అసమానతలు పెరుగుతున్న సమయంలో కేరళ రాష్ట్రం అభివద్ధి, సౌభ్రాతత్వానికి హరితాండవంగా నిలుస్తోందని ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ అన్నారు. కన్నూర్‌లో జరిగిన ఒక సాంస్కతిక కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గత పదేళ్లుగా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ దక్షిణ భారతదేశానికి ఆశాకిరణంగా నిలిచారని ప్రకాశ్ రాజ్ ప్రశంసించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రాజీలేని ధోరణి తీసుకోవడంలో ఆయన చూపుతున్న దథత్వం అభినందనీయమని పేర్కొన్నారు. మతతత్వానికి వ్యతిరేకం గా నిలబడే నాయకులు దేశానికి అవసరమని, దక్షిణ భారత ముఖ్యమంత్రులు ఈ విషయం లో కఠిన వైఖరి అవలంబిస్తున్నారని ఆయన అన్నారు. బిజెపి కి భయపడని నాయకత్వం అవసరమని కూడా వ్యాఖ్యానించారు. రాబో యే ఐదేళ్ల పాటు పినరయి విజయన్ పదవిలో కొనసాగాలని తాను కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రకాశ్‌రాజ్ ప్రసంగిస్తున్న సమయంలో ముఖ్యమంత్రి పినరయి వేదికపై ఉన్నారు. ప్రముఖ రచయిత టి.పద్మనాభన్ ముఖ్యమంత్రిపై తన గౌరవాన్ని వ్యక్తం చేశారు. ప్రముఖ నటుడు కమల్ హాసన్ వీడియో సందేశం ద్వారా కార్యక్రమానికి మద్దతు తెలిపారు. యువ ర్యాపర్ వేదన్ సంగీత ప్రదర్శనతో సభ ఆకట్టుకుంది. సాంస్కతిక, సామాజిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## శశిథరూర్ గన్‌మెన్, డ్రైవర్‌పై దాడి

**తిరువనంతపురం:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ కాన్వాయ్‌కు చెందిన డ్రైవర్, గన్‌మెన్‌పై దాడి జరిగింది. కేరళలోని వాండూర్‌లో ఉన్న చెల్లితోడ్ వద్ద శుక్రవారం రాత్రి ఐదుగురు సభ్యుల బందం వీరిపై దాడి చేసింది. ఎంపీ శశిథరూర్ గన్‌మెన్ కేపీ రతీశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిర్యాదు నమోదు చేసినట్లు వాండూర్ పోలీసులు చెప్పారు. కాంగ్రెస్ నేత ఏపీ అనిల్‌కుమార్ నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు థరూర్ వెళ్తున్నారు. అయితే చెల్లితోడ్ బ్రిడ్జ్ వద్ద రోడ్డు బ్లాక్ అయింది. నిందితులు రెండు వాహనాలతో. .. ఎంపీ వాహనాన్ని అడ్డుకున్నారు. అయితే ముందు న్న వాహనాలను క్లియర్ చేసేందుకు ఎంపీ గన్‌మెన్ ప్రయత్నిస్తున్న సమయంలో గలాట జరిగింది. గన్‌మెన్‌తో పాటు డ్రైవర్‌పై అటాక్ చేసినట్లు ఎఫ్ఐఆర్ లో రాశారు. దాడికి పాల్పడిన వ్యక్తుల్లో ఒకర్ని అదుపులోకి తీసుకున్నారు.

## రాజకీయ వ్యభిచారిలా బిఆర్ఎస్ పార్టీ

### ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ పార్టీ రాజకీయ వ్యభిచారిలా మారిందని రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ ఆరోపించారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ ఇబ్రహీంపట్నంలో బిజెపితో పొత్తు పెట్టుకుని గెలిచి, బిఆర్ఎస్ నేత చైర్మన్‌గా, బిజెపి నేత వైస్ చైర్మన్‌గా పదవులు చేపట్టారని తెలిపారు. అలాగే క్యాతనపల్లిలో బిఆర్ఎస్ దౌర్జన్యాలకు పాల్పడి, సిపిఐ పార్టీ మద్దతుతో గెలిచిందన్నారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ రాష్ట్రంలో అనైతిక రాజకీయాలకు పాల్పడుతున్నారని, 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్ ఒక్కటిగా పనిచేశాయని ఆరోపించారు. గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కూడా ఈ రెండు పార్టీలు కలిసి పనిచేశాయని పేర్కొన్నారు. బిఆర్ఎస్, బిజెపి కుమ్మక్కు రాజకీయాలను తెలంగాణ ప్రజలు గమనించాలని సాయికుమార్ కోరారు.

## తిరుమల తరహా నిబంధనలు
(మొదటి పేజీ తరువాయి)

గౌరవిస్తూ, ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయ అభివృద్ధి జరగాలని సిఎం సంబంధిత అధికారులను ఆదేశించారు. భక్తుల విశ్వాసాలు దెబ్బతినకుండా ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండాలని, ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా నిబంధనలు కఠినతరం చేయాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. భవిష్యత్ అవసరాలు, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రోడ్లు నిర్మించాలని సిఎం ఆదేశించారు. ఆలయ ప్రాంగణం భవిష్యత్‌లో భారీ వృక్షాలతో అలరారేలా అవసరమైన మొక్కలు నాటాలని రేవంత్ రెడ్డి సూచించారు. ఆలయం సమీపంలో హెల్త్ సెంటర్ నిర్మించాలని, పుష్కరాలు, ఇతర ఉత్సవాల రోజుల్లో అక్కడ తగిన సంఖ్యలో వైద్యులు, వైద్య సిబ్బంది ఉండి భక్తులకు సేవలు అందించేందుకు అనువుగా దానిని నిర్మించాలన్నారు. ఎంతటి ప్రముఖుల వాహనాలైనా ఆలయ ప్రాంగణానికి బయటే నిలిచిపోవాలని, ఆలయ ప్రాంగణంలోకి కేవలం ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) ద్వారానే చేరుకునేలా చూడాలని, ఇందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని సిఎం ఆదేశించారు. వాహనాల పార్కింగ్ ప్రదేశంలో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేయాలన్నారు. అభివృద్ధి పనుల సమయంలో ఆలయ పవిత్రతకు ఎటువంటి భంగం కలగకుండా జాగ్రత్త పడాలని, అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీపడితే ఏమాత్రం సహించేది లేదని సిఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపి వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉపగ్రహ ఇమేజింగ్
(మొదటి పేజీ తరువాయి)

నష్టపరిహార అమలులో పారదర్శకత పెరుగుతుందని వెల్లడించారు. అంతకు ముందు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్ నీలిమ గత ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన శాటిలైట్ డేటా ఆధారంగా జిల్లాలు, మండలాలు, గ్రామాల వారీగా పంటల విస్తీర్ణం, వ్యవసాయశాఖ క్రాప్ బుకింగ్ డేటాలో ఉన్న స్వల్ప తేడాలను వివరించారు. వచ్చే సీజన్ నుంచి పూర్తి స్థాయిలో ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, ఇతర ఉన్నతాధికారులు, వ్యవసాయ యూనివర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాం: జైశంకర్



**రాయపూర్:** ప్రపంచవ్యాప్తంగా ఎదురవుతోన్న అనేక సవాళ్లు భారత్ సామర్థ్యాలను పరీక్షిస్తూనే ఉన్నాయని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. ఇతర దేశాల నుంచే కాక అంతర్గతంగా ఎదురైన ఎన్నో సవాళ్లను మన దేశం విజయవంతంగా ఎదుర్కొందని వెల్లడించారు. ఐఐఎం రాయపూర్‌లో శనివారం జరిగిన స్నాతకోత్సవంలో మంత్రి జైశంకర్ మాట్లాడారు. 'ప్రపంచవ్యాప్తంగా వస్తోన్న మార్పులను అంగీకరించడంలో కొన్ని దేశాలు ఇబ్బందిపడుతున్నాయి. ఈ పరిణామాలతో ఆ దేశాల్లో వస్తోన్న మార్పులతో ప్రపంచక్రమం మారుతోంది. సరికొత్త సాంకేతికతలు, సవాళ్లు ఈ పోటీ వాతావరణంలో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడాన్ని ప్రోత్సహించాయి. ప్రపంచంలో ఎన్నో దేశాల్లో కొరవడిన ఆశావాదం మన దగ్గర కనిపిస్తోంది. ఎందుకలా అని మీరు అడగొచ్చు. గత పది సంవత్సరాలు చాలా మెరుగ్గా ఉన్నాయి. అందుకే రాబోయే పది సంవత్సరాలు, ఆ తర్వాత కూడా అలాంటి వాతావరణమే ఉంటుందనే విశ్వాసం కలిగింది. ఇదిలాఉంటే... ప్రపంచంలోనే ఐదు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో మనది కూడా ఒకటి. ఇటీవల మన సామర్థ్యాన్ని పరీక్షించిన ఎన్నో షాక్‌ల నుంచి విజయవంతంగా బయటపడ్డాం. అది ఎవరూ కాదనలేని విషయం. అలాగే ప్రపంచవ్యాప్తంగా వస్తోన్న విస్తృత మార్పులకు అనుగుణంగా మన సామర్థ్యాలను పెంపొందించుకోవడం అతి ముఖ్యం' అని విద్యార్థులకు సూచించారు.

### దళిత సాధికారతకు

# సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ సమగ్ర వేదిక

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దళిత సాధికారతకు సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ (సిడిఎస్) సమగ్ర వేదిక అని ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. హైదరాబాద్ బోరబండలోని సిడిఎస్‌ను శనివారం మంత్రి సందర్శించారు. కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎంఎల్‌ఎ నవీన్ యాదవ్, రెహమత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ సీన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిడిఎస్ కేంద్రంలోని సౌకర్యాలు, పరిపాలన కార్యాలయాలు, ఆధునిక డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, డిజిటల్, ఫిజికల్ లైబ్రరీలు, మీడియా రూమ్‌లు, శిక్షణార్థుల వసతి గదులు, అత్యాధునిక ఆడిటోరియం, దళిత్ మ్యూజియం వంటి విభాగాలను మంత్రి ప్రత్యక్షంగా పరిశీలించారు. కేంద్ర భవన నిర్మాణం, అందుబాటులో ఉన్న సదుపాయాలు, గత 26 ఏళ్లుగా దళితులు, వెనుకబడిన వర్గాల సాధికారత కోసం సిడిఎస్ చేపట్టిన పరిశోధనలు,శిక్షణ, అవగాహన కార్యక్రమాలు, విధాన సూచనలపై సిడిఎస్ చైర్మన్ మల్లెపల్లి లక్ష్మయ్య వివరించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఐఎఎస్ అధికారి కాకి మాధవరావు, ప్రొఫెసర్ లింబాద్రి, సీనియర్ జర్నలిస్టు రామచంద్రమూర్తి, తిప్పర్తి యాదయ్య తదితరులు కూడా కేంద్ర కార్యకలాపాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. వివిధ కార్యక్రమాల అమలుకు రూ.15కోట్ల ఎండోమెంట్ ఫండ్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ మౌలిక వసతులు, పరిశోధనా సామర్థ్యం ప్రభుత్వానికి కూడా ఉపయోగపడతాయని, సమర్పించిన ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించి, వ్యక్తిగతంగా చొరవ తీసుకుని ముందుకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి దామోదర రాజనర్సింహ, సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి, కేంద్రానికి అవసరమైన మద్దతు అందించే చర్యలు తీసుకుంటామని తెలిపారు.



### ట్రాన్స్‌జెండర్ సాధికారతకు తెలంగాణ మరో ముందడుగు

ట్రాన్స్‌జెండర్‌ల సామాజిక, ఆర్థిక సాధికారత దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసిందని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ట్రాన్స్‌జెండర్‌లకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని శనివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో గల నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో ప్రారంభించారు. మంత్రి లక్ష్మణ్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్‌లకు గౌరవప్రదమైన జీవనం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇప్పటికే ట్రాఫిక్ నియంత్రణ, మెట్రోలో సెక్యూరిటీ గార్డులుగా ట్రాన్స్‌జెండర్‌లను నియమించినట్లు గుర్తు చేశారు. ఇప్పుడు స్వయం ఉపాధికి దోహదపడేలా మూడు ముఖ్య రంగాల్లో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, పిడబ్ల్యూడి ఎస్, టిజిపి డైరెక్టర్ శైలజ, ఎన్‌ఐటిహెచ్‌ఎం డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వెంకట రమణ, తెలంగాణ రాష్ట్ర ఏవియేషన్ అకాడమీ సెక్రటరీ, సిఇఒ కెప్టెన్ ఎస్.ఎన్.రెడ్డి, శేరిలింగంపల్లి ట్రాఫిక్ డిసిపి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులైన విద్యార్థులకు సహకారం అందించాలి

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి

ఘనంగా మేధో దివ్యాంగుల పాఠశాల 36వ వార్షికోత్సవం





**ప్రజాపక్షం/కరీంనగర్ :** మానవ సేవే మాధవ సేవ అని, మానసిక, శారీరక వైకల్యం కలిగిన విద్యార్థులకు సేవ చేస్తే మనిషికి గొప్ప ఆత్మసంతృప్తి కలుగుతుందని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తిమ్మాపూర్ మండలం ఎల్ఎండి కాలనీ మహాత్మా నగర్‌లో స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మేధో దివ్యాంగుల ప్రత్యేక పాఠశాల, వృత్తి విద్యాశిక్షణ కేంద్రం 36వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి, ట్రస్టు సభ్యులతో కలిసి శ్రీనివాస్‌రెడ్డి జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జన్యులోపాలతో మేధోపరమైన వెనుకబాటుతనం కలిగిన బాలబాలికల కోసం స్వాతంత్ర్య సమరయోధులు ముందు చూపుతో పాఠశాల ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. కెవి.నర్సింగరావు ఆధ్వర్యంలో ఈ పాఠశాల ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమర యోధులకు కృతజ్ఞతలు తెలిపారు. చుట్టుపక్కల ప్రజలకు ఈ పాఠశాల దేవాలయంగా విలసిల్లుతుందన్నారు. అంగవైకల్యం ఒక ఎత్తు, మానసిక వైకల్యం ఒక ఎత్తని, ఈ పాఠశాలలో పిల్లల బాగోగులు, సంరక్షణ బాధ్యతలు చూస్తున్న టీచర్లు, ఆయాలు, సిబ్బందిని దేవుళ్ళుగా ఆయన అభివర్ణించారు. చాడ వెంకట్‌రెడ్డితో తనకు ఐదు దశాబ్దాలుగా అనుబంధం ఉందని, ఈ పాఠశాలను తనకున్న పరిచయాలతో మరింత అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 50లక్షల కేటాయించిందని, తనవంతుగా పాఠశాలకు అన్నివిధాలుగా సహకారం అందిస్తానని శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి ఈ పాఠశాలను తీసుకెళ్లి వారు సందర్శించేలా కృషిచేస్తానని వివరించారు.

ఈ పాఠశాల విద్యార్థి విస్తరాకుల తయారీతో రోజుకు రూ.500 సంపాదిస్తూ, మూడు లక్షలు తన బ్యాంకు ఖాతాలో జమచేసుకోవడం అభినందనీయన్నారు. మానవత్వం ఉన్న ప్రతిఒక్కరూ ఈ పాఠశాల అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ1990లో ఈ పాఠశాల ప్రారంభమైతే తాను 1996లో ట్రస్ట్ సభ్యుడిగా జాయిన్ అయినట్లు వివరించారు. ఎస్సారెస్పీ అధికారులతో మాట్లాడి రెండు ఎకరాల భూమి కేటాయించినట్లు గుర్తుచేశారు. దాతలు, సహకారంతో పాఠశాలను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. 2004లో తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత 25లక్షలతో పాఠశాల భవనాలను నిర్మించినట్లు వెంకట్ రెడ్డి గుర్తుచేశారు. సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనిత రామచంద్రన్ చొరవ, స్త్రీ నిధి బ్యాంకు సహకారంతో రూ.26 లక్షలతో బస్సును కేటాయించినట్లు వివరించారు. మంత్రులు సీతక్క, లక్ష్మణ్ కుమార్, దాతలు పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చినట్లు వివరించారు. ఈ పాఠశాల అభివృద్ధి వెనుక అనేకమంది పాత్ర, సహకారం ఉందన్నారు. నాపోం సిఇఒ రాజు పాఠశాల అభివృద్ధికి ఏటా సహకారం అందిస్తున్నట్లు వివరించారు. ఈ పాఠశాలకు ప్రతి సంవత్సరం తనవంతుగా 20,000 అందిస్తానని చీఫ్ ఇంజనీర్ సుమతి దేవి ప్రకటించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన అతిథులను నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సతీష్, ఐజేయు సెంట్రల్ ఇసి మెంబర్ శేఖర్, ట్రస్టు సభ్యులు సత్యనారాయణ, అశోక్ పాల్గొన్నారు.



## పేదల హక్కులు, సంక్షేమం కోసం సిపిఐ నిరంతర పోరాటాలు

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ్మా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పేదల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం నిరంతరం ఉద్యమిస్తున్న సిపిఐకి విరివిగా విరాళాలు అందించి ప్రజా ఉద్యమాల్లో భాగస్వామ్యం కావాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ విజ్ఞప్తి చేశారు. ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో భాగంగా శనివారం సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో 'షాప్ టు షాప్' కరపత్రాలు పంచుతూ చే నెంబర్, అంబర్‌పేట్, గోల్నాక ప్రాంతాలలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఈ.టి.నరసింహమాట్లాడుతూ ప్రజల కోసం పనిచేస్తున్న కమ్యూనిస్టు పార్టీని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్. ఛాయా దేవి, కౌన్సిల్ సభ్యులు బి.వెంకటేష్, జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, నేర్లకంటి శ్రీకాంత్, కౌన్సిల్ సభ్యులు, కాశన్న, జంగయ్య, కళ్యాణ్, ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఫీజుల దోపిడీపై అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలి

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీపై ప్రభుత్వం మౌనం వీడాలని, తక్షణమే ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని శుక్రవారం జాగృతి కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ విద్యాసంస్థల ఆగడాలతో పేద, మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించినప్పుడు, లక్షలాది కుటుంబాలను ప్రభావితం చేసే ఫీజుల నియంత్రణ బిల్లు కోసం అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ఎందుకు నిర్వహించడం లేదని ఆమె ప్రశ్నించారు. తెలంగాణ విద్యా కమిషన్ ముసాయిదా బిల్లును సమర్పించి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం కావాలనే కాలయాపన చేస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తోందని విమర్శించారు.

# బస్‌భవన్‌లోకి వాణిజ్య పన్నుల శాఖ ఎంట్రీకి బ్రేక్

ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేసిన టిజిఎస్‌ఆర్‌టిసి

'ఏ బ్లాక్' కార్యాలయాలకు సీల్ వేసిన ఎపిఎస్‌ఆర్‌టిసి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టిజిఎస్‌ఆర్‌టిసి) ప్రధాన కార్యాలయం బస్‌భవన్‌లోకి వాణిజ్య పన్నుల శాఖ తరలింపుకు బ్రేక్ పడినట్లు కనిపిస్తోంది. ఎపిఎస్‌ఆర్‌టిసి అధికారులు శనివారం ఏ బ్లాక్ కార్యాలయాలకు సీల్ వేసి, తమ ఆధీనంలోకి తీసుకున్నారు. దీనిపై అధికారులను వివరణ కోరగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బస్‌భవన్‌లోని ఏ బ్లాక్‌ను వాణిజ్య పన్నుల శాఖకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని, కానీ ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో అట్టి ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేసినట్లు వెల్లడించారు. కాగా, ''శనివారం బస్ భవన్ ఎ బ్లాక్‌లోని నాలుగు అంతస్తుల ప్రస్తుత పరిస్థితుల పర్యవేక్షణ కోసం టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం.థామస్ రెడ్డి, ముషీరాబాద్ డిపో జెఎసి నాయకులు ఎన్.కృష్ణలు కలిసి ఎ బ్లాక్ కు వెళ్లడం జరిగింది. ఎ బ్లాక్‌కు ఎపిఎస్‌ఆర్‌టిసికి చెందిన సిబ్బంది తాళాలు వేసి, సీల్ వేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్ర అధికారులు, సిబ్బంది మాట్లాడుతూ తెలంగాణ ఆర్‌టిసికి చెందిన యూనియన్ నాయకులు మాకు పూర్తిగా సపోర్ట్ చేయడం వల్లనే తాము ఈ రోజు ధైర్యంగా ఇక్కడ ఉన్నామని తెలిపారు. ఉమ్మడి ఆస్తులను కాపాడు కోవడానికి ఎపి, టిజి ఆర్‌టిసి ఒకరికొకరు సహాయం చేసుకోవాలని, ఈ ఆర్‌టిసి ఆస్తులపై మనకు మాత్రమే సర్వ హక్కులు ఉన్నాయని, ఏ ప్రభుత్వాలకు కూడ మన సంస్థ ఆస్తిలో జోక్యం గాని, హక్కుగాని ఉండబోదని స్పష్టం చేయడం జరిగింది. తెలంగాణ ఆర్‌టిసి జెఎసి తరుపున ఎపి సిబ్బందికి అండగా ఉంటామని, తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు పోరాడదామని సూచించడం జరిగింది. అందులో భాగంగా ఏప్రిల్ 7న చేపట్టిన 'బస్ భవన్ బచావో' యధాతథంగా ఉంటుంది'' అని స్పష్టం చేశారు.

### పినరయి విజయన్ ప్రభుత్వం సాధించిన విజయాలను తగ్గిస్తూ...

# కించపరచే విధంగా మాట్లాడడం గర్హనీయం

తెలంగాణ రాష్ట్రంలో ఏమేమి హామీలు అమలు జరిగాయో రేవంత్ రెడ్డి ఇక్కడి ప్రజలకు వివరించాలి

సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేరళలో పినరయి విజయన్ ప్రభుత్వం సాధించిన విజయాలను తగ్గిస్తూ, కించపరచే విధంగా వ్యాఖ్యానించడాన్ని సిపిఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏమి సాధించిందో తెలంగాణాలో ఉన్న సిపిఐ, సిపిఐ(ఎం) నాయకులకు వివరించాలని ఆయన డిమాండ్ చేశారు. కేరళ రాష్ట్రంలో ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేయడమే కాకుండా, తెలంగాణ రాష్ట్రంలో చేసిన ఆరు వాగ్దానాలను సక్రమంగా అమలు చేసామని, అవసరమైతే కేరళ రాష్ట్ర మంత్రివర్గం వచ్చి వాటిని పరిశీలించవచ్చని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. ఈ మేరకు రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ''తెలంగాణలో రేవంత్ సర్కార్ కల్యాణలక్ష్మి పేరుతో తులం బంగారం ఇస్తామని చెప్పిన హామీ అమలు జరగలేదని, జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని యువతను మోసం చేశారని, గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఏవైతే సెలక్షన్స్ జరిపిందో ఆ ఉద్యోగాలను భర్తీ చేశారే తప్ప కొత్తగా ఇచ్చిందేమీ లేదని, ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఇచ్చిన హామీ అటకెక్కించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులందరికీ రూ.2 లక్షల చొప్పున రుణమాఫీ హామీ కొంతమందివరకే అమలు చేశారని, రైతు భరోసా పేరుతో ప్రతి రైతుకు ఎకరాకు రూ.15వేలు చొప్పున ఇస్తామన్న హామీ కనీసం మహబూబ్‌నగర్ జిల్లాలో కూడా అమలు కాలేదని, కౌలు రైతుల గురించి మాట్లాడే పరిస్థితి కూడా లేకపోయిందన్నారు. తెలంగాణలో పెన్షన్ మొత్తాన్ని రూ.4,116లకు పెంచుతామని చెప్పిన హామీ నెరవేరలేదన్నారు.'యువ వికాసం పేరుతో ప్రతి ఒక్కరికి రూ.5లక్షలు, మహాలక్ష్మి పథకం కింద ప్రతినెల రూ.2,500 ఆర్థిక సాయం, తెలంగాణ ఉద్యమకారులు అందరికీ 200 గజాలు చొప్పున స్థలాలు ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన ఈ వాగ్దానాలన్నీ ఏమాత్రం అమలు చేయలేదు కానీ రేవంత్ రెడ్డి కేరళ రాష్ట్రం వెళ్లి, తెలంగాణ రాష్ట్రంలో ఏవేవో అద్భుతాలు జరిగినట్లుగా అసత్యాలు వల్లే వేయడం తగదని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ఇచ్చిన వాగ్దానాలు ఎక్కడ అమలు జరిగాయో సిపిఐ, సిపిఐ(ఎం) నాయకులకు ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.

## బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలు అందరికీ ఆదర్శం

టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలు అందరికీ ఆదర్శమని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. భారత మాజీ ఉప ప్రధాన మంత్రి బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ ఆయనకు ఘన నివాళులు అర్పించారు. సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలిచిన మహానేత బాబు జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి దేశానికి మార్గదర్శకమని అన్నారు. సమానత్వం, న్యాయం, సామాజిక సాధికారత కోసం బాబు జగ్జీవన్ రామ్ చూపిన దారి అందరికీ ఆదర్శమని చెప్పారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.

## కెసిఆర్ కార్యాలయంపై దాడి.. తెలంగాణ ప్రజల గుండెలపై దాడి

బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గజ్వేల్లోని మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడిని బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెసిఆర్ కార్యాలయంపై దాడి అంటే అది కేవలం ఒక భవనంపై జరిగిన దాడి కాదని, నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల గుండెలపై జరిగిన దాడి అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకుడిగా కెసిఆర్‌కు సభా నాయకుడితో సమానమైన హక్కులు ఉంటాయని, తన కార్యాలయంలో ఎవరి ఫొటో పెట్టుకోవాలనేది ఆయన వ్యక్తిగత ఇష్టమని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ, మోదీ ఫొటోలు పెట్టుకోవాలా?' అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని, కాంగ్రెస్ పార్టీ ఫ్యాక్షన్ వాతావరణాన్ని ప్రోత్సహిస్తోందని విమర్శించారు. డిజిపి ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తూ, ఈ దాడిని హత్యాయత్నం కింద పరిగణించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై చర్చ జరగకుండా ఉండేందుకే కాంగ్రెస్ ఇలాంటి అరాచకాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఈ ఘటనను టిపిసిసి అధ్యక్షుడు, మంత్రులు తక్షణమే ఖండించాలని, లేనిపక్షంలో ఈ దాడులను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లుగా భావించాల్సి ఉంటుందని శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. అభివృద్ధి పనులతో పేరు తెచ్చుకోవాలి కానీ, ఇలాంటి అరాచకాలతో కాదన్నారు.

# ఇది ప్రజాస్వామ్య జయకేతనం

కాంగ్రెస్ అరాచకాలను ఎదిరించి మున్సిపాలిటీలు కైవసం చేసుకున్నాం

సిపిఐ నేతలు అడుగడుగునా చూపిన పోరాట పటిమ స్ఫూర్తిదాయకం

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్ని అరాచకాలు చేసినా, ప్రలోభాలకు గురిచేసినా చివరకు ప్రజాస్వామ్యమే గెలిచిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు (కెటిఆర్) హర్షం వ్యక్తం చేశారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ విజయంలో మిత్రపక్షమైన సిపిఐ నేతలు అడుగడుగున చూపిన పోరాటపటిమ స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్, ఉప చైర్ పర్సన్ స్థానాలను బిఆర్ఎస్ కైవసం చేసుకోవడంపై కెటిఆర్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా ఎన్నికైన వారికి కెటిఆర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయం కోసం శ్రమించిన పార్టీ నేతలు బాల్క సుమన్, మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌లతో పాటు పార్టీ శ్రేణులకు పేరుపేరునా అభినందనలు తెలియజేశారు. అడ్డదారుల్లో మున్సిపాలిటీలను చేజిక్కించుకోవాలని కాంగ్రెస్ చూసినా, బెదిరింపులకు లొంగకుండా ఒక్క తాటిపై నిలిచిన కౌన్సిలర్లకు సెల్యూట్ చేస్తున్నాను అని కెటిఆర్ అన్నారు. కేవలం రెండున్నరేళ్లలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పీకల్లోతు ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని, ఈ ఫలితాలే దానికి నిదర్శనమన్నారు. అణచివేతకు, అవినీతికి తెలంగాణలో తావులేదన్నారు. రేవంత్ సర్కారుకు కౌంట్ డౌన్ మొదలైందన్నారు. మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో గులాబీ జెండా రెపరెపలాడించిన సైనికులను పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని, ఇదే స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామన్నారు. కొట్లాడి సాధించిన తెలంగాణను విధ్వంసం చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

# బిహార్ గ్యాంగ్‌లను తలపిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తల తీరు

గజ్వేల్ కెసిఆర్ క్యాంపు కార్యాలయంపై దాడిని ఖండించిన హరీశ్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గజ్వేల్ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడిని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. ఈ దాడి ముమ్మాటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో జరిగినదేనని ఆయన విమర్శించారు. పట్టపగలు ప్రజా ప్రతినిధుల కార్యాలయాలపై దాడులు జరుగుతుంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నాయా? అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల తీరు బీహార్ గ్యాంగ్‌లను తలపిస్తోందని విమర్శించారు. పోలీసు యంత్రాంగం కాంగ్రెస్ పార్టీకి ప్రైవేట్ సైన్యంలా మారిపోయిందని, దాడులను ఎందుకు అడ్డుకోవడం లేదని ఆరోపించారు. ప్రజాస్వామ్య పునరుద్ధరణే ఏడవ గ్యారంటీ అని చెప్పుకున్న కాంగ్రెస్, ఇప్పుడు ఉన్న ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. ఒక వైపు 'హేట్ స్పీచ్ బిల్' పేరుతో ప్రతిపక్షాల గొంతు నొక్కుతూ, మరోవైపు దాడులకు పాల్పడటం దుర్మార్గమన్నారు. మీ అణచివేతలకు, దాడులకు బిఆర్ఎస్ పార్టీ అదరదు, బెదరదని, ప్రజల పక్షాన అడుగడుగునా నిలదీస్తామని హరీశ్ రావు హెచ్చరించారు.

### ప్రభుత్వాసుపత్రుల కాంట్రాక్ట్ కార్మికుల జీతాల పెంపు కోసం..

# 21న ఛలో డిఎంఇ కార్యాలయం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేయుచున్న కాంట్రాక్టు శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల కు కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 21న కోటీలోని డిఎంఇ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండి.యూసుఫ్, ఎం.నరసింహాలు పిలుపునిచ్చారు. యూనియన్ రాష్ట్ర విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశం హిమాయత్‌నగర్ లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో పని చేయుచున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు రూ. 26 వేలు అమలు చేయాలని కాంట్రాక్టు లేబర్ చట్టం ప్రకారం నాలుగు పండగ సెలవులు, నాలుగు జాతీయ సెలవులు, 20 రోజుల పనికి ఒకరోజు వేతనంతో కూడిన సెలవు అమలు చేయాల్సి ఉన్నప్పటికీ వైద్యాధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల దోపిడి వలన కార్మికులు చట్టాలకు నోచుకోకుండా శ్రమదోపిడికి గురవుతున్నారని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.లక్ష్మీ బాయి, ఉప ప్రధాన కార్యదర్శి హసీనా బేగం, యూనియన్ రాష్ట్ర కార్యదర్శులు పి సురేష్, వై ఓమయ్య, ఏ పార్వతి, ఎస్ కిష్టమ్మ, జయలక్ష్మి, గన్నారపు రమేష్, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు రెహమాన్, శ్రీనివాస్, దశరథ్, సుధాకర్, షాహిన్ బేగం, స్వరూప, మదన్ సింగ్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు

## గజ్వేల్‌లో కెసిఆర్ క్యాంప్ కార్యాలయంపై దాడి దుర్మార్గం

బిఆర్ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు(కెసిఆర్) గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల జరిపిన దాడిని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజకీయాల్లో దాడులకు తావులేదని, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భౌతిక దాడులకు దిగడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వినోద్ కుమార్ అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను, అసహనాన్ని పక్కదారి పట్టించేందుకే కాంగ్రెస్ పార్టీ ఇలాంటి దౌర్జన్యాలకు, దాడులకు పాల్పడుతోందని మండిపడ్డారు. అధికార మదంతో ప్రతిపక్ష కార్యాలయాలపై దాడులు చేయడం దుర్మార్గమైన చర్య అని ఆయన అన్నారు. తెలంగాణలో శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఇలాంటి రెచ్చగొట్టే చర్యలను అరికట్టాలన్నారు.

GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ : చింతల్ సర్కిల్-54

NIT No. 05/DB/EE/Chintal Circle/CMC/2025-26 తేదీ: .04.2026

పని పేరు: బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పెయింటింగ్ వేయడం, అంచనా విలువ: రూ.0.99 లక్షలు, ప్రారంభ తేది & సమయం: 06.04.2026న మ.3.00గం.ల నుండి, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 09.04.2026న మ.3.30గం.ల వరకు, టెండర్ ఆహ్వానించు అథారిటీ వివరాలు మరియు మొబైల్ నెం. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 9701414306, హెడ్ డ్రాఫ్ట్స్‌మెన్, సెల్ నెం. 8712034411. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, చింతల్ సర్కిల్-54, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 112-PP/CL/ADVT/2026-27, Date: 04-04-2026




## మహిళలకు చట్టాలపై అవగాహన తప్పనిసరి

**సూర్యాపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రజిత గోపు**

**ప్రజాపక్షం/చివ్వెంల :** మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూర్యాపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రజిత గోపు సూచించారు. శనివారం మండల కేంద్రంలో గ్రామ ప్రజలలో చట్టపరమైన అవగాహన కల్పించేందుకు సూర్యాపేట జిల్లా న్యాయ సేవల అధికార సంస్థ ఆధ్వర్యంలో వరకట్నం, మహిళలపై క్రూరత్వం (సెక్షన్ 498ఏ), వరకట్నం మరణం (సెక్షన్ 304బి) నేరాలకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో ఎక్కువగా జరుగుతున్న వరకట్నం మరణాలు సహేతికం కాదన్నారు. పిల్లలపై క్రూరంగా ప్రవర్తించవద్దని కోరారు. అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాలు అంతకు ముందు పెళ్లి చేసుకుంటే అది బాల్య వివాహం కిందికి వస్తుందని అది చట్టపరంగా నేరమన్నారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ నల్లమల్ల హసన్, డిఎల్ఎస్ఏ నామినేటెడ్ మెంబర్ గుంటూరు మధు, డిప్యూటి లీగల్ ఎయిడ్ కౌన్సిల్ బొల్లెద్దు వెంకటరత్నం, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కె ప్రియదర్శిని, సర్పంచ్ కళ్యాణిపాల్గొన్నారు.

## గ్యాస్ అక్రమ వసూళ్లపై కఠిన చర్యలు

**ప్రజాపక్షం/చండూరు:** గ్యాస్‌కు ఎంత ఇయ్యాలే..?అని అడగటం మానేసి, తప్పనిసరిగా తమ ఇచ్చిన గ్యాస్‌కు రశీదు తీసుకోవాలని వినియోగదారులను పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తహసీల్దార్(డీటీ) మాచన రఘునందన్ సూచించారు. చండూరు సమీపంలోని ఓమారు మూల గ్రామంలో గ్యాస్ సిలిండర్లను సరఫరా చేస్తున్న వాహనాన్ని రఘునందన్ ఆపి తనిఖీ చేశారు.అక్కడ గ్యాస్ సిలిండర్ల కోసం వేచి ఉన్న వినియోగదారులతో మాట్లాడిన ఆయన గ్యాస్‌కు ఎంత చెల్లిస్తున్నారు? అని ప్రశ్నించగా రూ.1030 ఇస్తున్నాం అని వారు తెలిపారు.అలాగే రశీదు ఇవ్వడం లేదని కూడా పేర్కొన్నారు.దీంతో స్పందించిన రఘునందన్,గ్యాస్ సరఫరాలో అక్రమ వసూళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గ్యాస్ ఏజెన్సీ నిర్వహణ వ్యాపారం కాదని,సేవా భావంతో నిర్వహించాల్సిన బాధ్యతగా పేర్కొన్నారు.

## మిర్యాలగూడలో రన్ ఫర్ జీసస్




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నియోజకవర్గ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మిర్యాలగూడలోని అన్ని పాస్టర్స్ ఫెలోషిప్, సంఘ కాపరుల ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించి పట్టణంలో ర్యాలి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణలు పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఏసుక్రీస్తు చూపిన మార్గాన్ని అనుసరించాలని, ఆయన చూపిన మార్గం అందరికి అనుసరణీయమన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ గుడిపాటి శిరీషనవీన్, కౌన్సిలర్లు కోడిరెక్క భవానిఇంద్రకుమార్, యర్రమల్ల దినేష్, క్రైస్తవులు ముండ్లగిరి కాంతయ్య, చిలుక విద్యాసాగర్, పెయ్యల స్వామిప్రసాద్, శ్రీరాముల సుకుమార్, ఎలిషా రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మట్టి తరలింపును అరికట్టాలి



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలంలో ఎక్కడ చూసినా అక్కడ అక్రమ మట్టి తరలింపు యథేచ్ఛగా కొనసాగుతోంది. నిబంధనలు తుంగలో తొక్కుతూ అధికారుల పర్మిషన్లు లేకుండా అక్రమ మట్టి రవాణా కొనసాగుతోంది. వాసాలమర్రి ప్రాంతంలో కొందరు వ్యక్తులు తమ భూ ములు అని చెప్పి రెవెన్యూ అధికారులకు ఎలాంటి సమాచారం లేకుండా ప్రైవేట్ రిసార్ట్స్, ఫామ్ హౌస్‌లకు మట్టినమ్మి సొమ్ముచేసుకుంటున్నారనే వార్తలు గుప్పుమంటున్నాయి. రవాణా మాఫియా అనుమతులకు పాతరేస్తున్నారు. సామాన్యుడు ఇల్లు కట్టుకోవడానికి ఒక ట్రాక్టర్ మట్టి తోలుకుంటే అడ్డు వచ్చే అనేక నిబంధనలు, పెద్ద సంఖ్యలో టిప్పర్లతో మట్టి తరలిస్తున్న మాఫియాకు వర్తించవా అని కొందరు ప్రశ్నిస్తున్నారు. అటు పర్యావరణానికి, ఇటు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు గురిచేస్తున్న అక్రమ మట్టి రవాణాను అరికట్టాలని ప్రజలు, పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

## నైపుణ్యాలు గల విద్యార్థులకు ఉపాధి అవకాశాలు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ అండ్ నాలెడ్జ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాకు 700కు పైగా అభ్యర్థులు హాజరైనట్లు ప్లేస్మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ హరీష్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ నైపుణ్యాలు గల అభ్యర్థులకు విశ్వవ్యాప్తంగా అవకాశాలు ఉన్నట్లు ఆయన అన్నారు. జాబ్ మేళాలో 700కు పైగా అభ్యర్థులు హాజరైనట్లు,వందకు పైగా అభ్యర్థులు అర్హత సాధించినట్లు తెలిపారు.అనంతరం అర్హత సాధించిన అభ్యర్థులకు అపాయింట్మెంట్ లెటర్లు అందజేశారు.ఈకార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచా ర్య కొప్పుల అంజిరెడ్డి,ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ డైరెక్టర్ ఆచార్య ఆకుల రవి,టాస్క్ ప్రతినిధులు ప్రదీప్ రెడ్డి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని జూలూరు గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం హయత్ నగర్‌కు చెందిన ఎండి.అఫ్జల్ రేజా(22) జెసిబి డ్రైవర్‌గా పనిచేస్తూ జూలూరు ప్రాంతంలో నివసిస్తూ ఉండేవాడు. శనివారం సాయంత్రం సుమారు 07:15 గంటల సమయంలో తన స్నేహితుడితో కలిసి వెళ్తు మార్గమధ్యంలో బైక్‌ను రోడ్డు పక్కన ఆపిన సమయంలో వెనుక నుండి వచ్చిన లారీ డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంగా ఢీకొనడంతో అతనికి తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు పరీక్షించి అప్పటికే మరణించినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి సోదరి సుమాయన నాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# యుద్ధోన్మాదాన్ని వ్యతిరేకించండి

## శాంతి ఉద్యమాల్లో అందరూ భాగస్వాములు కావాలి

**ఎఐపిఎస్ఓ రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్**

**ఈనెల 7న నల్లగొండలో యుద్ధానికి వ్యతిరేక ర్యాలీకి పిలుపు**




**ప్రజాపక్షం/నల్లగొండ :** అంతర్జాతీయ స్థాయిలో పెరుగుతున్న యుద్ధోన్మాదాన్ని ఖండిస్తూ, ప్రజల్లో శాంతి చైతన్యం పెంపొందించేందుకు జరుగుతున్న శాంతి ఉద్యమాల్లో అందరూ భాగస్వాములు కావాలని ఎఐపిఎస్ఓ రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కె.వి.ఎల్ పిలుపునిచ్చారు. అఖిల భారత శాంతి సంఘీభావ సంస్థ (ఎఐపిఎస్ఓ)నల్లగొండ జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం పట్టణంలోని పిఆర్‌టియూ భవనంలో జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కెవిఎల్ మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న యుద్ధ వాతావరణం మానవాళికి తీవ్ర ముప్పుగా మారుతోందన్నారు. యుద్ధాల వల్ల సాధారణ ప్రజలే అత్యధికంగా నష్టపోతున్నారని, దేశాల మధ్య శాంతి, సహకారం అత్యవసరమని పేర్కొన్నారు.అమెరికా ఇజ్రాయెల్ వలసాధిపత్య ధోరణి ప్రపంచ శాంతికి ప్రమాదంగా మారిందని ఆయన అన్నారు. ఈ రెండు దేశాల దుందుడుకు విధానాలు ప్రపంచాన్ని కల్లోలంలోకి నెట్టుతున్నాయని, ఇది కేవలం సంఘర్షణ మాత్రమే కాదని, ఒక మారణహోమంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మొదట ఇరాక్ (2003),తరువాత వెనిజులా, ప్రస్తుతం ఇరాన్‌పై అమెరికా ఆధిపత్య వైఖరితో దాడులు కొనసాగుతున్నాయని విమర్శించారు.వనరుల కోసం ప్రారంభమైన ఈయుద్ధాలు ఇప్పుడు నూతన వలసవాద భావజాలంతో నడిచే జాత్యహంకార దాడులుగా మారాయని,వారి లక్ష్యం ఆధిపత్యం తప్ప మరొకటి కాదని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ యుద్ధాల ప్రభావంతో పెట్రోల్,గ్యాస్ మాత్రమే కాకుండా అన్ని నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సాధారణ ప్రజల రోజు వారీ జీవితం దుర్భరంగా మారుతోందన్నారు.ఇప్పటికే ట్రంప్ విధించిన ఏకపక్ష సుంకాల ప్రభావంతో దెబ్బతిన్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరో ఆర్థిక మాంద్యం ముంగిట్లో ఉందని తెలిపారు.సీనియర్ నాయకుడు మల్లేపల్లి ఆదిరెడ్డి మాట్లాడుతూ, యుద్ధానికి వ్యతిరేకంగా ఈనెల 7న నల్లగొండలో నిర్వహించనున్న శాంతి ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు అనంతుల శంకరయ్య,కట్ట వెంకట్ రెడ్డి అధ్యక్షత వహించగా జిల్లా సమన్వయ ప్రధాన కార్యదర్శి జిల్లా యాదయ్య, గుర్రం వెంకట్ రెడ్డి,పసల శౌరయ్య,కోమటిరెడ్డి ప్రద్యుమ్నరెడ్డి, ముండ్ల ముత్యాలు,షరీఫుద్దీన్,పాణెం వెంకట్రావు, ఉప్పునూతల యాదగిరి,కర్నాటి వెంకటేష్, చలం పాండురంగారావు,గుండా లింగారెడ్డి,నిమ్మల భీమర్జున్ రెడ్డి, పి.బ్రహ్మాచారి, దశరథ పాల్గొన్నారు.

## యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎంఎస్‌కె ప్రసాద్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర 8వ రగ్బీ పురుషుల, మహిళల టోర్నమెంట్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇలాంటి క్రీడా కార్యక్రమాలు యువతలో స్ఫూర్తిని నింపడంతో పాటు రాష్ట్ర క్రీడారంగ అభివృద్ధికి దోహదపడుతాయన్నారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ క్రీడాకారులకు తోడ్పాటునిస్తుందని చెప్పారు. యువత క్రమశిక్షణతో ముందుకు సాగితే రాష్ట్రానికి, దేశానికి గౌరవం తీసుకురాగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీఉల్లా, మాజీ కౌన్సిలర్లు వల్దాస్ దేవేందర్, తండు శ్రీనివాస్ గౌడ్, పిల్లల రమేష్ నాయుడు పాల్గొన్నారు.




## ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన విక్రమ్‌రెడ్డి

**ఎమ్మెల్యే మందుల సామేల్, ఎమ్మెల్సీ నెలికంటి సత్యం**

**సిద్ధాంతాల కోసం జీవించిన నాయకుడికి ఘన నివాళి**



**ప్రజాపక్షం/తుంగతుర్తి :** నమ్మిన సిద్ధాంతానికి, నైతిక విలువలకు, ఆదర్శాలకు మార్గదర్శకంగా నిలిచిన మహోన్నతమైన వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి కామ్రేడ్ దాయం విక్రమ్ రెడ్డి అని ఎంఎల్ఏ మందుల సామేల్, ఎంఎల్సి నెల్లికంటి సత్యం అన్నారు. శనివారం మండలంలోని వెంపటి గ్రామానికి చెందిన తిరుమలగిరి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కామ్రేడ్ దాయం విక్రమ్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా విగ్రహావిష్కరణ కార్యక్రమం కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ కామ్రేడ్ విక్రమ్‌రెడ్డి రాజకీయ జీవితంలో దాదాపు 30 ఏళ్ల పాటు గ్రామ, మండల, నియోజక వర్గ స్థాయిలో కీలకపాత్ర పోషించారన్నారు. నిస్వార్థ సేవాభావంతో ప్రజల కోసం అహర్నిశలు శ్రమించిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు పొందారన్నారు. 1970వ దశకంలో ఉవ్వెత్తున నడుస్తున్న విప్లవోద్యమంలో పాలుపంచుకొని పిడిఎస్‌యులో చేరి గ్రామ యువత సహకారంతో రైతుకూలీ సంఘాలు ఏర్పాటు చేసి పోరాడిన వ్యక్తి అన్నారు. తన తండ్రి తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ దాయం రాజిరెడ్డి ఆలోచనల మేరకు సిపిఐ పార్టీలో చేరి 1981లో మొదటిసారి వెంపటి గ్రామ సర్పంచ్‌గా గెలుపొందడమే కాకుండా తదనంతరం 1988లో ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నికయ్యారన్నారు. 1982లో నవీన యువజన మండలని స్థాపించి యువతకు క్రీడల పట్ల ఆసక్తిని, సమాజం పట్ల బాధ్యతను పెంపొందించాలన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడం ద్వారా నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, ఎల్లంల యాదగిరి, గుగులోత్ రాజారామ్, మనోజ్ కుమార్, గ్రామ సర్పంచ్ తప్పట్ల ఎల్లయ్య, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి బండ ప్రకాశ్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మల్లు కపోతం రెడ్డి, పలు గ్రా మాల సర్పంచులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కిట్స్ ఇంజనీరింగ్ విద్యార్థి భవనంపై నుంచిదూకి ఆత్మహత్యాయత్నం

**యువతి పరిస్థితి విషమం**



**ప్రజాపక్షం/కోదాడ:** సూర్యాపేట కోదాడలో శుక్రవారం ఒక విషాదకర సంఘటన చోటు చేసుకుని స్థానికంగా ఆందోళన కలిగించింది. కిట్స్ మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ సివిల్ ఫైనల్ ఇయర్ చదువుతున్న బూరుగు మైనా (22) అనే విద్యార్థిని కళాశాల భవనంపై అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించింది. ఈ ఘటనలో ఆమెకు తలకు, కాళ్లకు తీవ్రమైన గాయాలు కావడంతో తోటి విద్యార్థులు, కళాశాల సిబ్బంది వెంటనే స్పందించి సమీప ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. అనంతరం మెరుగైనచికిత్స కోసం ఆమెను హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ఈ ఘటన వెనుక కారణాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. వ్యక్తిగత ఇబ్బందులా, చదువులో ఒత్తిడా లేదా ఇతర అంశాల ప్రభావమా అన్న దానిపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. మైనా సొంత గ్రామం ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బీరోలు గ్రామానికి చెందినట్లు గుర్తించారు. ఘటనతో కళాశాల ప్రాంగణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, విద్యార్థులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. ఈ ఘటననేపథ్యంలో విద్యార్థుల్లో పెరుగుతున్న మానసిక ఒత్తిడిపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. విద్యా సంస్థలు, తల్లిదండ్రులు విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పలువురు నిపుణులు సూచిస్తున్నారు. కోదాడ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదు చేసినట్లు సమాచారం.

## పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా అప్రమత్తత అవసరం

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**




**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్ :** రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సూచించారు. శనివారం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, అధ్యక్షతన నేషనల్ హీట్ రిలేటెడ్ ఇల్లీనెస్ అండ్ డెత్ సర్వే లైన్స్ డిస్టిక్ టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ, వ్యవసాయ, పశుసంవర్ధక, పబ్లిక్ వర్క్స్, పర్యావరణ కాలుష్య నివారణ, గ్రామీణాభి వృద్ధి, పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖల అధికారులతో కలెక్టరేట్ ఐడిఓసీ మినీ మీటింగ్ హాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ వడదెబ్బ వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలతో సమగ్ర యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి మరియు మండల స్థాయిలో డిజాస్టర్ మేనేజ్మెంట్ టీంలను ఏర్పాటు చేయడంతో పాటు, త్రీమెన్ కమిటీని కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ మరియు ప్రైవేట్ విద్యాసంస్థల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం, పరీక్షా కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచడం, గ్రామీణ ఉపాధి హామీ కూలీలు, ఆశా వర్కర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. జిల్లాలోని గ్రామపంచాయతీలు, వార్డులు, బస్ స్టాండ్లు, పోలీస్ స్టేషన్లు, లేబర్ అడ్డాలు, నిర్మాణ ప్రదేశాలు, జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద, ఓఆర్ఎస్ ప్యాకెట్స్ చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డా.యం.మనోహర్, జిల్లా వైద్య , ఆరోగ్య శాఖాధికారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ, వ్యవసాయ, పశుసంవర్ధక, పబ్లిక్ వర్క్స్, పర్యావరణ కాలుష్య నివారణ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖల అధికారులు మరియు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

**సూర్యాపేట జిల్లా ఎస్పి కె నరసింహ**



**ప్రజాపక్షం/సూర్యాపేట :** కోర్టు అధికారులతో సమన్వయంగా పనిచేస్తూ ఎక్కువ కేసుల పరిష్కారానికి సిబ్బంది కృషి చేయాలని జిల్లా ఎస్పి కె నరసింహ సూచించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో కోర్టు విధులు, పెండింగ్ కేసుల్లో త్వరితగతిన పరిష్కారం, వివిధ కేసుల్లో ఉన్న నింధితులకు, నేరస్తులకు కోర్టు సమన్లు, వారెంటులు అందజేయడం, బాధితులను, సాక్ష్యులను సకాలంలో కోర్టుల్లో హాజరుపరచడం మొదలగు అంశాలపై డిఎస్‌పిలు, ఇన్స్పెక్టర్లు, కోర్టు డ్యూటీ పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి సంబంధించి పలు సూచనలు, సలహాలు సిబ్బందికి అందించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్నటువంటి కేసులను, దస్త్రాలను, సమన్లు, వారెంట్లను పరిశీలన చేశారు. తీవ్రమైన కేసుల్లో నింధితులను వెంటనే న్యాయస్థానాల నందు హాజరుపరిచి న్యాయస్థానాల ఆదేశాల ప్రకారం రిమాండ్‌కు తరలించాలని సూచించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కోర్టు అధికారులతో సమన్వయంతో పనిచేసి ఎక్కువ కేసుల్లో కోర్టు క్యాలెండర్ నంబర్‌లను పొందాలన్నారు. డివిజన్ స్థాయి అధికారులు సర్కిల్ స్థాయి అధికారులు కేసుల్లో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని, లోపాలు లేకుండా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్‌బి డిఎస్‌పి రవి, డిఎస్‌పిలు ప్రసన్నకుమార్, శ్రీనివాస్ రెడ్డి, సిఐలు, కోర్టు డ్యూటీ సిబ్బంది పాల్గొన్నారు.

## యాసంగి సీజన్‌కు వరి కొనుగోలు కేంద్రాల నిర్వహణపై శిక్షణ




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లాలో ఇప్పటివరకు 25 మండలాల్లో 161 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని డిఆర్‌డిఓ వై. శేఖర్ రెడ్డి సూచించారు. యాసంగి (రబీ) 2025/26 సీజన్‌లో వరి ధాన్యం కొనుగోళ్లను పారదర్శకంగా,సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఏ) ఆధ్వర్యంలో విస్తృత స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.టిటిడిసీలోని జిల్లా సమాఖ్య సమావేశ మందిరంలో జరిగిన ఈకార్యక్రమానికి పీపీసీ సిబ్బంది,వీఓల అధ్యక్షులు,వీఓఏలు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీపీసీలను ఎత్తైన ప్రదేశాల్లో ఏర్పాటు చేసి వర్షాల ప్రభావం లేకుండా చూడాలని,ధాన్యం నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.రైతులు ధాన్యం తీసుకువచ్చిన వెంటనే వారి వివరాలను నమోదు చేసి సీరియల్ నంబర్ ఇవ్వాలని,ఎఫ్ఏక్యూ ప్రమాణాల ప్రకారం తేమశాతం 17 శాతం లోపు ఉన్న ధాన్యాన్నే కొనుగోలు చేయాలని తెలిపారు.రైతుల నుంచి అవసరమైన పత్రాలు సేకరించడం,శుభ్రమైన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయడం ద్వారా పారదర్శకతను పాటించాలని సూచించారు. ధాన్యాన్ని మిల్లులకు పంపే ప్రక్రియలో జాగ్రత్తలు పాటించాలని,ట్రక్ చిట్లు సకాలంలో తీసుకుని ట్యాబ్‌లో ఎంట్రీలు పూర్తి చేసి రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా చూడాలని ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీఓ శ్రవణ్ కుమార్, జిల్లా మహిళా సమాఖ్య కోశాధికారి వై. సునీత,డీపీఎం వీరయ్య,ఏపీఎం చంద్రశేఖర్,జిల్లాలోని డీపీఎంలు,ఏపీఎంలు,సీసీలు, మార్కెటింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కలుషితమైన నీరుచేరి చేపలు మృతి

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** మండల పరిధిలోని దిర్శించర్ల ఊర చెరువులో నీరు కలుషితమై చేపలు మృతి చెందాయని చెరువుసభ్యులు ఆరోపించారు. గత పది రోజుల నుండి దాదాపుగా క్వింటన్నర చాపలు మృతి చెందాయని, చెరువు కమిటి సిబ్బంది చెరువు నీటిని టెస్టింగ్ చేయించారు. ఈ నీటిలో డ్రైనేజీ నీరు కలుస్తుందని రిపోర్టు వచ్చిందన్నారు. డ్రైనేజీ నీరు చెరువులోకి రావడంతో నీరు కలుషితమై చెరువు వద్ద దుర్వాసన వచ్చి చెపలు మృతి చెందుతున్నాయని ఆరోపించారు. దీనిపై చర్యలు చేపట్టాలని అధికారులు కోరారు.

## సబ్‌కోర్టు కోసం ఎమ్మెల్యే వీరేశంను కలిసిన న్యాయవాదులు



**ప్రజాపక్షం/నకిరేకల్ :** పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ విప్ వేముల వీరేశంను నకిరేకల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పూజర్ల శంభయ్య కార్యవర్గ సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.పట్టణంలో సబ్‌కోర్టు భవన నిర్మాణానికి చర్యలు తీసుకుని సహకరించాలని వారు కోరారు. ఈసందర్భంగా నూతనంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్నికైన పూజార్ల శంభయ్యను వేముల వీరేశం శాలువాతో సన్మానించారు.ఈకార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వెంకటరమణ,కార్యదర్శి నోముల మనోహర్,న్యాయవాదులు నోముల గోవిందరాజులు, హఫీజ్, నర్సిరెడ్డి,ఓంకార్,దొడ సోమయ్య,వేణుగోపాల్ పాల్గొన్నారు.

## సాగర్‌లో అటవీ భూముల సమస్యల పరిష్కారం వేగవంతం

**ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి అధికారులకు ఆదేశం**



**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ నియోజకవర్గంలో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న అటవీ భూముల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి,అర్హులైన పేద రైతులకు డిఫామ్ పట్టాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం నాగార్జున సాగర్‌లోని విజయ విహార్‌లో జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్‌తో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ అంశంపై విస్తృతంగా చర్చ జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా అటవీ భూములను సాగు చేసుకుంటున్న రైతులు ఇప్పటికీ హక్కులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారికి భూమిపై పూర్తి హక్కులు కల్పించడం అత్యవసరమని పేర్కొన్నారు. అసైన్మెంట్ భూముల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసి,అర్హులైన వారికి న్యాయం చేయాలని సూచించారు.జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ వివరాల ప్రకారం ఫారెస్ట్ భూములపై సర్వే ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది.ఇప్పటికే సుమారు 12,000 ఎకరాల భూమి సర్వే పూర్తయిందని తెలిపారు. గ్రామస్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వెరిఫికేషన్,గ్రామ సభల ద్వారా ధృవీకరణ చేపడుతున్నట్లు వెల్లడించారు.ఈప్రక్రియ పూర్తయిన వెంటనే అర్హులైన రైతులకు డిఫామ్ పట్టాలు అందజేస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా,రైతుబంధు వంటి పథకాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు.ప్రజావాణి ద్వారా వచ్చిన రెవెన్యూ సమస్యలను కూడా ప్రాధాన్యతగా పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ సమావేశంలో మాజీ మంత్రి జానారెడ్డి,ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, తహసిల్దార్ అనిల్ పాల్గొన్నారు.

## మళ్లీ డిఎంకెదే అధికారం

'ప్రీపోల్' సర్వే వెల్లడి




**చెన్నై:** తమిళనాడులో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని అధికార డీఎంకే కూటమి మరోసారి ఘన విజయం సాధించనుందని ప్రీపోల్ సర్వేలు స్పష్టంచేశాయి. సర్వే చేసిన రెండు సంస్థలు డీఎంకేనే విజయం వరించనుందని ప్రకటించాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విపక్షాల ఓట్ల చీలిక డీఎంకేకు భారీ లాభం చేకూర్చనున్నాయని సర్వేలు అంచనా వేశాయి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పాఠశాలల్లో అల్పాహార వంటి పథకాలు మహిళలను విశేషంగా ఆకట్టుకున్నాయని అభిప్రాయపడ్డాయి. లోక్‌పోల్ అనే సర్వే సంస్థ మార్చి ఒకటో తేదీ నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ మధ్య 1,17,000 మందితో నిర్వహించిన సర్వే ప్రకారం... మొత్తం 234 స్థానాలకుగాను డీఎంకే కూటమి 181 నుంచి 189 సీట్లు గెలుచుకుంటుంది. డీఎంకే కూటమికి 40.1 శాతం ఓట్లు వస్తాయి. ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి 29 శాతం ఓట్లతో 38 నుంచి 42 సీట్లకు పరిమితం కానుంది. తొలిసారి ఎన్నికల బరిలోకి దిగుతున్న నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం (టీవీకే)' పార్టీ 23.9 శాతం ఓట్లతో 8 నుంచి 10 స్థానాలు దక్కించుకోనుందని సర్వేలు వెల్లడించాయి.

# భారత్‌కు కొనసాగుతోన్న ఎల్‌పిజి ప్రవాహాలు

♦హోర్ముజ్ జలసంధిని దాటిన ట్యాంకర్
♦ఏడవ భారతీయజెండా కలిగిన 'గ్రీన్ సాన్వి'
46,650 టన్నుల సరుకుతో సురక్షితంగా చేరిక
♦మంగళూరు ఓడరేవు చేరుకున్న..
ఇరాన్ నుంచి వచ్చిన మరొక నౌక



**న్యూఢిల్లీ :** దాదాపు అరు రోజుకు సరిపడా వంటగ్యాస్ సరఫరా చేసే ఒక భారతీయ లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పిజి) ట్యాంకర్ యుద్ధంతో దెబ్బతిన్న హోర్ముజ్ జలసంధిని విజయవంతంగా దాటింది. ఇదిలాఉంటే, అదే సమయంలో ఇరాన్ నుంచి వచ్చిన మరొక నౌక మంగళూరు ఓడరేవుకు చేరుకుంది. ప్రాంతీయంగా అంతరాయాలు ఏర్పడినప్పటికీ ఇంధన ప్రవాహాలు కొనసాగుతున్నాయని ఇది సూచిస్తోంది. పశ్చిమాసియా పరిణామాలపై ప్రభుత్వ అంతర్ మంత్రిత్వ సమావేశం విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం, 46,650 టన్నుల ఎల్‌పిజి సరుకుతో పాటు 25మంది నావికులతో కూడిన ఎల్‌పిజి నౌక 'గ్రీన్ సాన్వి' హోర్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. ఫిబ్రవరి 28న అమెరికాఇజ్రాయెల్ ఇరాన్‌పై దాడులు ప్రారంభించిన నేపథ్యంలో టెహ్రాన్ తీవ్ర ప్రతీకార చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. దీంతో దాదాపుగా మూసివేయబడిన ఈ వ్యూహాత్మక జలమార్గం గుండా ప్రయాణించిన ఏడవ భారతీయ జెండా కలిగిన ఎల్‌పిజి ట్యాంకర్ గ్రీన్‌సాన్వి. ఇదిలాఉండగా ఇరాన్ నుంచి ఒక ఎల్‌పిజి కార్గో మంగళూరుకు చేరుకుంది. విడుదల చేయబడుతోందని ఒక ప్రకటన తెలిపింది. బహుఏడు సంవత్సరాలలో ఇరాన్ ఇంధనాన్ని కొనుగోలు చేయడం ఇదే మొదటిసారి. సుమారు 44,000టన్నుల ఇరానియన్ ఎల్‌పిజిని తీసుకువస్తున్న 'సీబర్డ్' అనే ఎల్‌పిజి నౌక భారతదేశంలోని మంగళూరుకు ఏప్రిల్ 2న భారతదేశంలోని మంగళూరులో లంగరు వేసింది. ప్రస్తుతం సరుకును దించుతోంది అని పెట్రోలియం, సహజవాయువుల మంత్రిత్వ శాఖ ఈ విషయాన్ని 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. మధ్య ప్రాచ్య సంఘర్షణ ప్రారంభమైనప్పటి నుండి ఆకాశాన్నంటుతున్న ధరలను తగ్గించడానికి, గత నెలలో ఇరాన్ చమురు, శుద్ధి చేసిన ఉత్పత్తులపై అమెరికా తాత్కాలికంగా ఆంక్షలను ఎత్తివేసిన నేపథ్యంలో ఈ కొనుగోలు జరిగింది. గ్రీన్ సాన్వి హోర్ముజ్ యని తర్వాత భారత జెండాకలిగిన 17 నౌకలు జలసంధికి పశ్చిమవైపున చిక్కుకుపోయాయి. కాగా, ఈ వారం ప్రారంభంలో 94,000టన్నుల ఎల్‌పిజి సరుకును మోసుకువెళుతున్న బిడబ్ల్యుటైటాన్, బిడబ్ల్యు ఇఎల్ఎం అనే రెండు ఎల్‌పిజి క్యారియర్లు ఈ ప్రాంతాన్ని సురక్షితంగా దాటాయి. బిడబ్ల్యు టైటాన్ మార్చి 31న ముంబయికి చేరుకోగా, బిడబ్ల్యు ఇఎల్ఎం ఏప్రిల్ 1న న్యూ మంగళూరులో లంగరు వేసింది. దీనికి ముందు భారతీయ జెండా కలిగిన 4 ఎల్‌పిజి ట్యాంకర్లు జలసంధిని సురక్షితంగా దాటాయి. పైన్ గ్యాస్, జగ్ వసంత్ 92, 612 టన్నుల ఎల్‌పిజి సరుకుతో ఎంటి శివాలిక్, ఎంటి నందాదేవి నౌకలు వరుసగా మార్చి 16న గుజరాత్‌లోని ముంద్రా ఓడరేవుకు, మార్చి 17న అదే రాష్ట్రంలోని కాండ్లా ఓడరేవుకు చేరుకున్నాయి. తన వంట గ్యాస్ అవసరాలలో 60శాతం వరకు గల్ఫ్‌దేశాలపై ఆధారపడిన దేశానికి, ఈ దిగుమతుల రాక మూలంగా దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన ఎల్‌పిజి కొరతను తగ్గిస్తుంది. భారతదేశం గత ఏడాది మిలియన్ టన్నుల ఎల్‌పిజిని వినియోగించింది. ఇందులో దిగుమతులు డిమాండ్‌లో 60 శాతం వాటాను కలిగిఉండగా, ఆ దిగుమతులలో 90శాతం మిడిల్ ఈస్ట్ నుంచే వచ్చాయి. ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో టెహ్రాన్ విస్తృత ప్రతీకార చర్యల కారణంగా గల్ఫ్‌దేశాల నుండి ప్రపంచానికి చమురు గ్యాస్ ఎగుమతులకు మార్గంగా ఉన్న ఈ ఇరుకైన నౌకాయాన దాదాపుగా నిలిచిపోయింది. అయితే ఇరాన్ అధికారులతో సమన్వయం చేసుకున్నతర్వాత శతృత్వంలేని నౌకలు ఈ జలమార్గంలోకి ప్రవేశిస్తాయి అని ఇరాన్ పేర్కొంది. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైనప్పుడు దక్షిణ హోర్ముజ్‌లో మొదటగా 28 భారత జెండా నౌకలు ఉండేవి. వీటిలో 24నౌకలు జలసంధికి ఒకవైపున, నాలుగు తూర్పువైపునా ఉన్నాయి. ఒక వైపు నుంచి ఏడు నౌకలు, తూర్పు నుంచి రెండు నౌకలు సురక్షితంగా ఒడ్డుకు ఒడ్డుకు చేరుకుంది. ఒమన్ నుంచి ఆఫ్రికాకు గ్యాసోలిన్ తీసుకెళుతున్న మరొక ట్యాంకర్ 'జగ్ ప్రకాశ్' అంతకుముందే జలసంధిని సురక్షితంగా దాటి టాంజానియా వైపునకు వెళ్లింది. జగ్ విక్రమ్, గ్రీన్ ఆశా అనే ఎల్‌పిజి రవాణా నౌకలు ఇంకా జలసంధిలోనే ఉన్నాయి. ఒక ఖాళీ నౌకను ఎల్‌పిజితో నింపుతున్నారు. గల్ఫ్ ప్రాంతంలోని భారతీయ నావికులు అందరూ సురక్షితంగానే ఉన్నారని, సముద్ర కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకం కలగలేదని, గత 24గంటల్లో భారత జెండా ఉన్న నౌకలకు సంబంధించి ఎలాంటి సంఘటనలు జరగలేదని ఆ ప్రకటన తెలిపింది.

## హిందీ రుద్దే కుట్రే.. త్రిభాషా సూత్రంపై తమిళనాడు సిఎం స్టాలిన్ విమర్శ

**చెన్నై:** సీబీఎస్ఈ కొత్తగా ప్రవేశపెట్టిన పాఠ్యప్రణాళికను తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శనివారం విమర్శించారు. హిందీని ప్రోత్సహించేందుకు 'త్రిభాషా సూత్రం' అనేది ఒక రహస్య ప్రయత్నమని తెలిపారు. స్టాలిన్ శనివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం 2020కి అనుగుణంగా ఉన్న ఈ విధానం కేవలం విద్యాపరమైన మార్పు మాత్రమే కాదని, భాషా ఆధిపత్యంపై దీర్ఘకాలంగా ఉన్న ఆందోళనలను బలపరిచే ఉద్దేశపూర్వక చర్య అని అన్నారు. దేశ భాషా వైవిధ్యాన్ని పక్కన పెడుతూ హిందీకి అనవసర ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ 'భారతీయ భాషలను' ప్రోత్సహించే నెపంతో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం కేంద్రీకరణ అజెండాను ముందుకు నెడుతోందని ఆయన ఆరోపించారు. 'ఈ త్రిభాషా సూత్రం అని పిలవబడేది వాస్తవానికి హిందీ మాట్లాడని ప్రాంతాల్లోకి హిందీని విస్తరించడానికి ఒక రహస్య యంత్రాంగం' అని ఆయన విమర్శించారు. దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులకు ఈ విధానం ప్రభావవంతంగా 'తప్పనిసరి హిందీ అభ్యసనం'గా పరిణమిస్తుందన్నారు. 'అయినప్పటికీ, ప్రతిఫలం ఎక్కడ ఉంది? హిందీ మాట్లాడే రాష్ట్రాల్లోని విద్యార్థులు తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం లేదా బెంగాలీ, మరాఠీ వంటి భాషలను కూడా తప్పనిసరిగా నేర్చుకోవాలా? ఇటువంటి స్పష్టత పూర్తిగా లేకపోవడం ఈ విధానంలోని ఏకపక్ష, వివక్షాపూరిత స్వభావాన్ని బయటపెడుతోంది. ఈ వైరుధ్యం తీవ్రమైనది. ఆమోదయోగ్యం కానిది' అని తెలిపారు. కేంద్రీయ విద్యాలయ సంఘటన్ పాఠశాలల్లో తమిళాన్ని తప్పనిసరి భాషగా చేయడంలో 'విఫలమైన', తగినంత మంది తమిళ ఉపాధ్యాయులను నియమించడంలో నిరంతరం విఫలమవుతున్న అదే కేంద్ర ప్రభుత్వంఇప్పుడు భారతీయ భాషలను ప్రోత్సహించడంపై రాష్ట్రాలకు ఉపన్యాసాలు ఇవ్వాలని చూస్తోందని మండిపడ్డారు. 'ఇది నిబద్ధత కాదు, పచ్చి కపటత్వం' అని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి క్షేత్రస్థాయి వాస్తవాలపై, ఉపాధ్యాయుల లభ్యత, శిక్షణ సామర్థ్యం, మౌలిక సదుపాయాలపై ఏమైనా అవగాహన ఉందా అని స్టాలిన్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 'ఈ బహత్తరమైన ప్రక్రియను అమలు చేయడానికి అర్హత గల ఉపాధ్యాయులు ఎక్కడ ఉన్నారు? మరీ ముఖ్యంగా, విద్యా వ్యవస్థపై పడుతున్న ఈ భారీ భారాన్ని భరించడానికి నిధులు ఎక్కడ ఉన్నాయి? అందువల్ల, ఇది ప్రణాళిక, వనరులు లేదా జవాబుదారీతనం లేకుండా ప్రకటించిన మరో అనాలోచిత విధానంగా కనిపిస్తోంది. ఇది కేవలం భాషకు సంబంధించిన ప్రశ్న కాదు. ఇది న్యాయం, సమాఖ్యవాదం, సమాన అవకాశాలకు సంబంధించిన ప్రశ్న' అని పేర్కొన్నారు. 'హిందీ మాట్లాడే విద్యార్థులకు నిర్మాణాత్మకంగా ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఈ విధానం ఉన్నత విద్య, ఉద్యోగాలలో పాతుకుపోయిన ప్రయోజనాలను సృష్టించి, ప్రాంతీయ అసమానతలను మరింత పెంచే ప్రమాదం ఉంది. ప్రపంచం అపూర్వమైన వేగంతో ముందుకు సాగుతున్న తరుణంలో మన పిల్లలను భవిష్యత్‌కు సిద్ధం చేయాలి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఏవీజీసీ (యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్) వంటి అభివద్ధి చెందుతున్న రంగాలలో వారికి నైపుణ్యాలను అందించడం, శాస్త్రీయ దక్పథాన్ని, విమర్శనాత్మక ఆలోచనను బలోపేతం చేయడం ప్రాధాన్యతగా ఉండాలి. దానికి బదులుగా ఈ తిరోగమన, కఠినమైన భాషా భారం వారి పురోగతిని పట్టాలు తప్పించే ప్రమాదం ఉంది' అని స్టాలిన్ విమర్శించారు. తమిళనాడు, అనేక ఇతర రాష్ట్రాలు లేవనెత్తిన చట్టబద్ధమైన, స్థిరమైన, ప్రజాస్వామ్యయుతమైన ఆందోళనలను పక్కనపెట్టి, హిందీని రుద్దడానికి కేంద్ర ప్రభుత్వం నిశ్చయించుకున్నట్లు కనిపిస్తోంది. ఈ వైఖరి సహకార సమాఖ్యవాద సూత్రాలకు ప్రత్యక్ష అవమానం, లక్షలాది మంది భారతీయుల భాషా గుర్తింపునకు అపచారం' అని తెలిపారు. భారతదేశ బలం దాని వైవిధ్యంలో ఉంది కానీ 'బలవంతపు ఏకరూపత'లో కాదని అన్నారు. ఈ సున్నితమైన సమతుల్యతను దెబ్బతీసే ఏ ప్రయత్నమైనా తప్పుదారి పట్టించడమే కాదని, అది ప్రమాదకరం కూడా అని తెలిపారు. మన బహుళత్వ దేశపు పునాదుల మీదే దెబ్బతీస్తాయి. వీటిని గట్టిగా వ్యతిరేకిస్తాం' అని ఆయన స్పష్టం చే శారు. 'ఎడపాడి పళనిస్వామి నేతత్వంలోని ఏఐఏడీఎం కే, తమిళనాడులోని దాని ఎన్డీఏ మిత్రపక్షాలు ఈ రుద్దకాన్ని సమర్థిస్తాయా? లేదా ఒక్కసారైనా మన విద్యార్థుల హక్కులు, గుర్తింపు, భవిష్యత్ కోసం నిలబడతాయా?' అని ప్రశ్నించారు.



## పుదుచ్చేరి రాష్ట్ర హోదాకు కృషి: విజయ్



**పుదుచ్చేరి:** కేంద్రంలో ఏళ్ల తరబడి అధికారంలో ఉన్నప్పటికీ పుదుచ్చేరికి రాష్ట్ర హోదా కల్పించడంలో జాతీయ పార్టీలు విఫలమయ్యాయని బీజేపీ, కాంగ్రెస్‌పై టీవీకే అధినేత విజయ్ విమర్శలు గుప్పించారు. పుదుచ్చేరికి చట్టబద్ధంగా పూర్తి స్థాయి రాష్ట్ర హోదా సాధించేందుకు టీవీకే నూటికి నూరు శాతం కషి చేస్తుందని హామీ ఇచ్చారు. పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా శనివారం జరిగిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. పుదుచ్చేరిలోని డీఎంకే కాంగ్రెస్ కూటమిని 'అయోమయ కూటమి'గా అభివర్ణించారు. ఏఐఎన్ఆర్సీబీజేపీ కూటమి శక్తిహీనంగా మారిందని చెప్పారు. టీవీకే విజిల్ గుర్తుకు ఓటు వేసి తమ పార్టీగా మద్దతుగా నిలవాలని, కేవలం ఒక్క వేలితో రాజకీయ మార్పు తీసుకురావాలని ప్రజలను కోరారు. తమ పార్టీ అభ్యర్థులు ప్రజలకు అండగా నిలబడతారని తెలిపారు. టీవీకే అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తామని, పేదరికపు రేఖకు దిగువనున్న ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందిస్తామని చెప్పారు. పుదుచ్చేరి యూనివర్సిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ అండ్ ఆర్ట్స్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. పుదుచ్చేరి అభివద్ధికి కట్టుబడి ఉంటామని, సురక్షితమైన, పారదర్శక పాలనను అందిస్తామని విజయ్ హామీ ఇచ్చారు. పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఈ నెల తొమ్మిదో తేదీ జరుగనుండగా, మే నాలుగో తేదీ ఫలితాలు వెలువడతాయి.

# బెంగాల్ ఎన్నికలలో వామపక్షాల పునరుజ్జీవనం

దీపాంకర్ భట్టాచార్య

**న్యూఢిల్లీ :** పశ్చిమ బెంగాల్‌లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలు వామపక్షాలకు 'పునరుజ్జీవనం' తీసుకురావచ్చని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య శనివారం అన్నారు. అయితే ఫలితాలపై తాత్రీను ఊహాగానాలు చేయబోనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వామపక్ష కూటమితో కలిసి తమ పార్టీ ఎన్నికలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ విడిగా పోటీ చేయాలన్న నిర్ణయంపై ఉన్న ఆందోళనలను తోసిపుచ్చుతూ, వామపక్షాల ఓట్ల శాతం పెరుగుతుందని తాను ఆశిస్తున్నట్లు భట్టాచార్య పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. 'బెంగాల్‌లో వామపక్షాల పునరుజ్జీవనానికి కొన్ని అవకాశాలు కనిపిస్తున్నాయి. సీట్ల సంఖ్య గురించి నేను ఊహాగానాలు చేయబోను' అని ఆయన అన్నారు. 'కానీ అన్నింటికన్నా ముందు, ఓట్ల శాతం పరంగా చూస్తే, వామపక్షాల ఓట్ల శాతం ఇప్పుడు ఒకే అంకెకు, అంటే 10 కంటే తక్కువకు పడిపోయింది. బెంగాల్‌లో బీజేపీ ఎదుగుదలను అరికట్టాలంటే, వామపక్షాలు పుంజుకోవాల్సి ఉంటుంది' అని తెలిపారు. వామపక్ష కూటమి మద్దతుతో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్‌లెనినిస్ట్) లిబరేషన్, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా 10 నియోజకవర్గాల్లో పోటీ చేస్తోంది. 'మాకు సీపీఎంతో చాలా విభేదాలు ఉన్నాయి. అందుకే మేము వామపక్ష కూటమిలో భాగం కాదు. మేము ఒక స్వతంత్ర కమ్యూనిస్టు పార్టీ. కానీ పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష పునరుజ్జీవనాన్ని తీసుకురావాలనే ఈ ఉమ్మడి లక్ష్యం కోసం మేము వారితో సహకరిస్తున్నాం' అని ఆయన అన్నారు. చారిత్రకంగా రెండు పార్టీల మధ్య ఉన్న ఉద్రిక్త సంబంధాలు ఇప్పుడు మెరుగుపడుతున్నాయని ఆయన తెలిపారు. 'దీనికి ముందు జరిగిన ఉప ఎన్నికలో సీపీఎం తొలిసారిగా మాకు మద్దతు ఇచ్చింది. ఈ సారి అది మరింత పెద్ద ఎత్తున ఉంటుంది. అవగాహన, భాగస్వామ్యం, పరస్పర సహకారం స్థాయిలు బహుశా మెరుగ్గా ఉన్నాయని, అవి మెరుగుపడుతున్నాయని నాకు అందిన సమాచారం' అని భట్టాచార్య అన్నారు. 'అనేక సమస్యలపై మనం చేసే వివిధ పోరాట రూపాల్లో ఎలాగైతే సహకరించుకుంటామో, అలాగే ఎన్నికల రంగంలో కూడా సహకరించుకోగలమని ఆశిద్దాం' అని తెలిపారు.ఆ పార్టీ అధికారం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తోందని అన్నారు. కాషాయ పార్టీ చేస్తున్న ఈ ప్రయత్నాన్ని ఓటర్లు 'మరోసారి తిరస్కరించగలరని' ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితాలపై జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కసరత్తు గురించి ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియ అర్హులయిన ఓటర్ల ఓటు హక్కును హరించగలదని అన్నారు. 'ఓటు హక్కును వాయిదా వేయలేరు. ప్రజల ఓటు హక్కును ఏదో బ్యాంకు లాకర్‌లో దాచిపెట్టే ప్రసక్తే లేదు. ఇది తక్షణమే వినియోగించుకోవాల్సిన హక్కు' అని ఆయన నొక్కి చెప్పారు. దీనిని సీపీఐ(ఎంఎల్) నాయకుడు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే అని అభివర్ణించారు. కాంగ్రెస్ విడిగా పోటీ చేయాలని నిర్ణయించుకోవడంపై భట్టాచార్య మాట్లాడుతూ వామపక్షాల అవకాశాలపై దీని ప్రభావం ఎంతవరకు ఉంటుందో తనకు కచ్చితంగా తెలియదని అన్నారు.



## బిహార్ సిఎం నిశాంత్! జెడియు కార్యాలయం వద్ద పోస్టర్లు



**పట్నా :** బీహార్ తదుపరి ముఖ్యమంత్రి పదవికి అనేక మంది బీజేపీ నాయకుల పేర్లు ప్రచారంలో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తనయుడు నిశాంత్ కుమార్‌ను తదుపరి ముఖ్యమంత్రిగా పేర్కొంటూ రూపొందించిన పోస్టర్లు శనివారం పట్నాలోని జేడీ(యూ) కార్యాలయం సమీపంలో వెలిశాయి. ఈ పోస్టర్లలో నితీశ్ ప్రముఖంగా కనిపిస్తుండగా నిశాంత్‌ను 'బీహార్ భవిష్యత్ ముఖ్యమంత్రి'గా చూపించారు. ఈ పోస్టర్లతో పాటు నితీశ్ కుమార్ సంకల్పాన్ని నెరవేర్చడానికి నిశాంత్ సిద్ధంగా ఉన్నప్పుడు కొత్త ముఖం గురించి ఎందుకు ఆలోచించాలి?' వంటి నినాదాలు కూడా దర్శనమిచ్చాయి. మరొక నినాదం 'నితీశ్ సేవకులు నిశాంత్‌ను కోరుకుంటున్నారు' అని పేర్కొన్నారు. ఈ పోస్టర్లను జేడీ(యూ) విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కష్ణ పటేల్ ఏర్పాటు చేశారు. అయితే రాష్ట్రానికి మొట్టమొదటి బీజేపీ ముఖ్యమంత్రి రాబోతున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది 'ఏమీ మారదు' అని నితీశ్ హామీ ఇచ్చినప్పటికీ, ఈ ప్రచారం జేడీ(యూ) కార్యకర్తల్లో ఆందోళన కలిగిస్తోంది. బీహార్ ఉప ముఖ్యమంత్రి, బీజేపీ నాయకుడు సమ్రాట్ చౌదరి, నితీశ్ వారసుడిగా రేసులో ముందున్న వారిలో ఒకరుగా ఉన్నారు. జేడీ(యూ) అంతర్గత వర్గాల సమాచారం ప్రకారం, ఏప్రిల్ రెండో వారంలో కొలువుదీరనున్న కొత్త ప్రభుత్వంలో నిశాంత్‌కు ఉప ముఖ్యమంత్రి పదవిని ఇచ్చే అవకాశం ఉంది. కొత్త మంత్రి వర్గం కూడా ఏర్పాటుకానుంది. ఈ మంత్రివర్గంలో స్థానం కోసం ఎన్డీఏ మిత్రపక్షాల నుంచి అనేక మంది ఆశావహులు పోటీ పడుతున్నారు. ముమ్మరంగా సాగుతున్న సంప్రదింపుల నడుమ, నితీశ్ కుమార్ ఏప్రిల్ 6 న పట్నాలో జేడీ(యూ) నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఏప్రిల్ 10 న రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేయడానికి ఢిల్లీ చేరుకున్న తర్వాత ఆయన జేడీ(యూ) జాతీయ మండలి సమావేశానికి కూడా అధ్యక్షత వహించనున్నారు. ఈ సమావేశంలో అనేక కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. బీహార్ కొత్త ముఖ్యమంత్రి ప్రకటన వెలువడక ముందే, నితీశ్... ఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ను కలిసే అవకాశం కూడా ఉంది. నితీశ్ ఏప్రిల్ 13 న ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసే అవకాశం ఉండగా, జేడీ(యూ) నాయకుల సమావేశం ఏప్రిల్ 14న జరగనుంది. నితీశ్ రాజీనామా అనంతరం తదుపరి ముఖ్యమంత్రి ఎవరనే విషయాన్ని ఈ సమావేశం నిర్ణయిస్తుంది. కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో నితీశ్ కుమార్ దాదాపు రెండు దశాబ్దాల పాలన ముగిసిపోతుంది.

## నేను బెంగాలీనే లియాండర్ పేస్

**కోల్‌కతా:** భారత టెన్నిస్ స్టార్ లియాండర్ పేస్ తాను బెంగాలీ కాదంటూ వస్తున్న విమర్శలపై స్పందించారు. ''నేను సౌరవ్ గంగూలీని కాదేమోగానీ కచ్చితంగా బెంగాలీనే'' అని చెప్పారు. పశ్చిమబెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇటీవల బీజేపీలో చేరిన పేస్... ఎన్నికల ప్రచారంలో భాగంగా బహిరంగ కార్యక్రమాలకు వెళ్లినప్పుడు 'మీరు బెంగాలీయేనా' అనే ప్రశ్నలు ఎదుర్కొంటున్నారు. దీనిపై పేస్ స్పందిస్తూ... మీరు బెంగాలీయేనా అనే ప్రశ్న ఎదురైనప్పుడు తనకు చాలా బాధగా ఉంటుందని అన్నారు. అయితే తన కుటుంబానికి పోర్చుగీస్ మూలాలు ఉన్నాయని తెలిపారు. తనవి మాత్రం భారతీయ మూలాలే అని స్పష్టంచేశారు. తాను కోల్‌కతాలో పుట్టానని, తన టెన్నిస్ ప్రయాణం సౌత్ క్లబ్‌లో ప్రారంభమైందని చెప్పారు. ఇక్కడి లా మార్టినియర్ పాఠశాలలో చదువుకున్న తాను, కోల్‌కతా నగర మైదానాల్లోనే ఆడుకున్నానని అన్నారు. ఈ నగరానికి గొప్ప క్రీడా చరిత్ర ఉందని కొనియాడారు. కానీ ప్రస్తుత బెంగాల్ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించడం లేదని విమర్శించారు. పోయిన సంవత్సరం అర్జెంటినా ఫుట్‌బాల్ క్రీడాకారుడు లియోనల్ మెస్సీ కోల్‌కతాలో పర్యటించిన సమయంలో చోటుచేసుకున్న గందరగోళాన్ని పేస్ ప్రస్తావించారు.

## కేరళలో ఎన్‌డియే గెలుపు ఖాయం: మోదీ



**తిరువల్ల (కేరళ):** ఎల్డీఎఫ్ ప్రభుత్వం తొలగింపునకు కౌంట్‌డౌన్ ప్రారంభమైందని, కేరళలో బీజేపీ నేతత్వంలోని ఎన్డీఏ అధికారంలోకి వస్తుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం అన్నారు. పతనంతిట్ట జిల్లాలోని తిరువల్లలో జరిగిన బీజేపీ నేతత్వంలోని ఎన్డీయే బహిరంగ సభలో ప్రసంగిస్తూ వామపక్ష పాలనకు వీడ్కోలు పలకడానికి కేరళ ప్రజలు సిద్ధంగా ఉన్నారని, రాష్ట్రంలోని కాషాయ పార్టీ కార్యకర్తలు సంకేతాలు ఇచ్చారని మోదీ తెలిపారు. రాష్ట్రంలోని 140 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 9న ఎన్నికలు జరగనున్నాయి. మోదీ మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే, ఈశాన్య రాష్ట్రాల్లోని ఏడింటిలో ఆరింటిలోనూ, అలాగే గణనీయమైన క్రైస్తవ జనాభా కలిగిన గోవాలో అభివద్ధిని ఎలా సాధించిందో, కేరళలో కూడా అదే విధంగా అభివద్ధిని సాకారం చేస్తుందని హామీ ఇచ్చారు. కేరళకు అపారమై న సామర్థ్యం ఉన్నప్పటికీ, అభివద్ధి పరుగులో ఇతర రాష్ట్రాల కంటే వెనుకబడి ఉందని ఆయన అన్నారు. గత ప్రభుత్వాలు తగిన శ్రద్ధ చూపకపోవడం వల్ల కేరళ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు అధ్వానంగా మారాయని ఆరోపించారు. కేరళ అభివద్ధికి అవినీతి, మతతత్వం అనేవి రెం డు అతిపెద్ద అడ్డంకులని అన్నారు.

## బెంగాల్‌లో 4,660 సహాయక పోలింగ్ కేంద్రాలు: ఇసిఐ

**కోల్‌కతా:** రాబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పశ్చిమ బెంగాల్‌లో 4,660 సహాయక పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు, ఇప్పటికే ఉన్న 321 కేంద్రాల తరలింపునకు భారత ఎన్నికల సంఘం ఆమోదం తెలిపింది. ఈ మార్పులతో మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 85,379 కి పెరిగింది. ఓటర్లకు మరింత సులభంగా చేరుకోవడం, రద్దీగా ఉండే బూత్‌ల వద్ద ఇబ్బందిని తగ్గించడం దీని లక్ష్యం. ఏప్రిల్ 23, ఏప్రిల్ 29 తేదీలలో రెండు దశల్లో పోలింగ్ జరగనుండగా, మే 4న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఓటర్ల సౌకర్యాన్ని పెంచి, పోలింగ్ సజావుగా జరిగేలా చూసేందుకు ఈసీఐ చేపట్టిన విస్తత వ్యూహంలో భాగంగా ఈ చర్య తీసుకున్నారు. 'నమోదయిన ఓటర్ల సంఖ్య 1,200 దాటిన ప్రాంతాలలో ప్రధానంగా సహాయక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. గందరగోళాన్ని నివారించడానికి, అర్హత ఉన్న ప్రతి ఓటరు ఎలాంటి ఇబ్బంది లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడటానికి, అధికారులు ప్రతి ఓటరుకు వ్యక్తిగతంగా తెలియజేయాలని కూడా సూచించింది. నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరిగేలా చూడటానికి, సీనియర్ పరిపాలనా, అధికారులకు కూడా కమిషన్ సమగ్ర సూచనలు జారీ చేసింది. ఎన్నికల అవకతవకలను నిరోధించడం వంటి బాధ్యతలు అప్పగించబడిన జిల్లా యంత్రాంగాలు, పరిరక్షణ సంస్థలతో సహా అన్ని స్థాయిల అధికారులకు వర్తిస్తాయని ఆ అధికారి తెలిపారు.

## బిజెపిపై తిరగబడండి.. ఓటర్లకు మమతా బెనర్జీ పిలుపు



**మాల్దా:** రాబోయే రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో బీజేపీకి వ్యతిరేకంగా ఓటర్లు ఏకం కావాలని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శనివారం పిలుపునిచ్చారు. మాల్దాలోని మణిక్‌చక్‌లో జరిగిన బహిరంగ సభలో ఆమె ప్రసంగిస్తూ బీజేపీ విభజనను ప్రోత్సహిస్తోందని, మత సంప్రదాయాలను అగౌరవపరుస్తోందని, మాల్దా వంటి ప్రాంతాలలో అశాంతి సష్టిస్తోందని ఆరోపించారు. వ్యూహాత్మకంగా ఓటు వేయాలని బెనర్జీ ప్రజలను కోరారు. తన ఆల్ ఇండియా తణమూల్ కాంగ్రెస్ కాకుండా ఇతర పార్టీలకు మద్దతు ఇవ్వడం పరోక్షంగా బీజేపీకి ప్రయోజనం చేకూరుస్తుందని ఆమె హెచ్చరించారు. రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య అవగాహన ఉందన్నార. ఎన్ఆర్సీ అమలు జరిగే అవకాశంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇది నిర్బంధ శిబిరాలకు దారితీయవచ్చని, అయితే పశ్చిమ బెంగాల్‌లోని పౌరులపై అటువంటి చర్యలు ప్రభావం చూపకుండా తన ప్రభుత్వం చూసుకుంటుందని మమత హామీ ఇచ్చారు. సాంస్కతిక, ఆహారపు అలవాట్ల సమస్యలపై కూడా బెనర్జీ బీజేపీని విమర్శించారు. బెంగాల్ సంప్రదాయాలను విస్మరిస్తూ, మతంపై తమ సొంత వ్యాఖ్యానాన్ని రుద్దుతోందని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాల్ నుంచి వలస వచ్చినవారు వివక్షను ఎదుర్కొంటున్నారని, వారు తమ సొంత ఊళ్లకు తిరిగి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా, ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థల ద్వారా అభ్యర్థులను బెదిరించి ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని, అయితే అటువంటి ఎత్తుగడలు చివరికి విఫలమవుతాయని ఆమె ఆరోపించారు. ఈ ఎన్నికలను ఒక ప్రజాస్వామ్య పోరాటంగా అభివర్ణిస్తూ, ఓటర్లు బ్యాలెట్ పెట్టె ద్వారా స్పందించాలని బెనర్జీ కోరారు.

**PUBLIC NOTICE**

**LOST OF DOCUMENT**

The General Public are hereby informed that my client **Smt. PORANKI ANNAPURNA W/o. P.RAMATULASI RAJU,** Occ: Housewife, R/o. H.No. 23-77, Radha Krishna Nagar, Malkajgiri, Hyderabad-500 047, has **lost / misplaced the Original Sale Deed bearing document No. 1973 of 1981, registered at SRO Medchal, at her residence i.e. H.No. 23-77, Radha Krishna Nagar, Malkajgiri, Hyderabad-500 047,** in respect of **Plot bearing No. 23, admeasuring 235 Sq. Yards in Survey No. 1015, Situated at Sidhartha Nagar, Medchal Village & Mandal, Ranga Reddy District,** presently M.M. District, bounded by North: Plot No. 22, South: Plot No. 24, East: 50'-0" Wide Road and West: Plot No. 10. If any person/s found/s, the same may be handed over at the below mentioned address.

Sd/-
**B. RATHNAKAR RAO**
**ADVOCATE**
H.No. 24-22, Sivapuri,
Malkajgiri, Hyderabad-500047
**Ph.No: 9247483014**





## 'రాజావారి విమానాశ్రయం'!



ఆ మధ్య తెలుగులో 'రాజావారి చేపల చెరువు' పేరుతో ఒక సినిమా వచ్చింది. లేని చేపల చెరువుకు అవినీతి అధికారులు ఏ విధంగా అనుమతులిస్తారో వివరించే కథ. దాదాపు అలాంటి కథే ఓ విమానాశ్రయానిది.1995–1998 మధ్య కాలంలో ఏకంగా 242 మిలియన్ డాలర్ల మేర మోసంచేసిన ఇమాన్యుయెల్ నుద్వే యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేశాడు. అంతకు ముందుగానీ, ఆ తర్వాతగానీ ఇంత వరకూ అలాంటి మోసం జరగలేదంటారు. నైజీరియా రాజధాని అబూజాలో ఒక అత్యాధునిక వసతులతో కూడిన విమానాశ్రయాన్ని నిర్మించడానికి నుద్వే కాంట్రాక్టు పొందాడు. ఒప్పందంలో అతను అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయం, ఆధునిక రన్‌వే, పెద్ద టెర్మినల్, సరుకు రవాణా కేంద్రం, ప్రాంతీయ అభివృద్ధి, ఉపాధి అవకాశాలు వంటి ఎన్నో విషయాలు పేర్కొన్నాడు. కాగితాలను పరిశీలించిన అధికారులు సానుకూల నివేదికలు అందించారు. అందుకే ఎవరూ గట్టిగా ప్రశ్నించలేదు. డబ్బు ఒక్కసారిగా కాదు, దశలవారీగా విడుదలైంది. అనుమతులు, ప్రాథమిక అధ్యయనాలు, బడ్జెట్ కేటాయింపులు, కాంట్రాక్టులు, ఉప కాంట్రాక్టులు, సలహాదారులు. ప్రతి దశకు బిల్లులు, ప్రతి బిల్లుకు ఫైళ్లు, ప్రతి ఫైల్‌కు సంతకాలు. ఇలా క్రమంగా వేల కోట్ల రూపాయల సమానమైన మొత్తం ఖర్చయింది. అన్నీ నిబంధనల ప్రకారమే జరిగినట్టే కనిపించా యి. కానీ, నిజానికి అక్కడ రన్‌వే లేదు. టెర్మినల్ అసంపూర్తిగా నిలిచింది. మార్గనిర్దేశ వ్యవస్థలు లేవు, నియంత్రణ కేంద్రం లేదు, భద్రతా సదుపాయాలు లేవు. ముఖ్యంగా ఒక్క విమానం కూడా అక్కడ దిగలేదు, ఒక్క ప్రయాణికుడూ అడుగు పెట్టలేదు. గేట్లు ఉన్నాయి కానీ తెరవలేదు. పేరు ఉంది కానీ ఉపయోగం లేదు. కాగితాల్లో అభివృద్ధి పరుగులు తీస్తోం ది, వాస్తవంలో మాత్రం శూన్యత. అధికారుల అవినీతికి పరాకాష్టగా నిలుస్తున్న ఈ ఉదంతం కేవలం ఒక వ్యక్తి చేసిన మోసం కాదు. వ్యవస్థలో చోటు చేసుకున్న దుర్మార్గం. ఈ కథ ఒక్క విమానాశ్రయానికే పరిమితం కాదు. అభివృద్ధి పేరుతో జరిగే దోపిడీకి ఇది ప్రతీక. వేలకోట్ల ప్రజాధనం ఒక విమానం కూడా దిగని విమానాశ్రయంలో కరిగిపోయింది.

## బాక్టీరియాను హరించే 'స్మడ్జింగ్'



పురాతన సంప్రదాయాలను అర్థం చేసుకోవడంలో రెండు అతివాదాలు సాధారణంగా కనిపిస్తాయి. ఒకటి వాటిని పూర్తిగా 'అశాస్త్రీయం' అంటూ కొట్టిపారేయడం, రెండవది ప్రశ్నించకుండా 'గొప్ప మహిమ' అని గుడ్డిగా నమ్మడం. కానీ, నిజం ఈ రెంటికి మధ్యలోనే ఉంటుంది. దీనికి మంచి ఉదాహరణ నేటివ్ అమెరికన్ సముదాయాల్లో శతాబ్దాలుగా కొనసాగుతున్న 'స్మడ్జింగ్' అనే ఆచారం. సేజ్, స్వీట్ గ్రాస్, సీడార్ వంటి మూలికలను కాల్చితే వచ్చే పొగతో వాతావరణాన్ని శుద్ధి చేయడం, మనసును ప్రశాంత పరచడం దీని ఉద్దేశం. చాలా కాలంపాటు ఆధునిక శాస్త్రం దీనిని కేవలం విశ్వాసంగా మాత్రమే చూసింది. కానీ ఇటీవలి పరిశోధనలు ఈ సంప్రదాయంలో భౌతిక రసాయన ప్రభావాలు కూడా ఉన్నాయని సూచిస్తున్నాయి. ఒక శాస్త్రీయ అధ్యయనం ప్రకారం, కొన్ని ఔషధ మొక్కలను మూసివేసిన గదిలో కాల్చినప్పుడు గాల్లో ఉన్న బ్యాక్టీరియా పరిమాణం ఒక గంటలోనే గణనీయంగా తగ్గింది. అంతేకాదు, ఆ ప్రభావం కొంతకాలం పాటు కొనసాగినట్టు కూడా గమనించారు. ఇది పూర్తిస్థాయి గాలి శుద్ధి కాదు, వైరస్‌లపై ప్రభావం ఉందని కూడా నిరూపించలేదు. కానీ మొక్కల పొగలో విడుదలయ్యే రసాయన సంయోగాలు గాల్లోని బ్యాక్టీరియాతో పరస్పర చర్యచేసి వాటి సంఖ్యను తగ్గిస్తాయని మాత్రం స్పష్టమైంది. స్మడ్జింగ్ అనేది మొదటినుంచీ అక్కడి వారికి సాంస్కృతిక, ఆధ్యాత్మిక అర్థంతో కూడిన ఆచారమే. శాస్త్రం చేస్తున్న పని ఏమిటంటే, ప్రయోగశాలలు లేకుండానే పూర్వీకులు గమనించిన కొన్ని విషయాలకు సహజ వివరణలను చూపించడం. ఇది ఆధునిక గాలి నాణ్యత పద్ధతులకు ప్రత్యామ్నాయం కాదు, కానీ మన అవగాహనను విస్తరించేది. పురాతన జ్ఞానం కొత్త ప్రశ్నలను లేవనెత్తుతుంది, శాస్త్రం వాటికి సమాధానాలు వెతుకుతుంది. పరిశోధన, విశ్లేషణలతో వచ్చిన అవగాహన మాత్రమే.

## ఉప్పునీటితో వెలిగే లైటు!



ఫిలిప్పీన్స్‌కు చెందిన ఐసా మిజెనో ఎస్ఎఎల్‌టి అనే సస్టెయినబుల్ ఆల్టర్నేటివ్ లైటింగ్ ల్యాంప్‌ను అభివృద్ధి చేసింది. ఇది 2010ల మధ్యకాలంలో ప్రారంభమైన ప్రాజెక్ట్. దీని వెనుక ఉన్న లక్ష్యం చాలా స్పష్టం. విద్యుత్ సౌకర్యం లేని తీరప్రాంత గ్రామాల్లో కిరోసిన్ దీపాల వాడకం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, అగ్ని ప్రమాదాలను తగ్గించడమే ఈ ప్రయత్నం యొక్క కేంద్రబిందువు. ఈ ల్యాంప్ ఎలా పనిచేస్తుందో అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. ఇది బ్యాటరీ కాదు, జనరేటర్ కూడా కాదు. ఇది ఒక ఎలక్ట్రోకెమికల్ సెల్. ఇందులో ఒక మెగ్నీషియం ఎలక్ట్రోడ్ ఒక కార్బన్ ఎలక్ట్రోడ్ ఉంటాయి. వాటి మధ్య ఉప్పు నీరు ఉంటుంది. ఆ ఉప్పు నీరు ఒక ఎలక్ట్రోలైట్‌లా పని చేస్తుంది. ఈ రెండు లోహాల మధ్య జరిగే రసాయన చర్యవల్ల తక్కువ వోల్టేజ్ విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఆ విద్యుత్ ఒక చిన్న ఎల్ఇడి లైట్‌ను వెలిగించడానికి సరిపోతుంది. సారాంశంగా చెప్పాలంటే, ఐసా మిజెనో, ఎల్ఎఎల్‌టి ల్యాంప్ నిజమే. ఉప్పు నీటితో వెలుగు సాధ్యమే. కానీ సముద్రం అంతులేని పవర్ స్టేషన్ కాదు. ఇది సైన్స్ అద్భుతం కాదు. సరైన సమస్యకు సరైన స్థాయి పరిష్కారం.

— బిఎస్ఎస్ మైత్రేయి

## భారత్‌కు చేయూత రష్యా సిద్ధం

కష్టకాలంలో ఆదుకునేవాడే, అండగా నిలిచేవాడే నిజమైన స్నేహితుడు. ఇది మన పూర్వీకులు జీవితాన్ని మధించి చెప్పిన సత్యం. వ్యక్తి స్థాయిలోనేకాదు, దేశాల స్థాయిలోనూ ఇదే వాస్తవం. పశ్చిమాసియాలో ఆధిపత్యం నెలకొల్పే దురాశతో అమెరికా ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై ఐదువారాలుగా (ఫిబ్రవరి 28 నుంచి) సాగిస్తున్న యుద్ధం పర్యవసానంగా, హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయటంతో ప్రపంచం ఇంధన సంక్షోభం ఎదుర్కొంటున్నది. ముఖ్యంగా మన దేశాన్ని, పొరుగుదేశాలను వంటగ్యాస్, పెట్రోలు, డీజిల్, ఎల్.ఎన్.జి కొరత పీడిస్తున్నది. ఒకవైపు పూర్తిస్థాయిలో ఇంధనం అలభ్యత, మరోవైపు ధరల పెరుగుదలతో ప్రజలు సతమతమవుతున్నారు. ఆహార పదార్థాలుండీ వంటచేయలేని భయం కొన్ని రోజులు వెంటాడింది. వీధితినుబండారాల దుకాణా లు, క్యాంటీన్‌లేకాదు, పెద్దపెద్ద హోటళ్లు, రెస్టారెంట్లు కొద్దిరోజులు ఆహార సంక్షోభంలో చిక్కుకున్నాయి. ఇరాన్ సర్వోన్నత నాయకు డు మహమ్మద్ అలీ ఖమేనీ హత్యను ఖండించే, సంతాపం తెలిపే మర్యాదను నరేంద్రమోదీ ప్రభుత్వం చూపకపోయినా, ఇరాన్ ప్రభుత్వం మన దేశం పట్ల మిత్రభావంతో హోర్ముజ్ నుంచి క్రూడ్ ఆయిలు, ఎల్.పి.జి ఓడలు కొన్నింటిని అనుమతించటంతో, దేశంలో గ్యాస్ ఉత్పత్తిని పెంచటంతో పరిస్థితి కుదుటపడింది. అయినా ఇప్పటికీ కొన్ని ప్రాంతాలు కొరతను ఎదుర్కొంటున్నాయి. వ్యూహాత్మక నిల్వలు చాలావరకు తరిగిపోయాయి.

ఈ నేపథ్యంలో మన దేశానికి పూర్వపు సోవియట్ యూనియన్, దాని వారసురాలిగా (వ్యవస్థ తిరోగమించినప్పటికీ) రష్యన్ ఫెడరేషన్ సహాయ సహకారాలు గుర్తు చేసుకోదగినవి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సుంకాల బెదిరింపులకు తలొగ్గి మన బిజెపి ప్రభుత్వం రష్యా నుంచి ఆయిలు కొనుగోలును ఈ సంవత్సరారంభానికి కనీస స్థాయికి తగ్గించింది. ఉక్రేన్‌తో రష్యా యుద్ధాన్ని నిలుపుచేసే చర్యగా ట్రంప్ 2025 ఆగస్టులో రష్యా నుంచి ఆయిలు కొనుగోలు చేసే దేశాలపై 25 శాతం అదనపు సుంకం విధించటం తెలిసిందే. నిలిచిపోయిన వాణిజ్య ఒప్పందంపై మోదీ ప్రభుత్వం చర్చలు పునరుద్ధరించి, దాదాపు అంగీకారానికి వచ్చాక, ట్రంప్ ఆ అదనపు సుంకాన్ని ఎత్తివేశాడు. అయితే రష్యా నుంచి ఆయిలు కొనుగోలు చేస్తే ఆ సుంకం విధిస్తామని షరతు విధించాడు. ఆ ఒత్తిడికి తలొగ్గిన మోదీ ప్రభుత్వం రష్యా నుంచి క్రూడ్ ఆయిలు కొనుగోలు దాదాపు బంద్ చేసి తన కాళ్లకు బంధం వేసుకుంది. మోదీజీ ఇజ్రాయెల్‌లో ఘనంగా పర్యటించి వారిని కీర్తించి, తనను పొగిడించుకుని దేశానికి వెనుదిరిగిన రెండ్రోజులకే అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్‌పై బాంబుల వర్షం కురిపించాయి. అనేక ప్రపంచ దేశాలు కొద్ది రోజుల్లోనే ఇంధన సంక్షోభంలో పడ్డాయి. ఆర్థిక మాంద్యం పరిస్థితులు తలుపుతట్టాయి. ట్రంప్ తమ ప్రియమిత్రుడు నరేంద్ర మోదీపై కరుణ చూపి రష్యా నుంచి ఆయిలు కొనుగోలుకు 'అనుమతించారు'. ఒక స్వతంత్ర, సర్వసత్తాక రాజ్యానికి 'ట్రంప్ అనుమతి' అన్నది నిజంగా అవమానకరం!

ఈ పరిస్థితుల్లో రెండ్రోజులపాటు భారత్ పర్యటనకు వచ్చిన రష్యా డిప్యూటీ ప్రధానమంత్రి డెనిస్ మంతురోవ్ గురువారం ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలుసుకున్నారు. గల్ఫ్ యుద్ధం కారణంగా భారత్ ఎదుర్కొంటున్న క్రూడ్ ఆయిలు, గ్యాస్, ఎరువుల కొరతను తీర్చేందుకు రష్యా సిద్ధంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు. క్రమంగా సరఫరాలు పెంచటానికి తమ కంపెనీలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. 2025 డిసెంబర్‌లో ఢిల్లీ ఆతిథ్య మిచ్చిన ఇండియా–రష్యా సమ్మిట్‌లో కుదిరిన ఒప్పందాలు నెరవేర్చేందుకు ఇరు పక్షాలు చేస్తున్న ప్రయత్నాలను మోదీ హర్షించారట. రష్యా ఇప్పటికే భారత్ కోరుతున్న మినరల్ ఎరువుల సరఫరాను 40 శాతం పెంచింది. అంతేగాక ఇరుదేశాలు సంయుక్తంగా మన వ్యవసాయ రంగానికి అత్యంత ఆవశ్యకమైన "యూరియా" ఉత్పత్తి ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నాయి. మన విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్. జైశంకర్‌తో సమావేశంలో రష్యా ఉపప్రధాని, పశ్చిమాసియా సంక్షోభం సహా ప్రాంతీయ, ప్రపంచ పరిణామాలను సమీక్షించారు. భారత్‌తో అణుశక్తి సహకారం పెంపుదలకు రష్యా సంసిద్ధతను ఆయన తెలియజేశారు. పరిశ్రమలు, రోదసీ, విద్యారంగం ప్రాజెక్టులు కూడా చర్చకు వచ్చాయి. గల్ఫ్‌యుద్ధం తెచ్చిపెట్టిన ఇంధన సంక్షోభం నేపథ్యంలో భారత్, రష్యా చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

భావజాలంరీత్యా, మితవాద విధానాలరీత్యా మోదీకి ట్రంప్ పట్ల ప్రత్యేక అభిమానం ఉండవచ్చు. వారిరువురి మధ్య దోస్తీ పరిఢవిల్లింది. 2020 లో అధ్యక్ష ఎన్నికల సందర్భంలో అమెరికాలో భారతీయులు ఏర్పాటు చేసిన "హౌదీ మోదీ" సభకు ట్రంప్ స్వయంగా హాజరైనారు. 'ఈ పర్యాయం మళ్లీ ట్రంప్' అని మోదీ భారత ఓటర్లకు విజ్ఞప్తి చేశాడు. అయినా ట్రంప్ ఓడిపోయారు – అది వేరు విషయం. కాని ట్రంప్‌కు అమెరికాయే ఫస్ట్. రెండవ టరంలో ట్రంప్ భారత్‌పై ఎక్కువగానే సుంకాలు విధించి వాణిజ్య ఒప్పందం కోసం మోదీ మెడపై కత్తిపెట్టారు.

మోదీకి ట్రంప్‌తో ఉన్నంతగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సన్నిహిత మిత్రత్వం ఉండకపోవచ్చు. రష్యాలో మితవాదులు పైచేయి సాధించి పెట్టుబడిదారీ వ్యవస్థను పునరుద్ధరించుకున్నా రష్యా పేరు వినగానే పాత కమ్యూనిస్టు పాలన, సోషలిస్టు వ్యవస్థ గుర్తుకు వస్తుండవచ్చు. ఆ పాలన భారతదేశ అభివృద్ధికి చేసిన సహాయాన్ని గుర్తు చేసుకోవటం ఇష్టం ఉండకపోవచ్చు. అది గుర్తు చేసుకుంటే జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధి కలలోకి రావచ్చు. అందువల్ల ప్రధాని నరేంద్రమోదీ సామ్రాజ్యవాద వ్యతిరేక, నవ స్వతంత్ర రాజ్యాల అనుకూల అలీన విదేశాంగ విధానానికి తిలోదకాలిచ్చారు. "వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి" సిద్ధాంతంతో అవసరమున్న అందరితో స్నేహ సహకారమంటూ దేశాన్ని అమెరికా, ఇతర పశ్చిమ దేశాలకు సన్నిహితం చేశారు. గల్ఫ్ సంక్షోభ సమయంలో అవి ఏమైనా మనకు చేయూత ఇవ్వగలిగాయా? లేదు. కొన్ని యూరప్ దేశాల్లాగా 'మీది తప్పు' అని ట్రంప్‌కు చెప్పగలిగే ధైర్యం మోదీకి ఉందా? లేదు. అందువల్ల అసలైన మిత్రులెవరో, నకిలీ దోస్తులెవరో మోదీ గ్రహించగలిగితే అది దేశానికి మేలు! ●

# విదేశాంగ విధానాన్ని దిగజార్చిన మోదీ



డి.రాజా
సిపిఐ ప్రధాన కార్యదర్శి

*(నిన్నటి తరువాయి)*

పశ్చిమాసియా ఈ విధ్వంసకర మార్గానికి స్పష్టమైన ఉదాహరణల్లో ఒకటిగా ఉంది. ఈ ప్రాంతం భౌగోళిక రాజకీయ పోటీకి శాశ్వతమైన రంగస్థలంగా మారుతున్నది. దౌత్యపరంగా చర్చలు, సార్వభౌమత్వంపట్ల గౌరవం బదులు మిలటరీ విస్తరణ ఆధిపత్య శక్తి ప్రతిస్పందనగా ఉంది. ఇరాన్‌పై ఇటీవల దాడులతో ఆ సర్వసత్తాక రాజ్య అధినేతను హత్య చేయటం ఆ ప్రాంతం మొత్తాన్ని విస్తృతమైన యుద్ధంలోకి నెట్టే ఒక ప్రమాదకరమైన చర్య. ప్రపంచంపై దాని పర్యవసానాలు ఊహించ లేము.

భారతదేశానికి సంబంధించి ఈ పరిణామాలు ఎక్కడో దూరంగా జరుగుతున్న భౌగోళిక రాజకీయ ఘటనలు కావు; ప్రత్యక్ష పర్యవసానాలతో కూడిన తక్షణ సవాళ్లు. భారతదేశ విదేశాంగ విధానం వలసపాలన వ్యతిరేక పోరాటం నుంచి ఆవిర్భవించిన వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి, అలీనత, సార్వభౌమాధికారాన్ని గౌరవించటం అనే సూత్రాలనుంచి చారిత్రకంగా బలం పుంజుకుంది. నూతనంగా స్వాతంత్ర్యం పొందిన దేశాలు మరింత న్యాయమైన ప్రపంచ వ్యవస్థను కోరుకోవటంలో ఆ సూత్రాలు ప్రతిబింబించాయి

అయితే పశ్చిమాసియాలో దురాక్రమణ విస్తరిస్తున్న నేటి పరిస్థితుల్లో భారత్ మౌనం లోపాయికారి ఆమోదంగా భాష్యం చెప్పబడుతున్నది. ఇది ఆందోళన కలిగించే విషయం. అటువంటి మౌనం వర్ధమాన ప్రపంచంలో (గ్లోబల్ సౌత్) భారతదేశ నైతిక, దౌత్య ప్రతిపత్తిని బలహీనపరుస్తుంది. భారతదేశ ఇంధన భద్రతపై యుద్ధ పర్యవసానాలు – సరఫరాలకు అంతరాయం ఏర్పడి, ధరలు పెరుగుదల – ఇప్పటికే కనిపిస్తున్నాయి. ఎల్‌పిజి ధరలు పెరుగుదల, మొత్తం గా ద్రవ్యోల్బణం ద్వారా సామాన్య ప్రజలు ఈ ఒత్తిళ్లను అనుభవిస్తున్నారు.

స్పష్టతతో, స్వతంత్రంగా జాతీయ ప్రయోజనాలను రక్షించుకునే బదులు ప్రభుత్వం దౌత్య అద్భుతంలో మునిగినట్లుంది. విస్తృత ప్రచారంతో జరిగిన ప్రధాని నరేంద్రమోదీ ఇజ్రాయెల్ పర్యటన వ్యూహాత్మక స్థితి ప్రదర్శనగా చెప్పుకొచ్చారు. అయితే రెండ్రోజులు గడవకుండానే అమెరికా – ఇజ్రాయెల్‌లు ఇరాన్‌పై దాడి ప్రారంభించాయి. భారత్‌కు సంబంధించి, దౌత్యపరమైన సాఫల్యంగా చిత్రించబడిన ప్రధాని పర్యటన ముందుచూపు, స్వతంత్ర వైఖరి కొరవడిన పరువు నష్టంగా రుజువైంది.

ఇరాన్ సుప్రీంలీడర్ అలీ ఖమేనీ హత్యను ఖండించటానికి లేదా లాంఛనంగా సంతాపం తెలియజేయటానికి మోదీ ప్రభుత్వం నిరాకరించటం మరింత ఇబ్బందికరం. అటువంటి మౌనం బలాన్నిగాక దాసోహాన్ని ప్రతిబింబిస్తుంది. అది భారతదేశ స్వరాన్ని అమెరికా వ్యూహాత్మక ప్రాధాన్యతలతో కలపటానికి సుముఖతను సూచిస్తుంది.

అమెరికా ప్రభుత్వాధికారుల ప్రకటనలు పరిశీలించినపుడు అటువంటి కలయిక ప్రమాదం మరింత స్పష్టమవుతుంది. భారతదేశం తన ఉత్పత్తి శక్తులను చైనా పద్ధతిలో అభివృద్ధి చేసుకోవటాన్ని అమెరికా అనుమతించబోదని ట్రంప్ ప్రభుత్వం సీనియర్ అధికారి ఒకరు ఇటీవల అన్నారు. అటువంటి వ్యాఖ్యలు అమెరికా వ్యూహంలో దాగి ఉన్న తర్కాన్ని వెల్లడిస్తాయి. మరో అధికారి రష్యా నుంచి ఆయిలు కొనుగోలుకు భారత్‌కు 'అనుమతి' యిచ్చాడు. ఇది స్వయంప్రకటిత 'విశ్వ గురువు'కు ఎంత అవమానకరం. గ్లోబల్ సౌత్ స్వతంత్ర అభివృద్ధి ఎన్నడూ అమెరికా ధ్యేయం కాదు. వర్ధమాన దేశాలు ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలోపల తమకు అణిగిమణిగి ఉంటే మార్కెట్లుగా, ముడిపదార్థాలు సరఫరా చేసే కేంద్రాలుగా ఉండేటట్లు చూడటం వారి ధ్యేయం.

అమెరికా–ఇజ్రాయెల్ కూటమితో మరింతగా పెనవేసుకుంటున్నట్లు భారత్ కనిపిస్తే బ్రిక్స్ వంటి వేదికలలోపల దాని విశ్వసనీయత ఇబ్బందిలో పడుతుంది. పశ్చిమ దేశాల ద్రవ్య, రాజకీయ సంస్థల ఆధిపత్యాన్ని సవాలు చేసే ప్రయత్నంగా బ్రిక్స్ రూపొందించబడింది. అటువంటి వేదికలలోపల భారత్ స్థితి (ప్రస్తుత చైర్మన్) బలహీన పడితే సమతూకంతో కూడిన, నిజమైన బహుళధృవ ప్రపంచ వ్యవస్థను నిర్మించే విస్తృతమైన ప్రాజెక్టుకు హాని కలుగుతుంది.

> *మానవాళిముందున్న ఎంపిక కఠినమైనది. ప్రపంచం సైనికీకరణ పొందిన పెట్టుబడిదారీ విధానం మార్గంలో ప్రయాణం కొనసాగించాలా లేక సహకారం, సార్వభౌమత్వం, మానవ ఆత్మ గౌరవంపై ఆధారపడిన ప్రత్యామ్నాయ అంతర్జాతీయ వ్యవస్థను నిర్మించేందుకు ఖండాలకతీతంగా ప్రజలు ఐక్యం కావాలా? ఈ సామ్రాజ్యవాద మార్గంలో ప్రయాణాన్ని సవాలు చేయకపోతే ఈ 21వ శతాబ్దం శాశ్వతంగా యుద్ధాల కాలంగా నిర్ధారణ అవుతుంది. అయితే ప్రజాతంత్ర, ప్రగతిశీల శక్తులు సైద్ధాంతిక స్పష్టతతో దాన్ని ఎదుర్కొన్నట్లయితే, పెట్టుబడిదారీ సంక్షోభమే మరింత న్యాయమైన, మానవత్వంతో కూడిన ప్రపంచ అవకాశాన్ని ఆవిష్కరించవచ్చు.*

దాని పర్యవసానాలు భారతదేశ అంతర్గత ఆర్థిక వ్యవస్థకు కూడా తీవ్రంగా ఉంటాయి. అమెరికా నాయకత్వంలోని పెట్టుబడిదారీ విధానంతో బేషరతుగా జతకావటం బెదిరింపులకింద వాణిజ్య ఒప్పందాలకు, అసమ ఒప్పందాలకు దేశం తలొగ్గేటట్లు చేస్తుంది. భారత్–అమెరికా, భారత్–ఇయు ఒప్పందాలు ఇందుకు ఉదాహరణ. అటువంటి ఒత్తిళ్లు రైతులు, కార్మికులు, చిన్నపాటి ఉత్పత్తి దారుల జీవనోపాధికి ముప్పు కలిగిస్తాయి. ఎందుకంటే దేశీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని కాపాడుకోవటంపైనే వారి జీవితాలు ఆధారపడి ఉంటాయి. జాతీయ ఆర్థిక విధానం విదేశీ భౌగోళిక రాజకీయ ప్రయోజనాలకు లోబడినప్పుడు, ఆ భారం అనివార్యంగా శ్రమ జీవులపై పడుతుంది.

అందువల్ల నేడు ఆవిష్కృతమవుతున్న సంక్షోభం కేవలం భౌగోళిక రాజకీయమైనది కాదు. అది వ్యవస్థాగతమైంది. పెట్టుబడిదారీ విధానం దాని సామ్రాజ్యవాద దశలో విదేశాల్లో యుద్ధాలు, స్వదేశంలో అసమానత సృష్టిస్తుంది. సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమై, కోట్లాదిమంది అభద్రతలోకి, దోపిడీలోకి నెడుతుంది. ప్రధానమంత్రి మోదీ కింద బిజెపి మన సొంత ప్రజలను బలిపెట్టి దేశాన్ని దూకుడుగా ఆ బాటలోకి తీసుకెళ్లటం అత్యంత దురదృష్టకరం.

20వ శతాబ్దం పెట్టుబడి ఎగుమతిని సామ్రాజ్యవాదం ప్రధాన లక్షణంగా చూసింది. 21వ శతాబ్దం యుద్ధం ఎగుమతిని దాని పాశవిక వ్యక్తీకరణగా చూస్తున్నది. విధ్వంసం నుంచే లాభాలు రాబట్టుకోవటానికి అది ప్రాంతాలకు ప్రాంతాలనే యుద్ధక్షేత్రాలుగా మారుస్తున్నది. ప్రజాస్వామ్యం గూర్చిన వాగాడంబరం ఆధిపత్యానికి ముసుగు అవుతున్న ది. భద్రత గూర్చిన భాష అనంతమైన సైనికీకరణకు సాకు అవుతున్నది. మానవాళి ఇప్పుడు ప్రమాదకరమైన క్రాస్‌రోడ్స్‌లో నిలబడి ఉంది. ఏక పక్ష అధికారం, శాశ్వత యుద్ధాలు, ఆర్థిక వేధింపులపై నిర్మాణమైన ప్రపంచ వ్యవస్థ సుస్థిరతనుగాని, న్యాయాన్నిగాని సృష్టించ లేదు. అది బాధలను పెంచుతుంది, ప్రపంచం ముక్కచెక్కలు కావటాన్ని వేగిర పరుస్తుంది.

ప్రపంచమంతటా ఉన్న ప్రజాస్వామిక, ప్రగతిశీల శక్తులు ఈ క్షణం తీవ్రతను గుర్తించాలి. ఈనాటి పోరాటం నిర్దిష్టమైన యుద్ధాలు లేదా విధానాలకు వ్యతిరేకంగా మాత్రమేకాదు; వాటిని పదే పదే సృష్టించే వ్యవస్థకు వ్యతిరేకంగా కూడా. సార్వభౌమాధికారం, శాంతి, సామాజిక న్యాయం రక్షించబడాలంటే, ప్రపంచ పెట్టుబడిదారీ విధానాన్ని పోషిస్తున్న సామ్రాజ్యవాద ఆధిపత్య నిర్మాణాలకు వ్యతిరేకంగా పోరాడాలి. దోపిడీపై నిర్మించబడిన వ్యవస్థలు చివరకు ఆ దోపిడీ శక్తులు ఏ ప్రజలనైతే అణచివేయడానికి ప్రయత్నిస్తారో అదే ప్రజల ప్రతిఘటనకు గురవుతారని చరిత్ర పలుమార్లు నిరూపించింది. సామ్రాజ్యవాద యుద్ధాలు దేశాలను ధ్వంసం చేయవచ్చు, అవి ఆ వ్యవస్థ నైతిక, రాజకీయ దివాళాకోరుతనాన్ని ఎండగడతాయి.

మానవాళిముందున్న ఎంపిక కఠినమైనది. ప్రపంచం సైనికీకరణ పొందిన పెట్టుబడిదారీ విధానం మార్గంలో ప్రయాణం కొనసాగించాలా లేక సహకారం, సార్వభౌమత్వం, మానవ ఆత్మ గౌరవంపై ఆధారపడిన ప్రత్యామ్నాయ అంతర్జాతీయ వ్యవస్థను నిర్మించేందుకు ఖండాలకతీతంగా ప్రజలు ఐక్యం కావాలా? ఈ సామ్రాజ్యవాద మార్గంలో ప్రయాణాన్ని సవాలు చేయకపోతే ఈ 21వ శతాబ్దం శాశ్వతంగా యుద్ధాల కాలంగా నిర్ధారణ అవుతుంది. అయితే ప్రజాతంత్ర, ప్రగతిశీల శక్తులు సైద్ధాంతిక స్పష్టతతో దాన్ని ఎదుర్కొన్నట్లయితే, పెట్టుబడిదారీ సంక్షోభమే మరింత న్యాయమైన, మానవత్వంతో కూడిన ప్రపంచ అవకాశాన్ని ఆవిష్కరించవచ్చు.

ఈనాటి అంతర్ సంబంధం కలిగిన, పరస్పర ఆధార ప్రపంచంలో ఎక్కడ యుద్ధం, ఆర్థిక వినాశం సంభవించినా ఇతర అన్నిచోట్లా కడగండ్లు తప్పవు. యుద్ధాలకు దారితీస్తున్న ఈ పెట్టుబడిదారీ సంక్షోభ చక్రాన్ని ఛిద్రం చేసేందుకై పెట్టుబడిదారీ వ్యవస్థ మూల తర్కాన్నే సవాలు చేయాలి. మానవాళి భవిష్యత్ ప్రమాదంలో ఉంది.

రానున్న తరానికి శాంతియుత ప్రపంచాన్ని కోరుకునే ప్రతి ఒక్కరూ అనైతికమైన, క్షీణిస్తున్న పెట్టుబడిదారీ వ్యవస్థను ఓడించేందుకు కలిసికట్టుగా ముందుకురావాలి; అప్పుడు మాత్రమే మానవాళి మనుగడకు భద్రత ఉంటుంది.

*(ముగిసింది)*

# కుదేలవుతున్న వ్యవసాయ రంగం...మోదీ విధానాలతో మరింత సంక్షోభం

భారతదేశంలో అత్యధికులు ఆధారపడిన రంగం వ్యవసాయ రంగం. ఇప్పటికీ 55 శాతం నుండి 60 శాతం మంది ప్రజలు వ్యవసాయరంగంపై ఆధారపడి జీవిస్తున్నారని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. అటువంటి వ్యవసాయ రంగం ఒక విపత్కర పరిస్థితిని ఎదుర్కొంటుంది. దశాబ్ద కాలంగా ప్రకృతి సహకరించకపోవటం, అన్నింటికి మించి వ్యవసాయరంగం పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరి దేశ రైతాంగానికి శాపంగా మారింది. ఈ దేశంలో దశాబ్దకాలం క్రితం వరకు కార్పొరేట్ కన్ను పడని ఏకైకరంగం వ్యవసాయ రంగం. విద్య, వైద్య, పారిశ్రామిక రంగాలు సహా అన్ని కార్పొరేట్ వశమైనా మోదీ పాలన ప్రారంభమైన ఐదేండ్ల తర్వాత కార్పొరేట్లు వ్యవసాయరంగంపై దృష్టి సారించారు. ఎప్పుడైతే కార్పొరేట్ కన్ను వ్యవసాయరంగంపై పడిందో వెంటనే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వ్యవసాయరంగ ప్రోత్సాహకాలను క్రమేపీ తగ్గిస్తూ వచ్చారు. రసాయనిక ఎరువులపై సబ్సిడీలను ఎత్తివేయడంతో పాటు ఉచిత విద్యుత్, ఇతరత్రా వ్యవసాయ రంగ సబ్సిడీలను క్రమేపి తగ్గించారు. కొన్నింటిపై 50 శాతం నుంచి 70 శాతం వరకు తగ్గించగా మరికొన్నింటిపై పూర్తిగా ఎత్తివేశారు. కనీస మద్దతు ధర ప్రకటన విషయంలో కనీస శాస్త్రీయత పాటించడం లేదు. పెట్టుబడి ఆధారంగా మద్దతు ధర ప్రకటించాలన్న రైతాంగ చిరకాల డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం అసలు పరిగణలోకి తీసుకోవడం లేదు. చాలా వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర ప్రకటించినా రైతుకు గిట్టుబాటు అయ్యేవిధంగా ఆ ధరలు లేవన్నది సుస్పష్టం. మరికొన్నింటి విషయంలో కేవలం మద్దతు ధరలను ప్రకటించి వదిలి పెడుతున్నారు తప్ప అమలులో మాత్రం చిత్తశుద్ధి కనిపించడం లేదు. కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్లకు సానుకూలంగా వ్యవహరించేందుకే మూడు నల్ల చట్టాలను అమల్లోకి తీసుకు వచ్చింది. దేశ రైతాంగ ప్రతిఘటన కారణంగా కొంతమేర వెనక్కి తగ్గినా దొడ్డిదారిన అమలు చేసేందుకు పూనుకున్నది. కొత్త విద్యుత్ బిల్లు విషయంలో కేంద్ర ప్రభుత్వం వెనక్కు తగ్గలేదు. స్మార్ట్ ప్రీ పెయిడ్ మీటర్లను తీసుకువచ్చి రైతాంగంపై భారాలు మోపేందుకు సిద్ధమవుతుంది. నూతన విద్యుత్ బిల్లు 2025 పూర్తిగా కార్పొరేట్ కనుసన్నల్లోనే ఉందన్నది వాస్తవం. ఇప్పటికే హైబ్రిడ్ విత్తనాలు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. గతానికి భిన్నంగా విత్తన విషయంలో పాలకులు వ్యవహరిస్తున్నారు. రైతులే తయారు చేసుకునే విత్తనాల స్థానే ఆధునిక పద్ధతుల నెపంతో హైబ్రిడ్ విత్తనాలను తీసుకు వచ్చారు. కొత్త విత్తన చట్టం కారణంగా విదేశీ విత్తనాలను ఉచితంగా దిగుమతి చేసుకోవడానికి అనుమతి ఇస్తూ అదే సమయంలో బ్లాక్ మార్కెట్‌పై ఉన్న నిషేధాన్ని కూడా ఎత్తివేసే ప్రయత్నాలను ప్రారంభించింది. ప్రపంచ విత్తన రంగాన్ని శాసిస్తున్న ఐదారు విత్తన కంపెనీలకు ఈ ప్రభుత్వం దాసోహం అంటుంది. ఆ క్రమంలోనే విత్తన బిల్లు 2025 రూపుదిద్దుకున్నది. ఇది భారత దేశ విత్తనరంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపడమే కాకుండా స్వదేశీ విత్తనరంగం కుదేలు అవుతుంది. కొత్త విత్తన చట్టంతో రైతు పరిస్థితి జుట్టు చేతికి ఇచ్చి తన్నుకులాడే పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికే హైబ్రిడ్ విత్తనాలు, కల్తీ, నాసిరకం విత్తనాల కారణంగా ప్రతియేటా దేశంలో 10 శాతం మంది రైతులు నష్టపోతున్నారు. ఇక అన్నింటికి మించి మోదీ ప్రభుత్వం అమెరికాతో కుదుర్చుకున్న ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం భారత రైతాంగం పాలిట శాపంగా మారింది. మోదీ ఈ విషయంలో ట్రంప్ ముందు సాగిలపడి ట్రంప్ చెప్పినట్లు తలాడించినట్లుగా ఉందని వ్యవసాయ రంగ విశ్లేషకులు ఆరోపిస్తున్నారు. గతంలో వ్యవసాయ రంగ దిగుమతులకు సంబంధించి 37 శాతం ఉన్న సుంకాన్ని ఏకంగా తొలగించడం, అదే ఎగుమతుల విషయంలో 2.5 శాతం ఉన్న సుంకాన్ని 18 శాతానికి పెంచడానికి అంగీకరించడం ద్వారా భారతదేశ సౌరభౌమత్వంతో పాటు దేశ రైతుల ఆత్మ గౌరవాన్ని మోదీ ట్రంప్ ముందు తాకట్టు పెట్టాడు. విదేశీ దిగుమతులు ఎటువంటి సుంకం లేకుండా దేశంలోకి స్వదేశీ వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్ గణనీయంగా పడిపోతుంది. కొన్ని వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేసే వారు లేక ఆ సాగే కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికే ప్రతి యేటా లక్షల కుటుంబాలు వ్యవసాయ రంగం నుంచి వైదొలిగి ప్రత్యామ్నాయ రంగాలవైపు పోతున్నాయి. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కనుసన్నల్లో భాగంగా వ్యవసాయ రుణాలను కఠినతరం చేసింది. ఉదాహరణకు కోటి రూపాయలు విలువ కలిగే ఒక పరిశ్రమకు 80 శాతం అంటే రూ. 80 లక్షల వరకు రుణాలు ఇస్తున్న బ్యాంకులు రూ.20 లక్షలు విలువ చేసే భూమికి లక్ష రూపాయల పంట రుణాన్ని ఇవ్వడానికి జంకుతున్నాయి. రైతులను నానా ఇబ్బందులు పెడుతున్నాయి. ఇదే సమయంలో కార్పొరేట్లు ఏళ్ల తరబడి రుణాలు చెల్లించకున్నా పల్లెత్తు మాట అనకుండా గౌరవిస్తుండగా రైతుల విషయంలో తద్విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. రుణ మాఫీ చేస్తే దేశ ఆర్థిక రంగంపై తీవ్ర ప్రభావం చూపుతుందని విశ్లేషణ చేసే సోకాల్డ్ ఆర్థిక వేత్తలు లక్షల కోట్ల రూపాయల కార్పొరేట్ రుణాల రద్దు విషయంలో మాత్రం నోరు మెదపడం లేదు. పారిశ్రామిక సబ్సిడీలు, వ్యవసాయ రంగ సబ్సిడీలతో పోల్చిచూసినప్పుడు దశాబ్ద కాలంలో వ్యవసాయ రంగ సబ్సిడీలు క్రమేపి తగ్గగా కార్పొరేట్ అధీనంలోని పారిశ్రామిక ప్రోత్సహకాలు మూడు రేట్లు పెరిగాయనడంలో ఎటువంటి సందేహం లేదు. మరోపక్క ఎప్పుడు లేనంతగా భూమి కూడా కొందరి చేతుల్లో పోగుపడుతుంది. చిన్న సన్నకారు రైతులతో సమ్మిళితమైన భారత వ్యవసాయరంగం ఇప్పుడు కార్పొరేట్ల వశమవుతున్నది. వందల వేల ఎకరాలు ఒకరి ఆధీనంలోకి వెళ్తుండగా ఇప్పటి వరకు వ్యవసాయ రంగంపై ఆధారపడిన చిన్న, సన్నకారు, మధ్యతరగతిరైతులు కార్పొరేట్ వ్యవసాయ రంగంలో కూలీలుగా మారిపోతున్నారు. తెలంగాణలో భూకమతాలు నైజాం నాటి పరిస్థితులను గుర్తుకు తెస్తున్నాయి. మారుమూల పల్లెటూళ్లలో సైతం సంపన్న వర్గాలు వందల ఎకరాలను కొనుగోలు చేస్తున్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న యాంత్రీకరణ ఆహ్వానించదగినదే అయినా మరోక పక్క భారతదేశ రైతాంగం యాంత్రీకరణ పుణ్యమా అని పనులు కోల్పోయి ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే ఒక స్థాయి కలిగిన ధనిక రైతులు సైతం వ్యవసాయ భూమిని కొనుగోలు చేసే పరిస్థితి లేదు. ధరల పెరుగుదలతో భూమి సామాన్యునికి దూరమవుతుందన్న వాస్తవాన్ని గ్రహించలేకపోతున్నారు. భూమి సామాన్యుల నుంచి దూరమైన తర్వాత పరిస్థితి ఏవిధంగా ఉంటుం దో మనకు తెలియంది కాదు. రాజకీయ పార్టీలకు వ్యవసాయ రంగ నిపుణులకు, పాలకులకు కూడా వ్యవసాయ రంగ పరిరక్షణ తక్షణ కర్తవ్యం కావాలి. పైన పేర్కొన్నట్లుగా ఈ దేశ జనాభాలో సగానికి పైబడి ఆధారపడిన వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోయినా కొందరి గుప్పెట్లో బందీ అయినా ఇది ఈ దేశ ఆర్థిక వ్యవస్థపై స్పష్టమైన ప్రభావాన్ని చూపుతుంది. ముందుగా నిరుద్యోగం పెరిగి ఉపాధి లేక ప్రజలు తీవ్ర నిరాశ, నిస్పృహాలకు గురై ఆవేదన చెంది ఆ తర్వాత ఆవేశానికి గురైతే అశాంతి ప్రబలుతుంది. దేశ ఆర్థిక రంగంలో ఒక గణనీయమైన భాగమైన వ్యవసాయరంగం కుదేలు కావడం ద్వారా దేశ ఆర్థికరంగం క్షీణ దశకు చేరుతుంది. తలసరి ఆదాయం తగ్గి సంపద కొందరి చేతుల్లో పోగుపడుతుంది. వ్యవసాయరంగం సంక్షోభం పాలకులకు లేదా కొందరు రాజకీయ నాయకులకు చాలా చిన్న విషయంగా కనిపించవచ్చు. ఇదే ధోరణి వారిలో ఉంటే విదేశాలలో జరిగిన తిరుగుబాటు ఘటనలు భారతదేశంలోనూ పునరావృతమైనా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. వ్యవసాయరంగ పరిరక్షణ ఇప్పుడు పాలకుల బాధ్యతగా ఉండాలి.

ఏనుగు వెంకటేశ్వరరావు,
ఖమ్మం

# ఆహార వ్యాపారంపై 'గ్యాస్' దెబ్బ

**సరఫరా లేని వాణిజ్య గ్యాస్‌బండలు**
**మూతపడుతున్న చిన్న చిన్న హోటళ్లు**
**ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు**
**సంక్షోభంలో స్టార్ హోటళ్లు**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఇరాన్, అమెరికాల మధ్య యుద్ధ ప్రభావం ప్రజలపై పడుతుంది. క్రమేపీ ధరలు పెరగడంతో పాటు ఇతరత్రా నిత్యావసర వస్తువుల కొరత ఏర్పడుతుంది. 'ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చినట్లు' ఇప్పుడు యుద్ధం కారణంగా విపరీతమైన గ్యాస్ కొరత ఏర్పడింది. గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ల కొరతతో పాటు వాణిజ్య అవసరాలకు వినియోగించే గ్యాస్ బండలు దొరకకపోవడంతో ఆహార వ్యాపారంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఒక్క ఖమ్మం నగరంలోనే ప్రతి రోజు రూ. 50 లక్షల నుంచి రూ.70 లక్షల ఆహార వ్యాపారం జరుగుతుంది. స్టార్ హోటళ్లు మొదలు చిన్న చిన్న హోటళ్లు, టీ స్టాల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్స్ గ్యాస్ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. వాణిజ్య గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్‌ను వినియోగిస్తున్నారని మరో పక్క అధికారులు పెద్ద ఎత్తున దాడులు చేస్తున్నారు. దీనితో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు చిన్న చిన్న హోటళ్లు మూసి వేస్తుండగా స్టార్ హోటళ్లు సైతం తీవ్ర గ్యాస్ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. యుద్ధానికి ముందు వివిధ గ్యాస్ కంపెనీలు ఇంటింటికి తిరిగి గ్యాస్‌ను సరఫరా చేసేవి. ఇందుకు పూర్తి విరుద్ధంగా ప్రస్తుత పరిస్థితి ఉంది. ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకుంటేనే గ్యాస్‌ను సరఫరా చేస్తామని గ్యాస్ డీలర్లు చెబుతున్నారు. ఎంత ప్రయత్నించినా గ్యాస్ ఆన్‌లైన్ ద్వారా బుక్ కావడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. ఒక్కొక్కసారి ఆన్‌లైన్‌లో స్పందన వచ్చినప్పటికీ డెలివరీ డేట్ సరిగ్గా ఉండడం లేదని వారం నుంచి 10 రోజులు పడుతుందని వినియోగదారులు వాపోతున్నారు. ఇంటింటికి తిరిగి గ్యాస్ సరఫరా చేయడంతో చాలా మంది గ్యాస్ వినియోగదారులు తమ పేరును రిజిస్ట్రేషన్ చేసుకుని పాస్‌పుస్తకాలు తీసుకోలేదు. తీసుకోవాల్సిన అవసరం కూడా రాలేదు. ఇంటి వద్దనే డబ్బులు చెల్లిస్తే గ్యాస్ సరఫరా చేయగా ఇప్పుడు ఆన్‌లైన్‌లో బుక్ చేయాలి అన్న నియమంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాణిజ్య అవసరాలకు సంబంధించి కోరిన వెంటనే గ్యాస్ సరఫరా చేసేవారు. ఇప్పుడు గ్యాస్ కొరత ఏర్పడడంతో వాణిజ్య బండల సరఫరాలో తీవ్ర జాప్యం జరుగుతుంది. ఒక చిరు హోటల్ యజమాని మాట్లాడుతూ తనకు నాలుగు రోజులకు ఒక గ్యాస్ బండ సరిపోతుందని కాని 15 రోజులుగా వాణిజ్య గ్యాస్ సరఫరా లేకపోవడంతో గడిచిన వారం రోజుల నుంచి హోటల్ మూసివేశానని తెలిపారు. ఖమ్మం నగరంలో చాలా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు మూతపడ్డాయి. చిన్న చిన్న హోటళ్లు కూడా మూతపడే దిశలో ఉండగా కొన్ని ఇప్పటికే మూసివేశారు. హోటళ్ల మూత కేవలం వ్యాపారానికి సంబంధించిందే కాకుండా ఆహార వ్యాపారంపై ఆధారపడి జీవించే పలువురు కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆహార వ్యాపారంపై ఆధారపడి ఒక్క ఖమ్మం జిల్లాలో 50వేల మంది జీవిస్తున్నారు. ఒక్కొక్కరుగా ఉపాధి కోల్పోతున్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వాణిజ్య గ్యాస్ కొరత లేకుండా సరఫరా చేయాలని ఆహార వ్యాపారులు కోరుతున్నారు. ఈ విషయమై అధికారులను సంప్రదించగా సోమవారం నుంచి పూర్తి స్థాయిలో వాణిజ్య గ్యాస్ అందుబాటులోకి రానుందని తెలిపారు. మొత్తంగా గ్యాస్ కొరతను నివారించి వ్యాపార వర్గాలకు అందుబాటులో ఉండేవిధంగా చూడాలని కోరుతున్నారు.

## 19న తెలంగాణ మోడల్ స్కూల్స్ ప్రవేశ పరీక్ష

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ మోడల్ స్కూల్స్ 2026– 27 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతి ప్రవేశాలు, ఏడు నుండి పదవ తరగతులలో మిగిలిన సీట్ల భర్తీ కోసం నిర్వహించే కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ను 19న నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారిణి చైతన్యజైని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరవ తరగతి పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఏడు నుంచి 10 తరగతుల పరీక్ష మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహించబడుతుందని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రశ్నపత్రాల లీకేజీ వంటి పుకార్లను నమ్మవద్దని సూచించారు. ఇటువంటి పుకార్లను గమనించినట్లయితే వెంటనే కలెక్టర్, పోలీస్ కమిషనర్, విద్యాశాఖాధికారులకు సమాచారం అందించాలని ఆమె తెలిపారు. టిజి మోడల్ స్కూల్ కారేపల్లి, జెడ్పిఎస్ఎస్ కారేపల్లి, టిజి మోడల్ స్కూల్ కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు.

## ఫీజు బకాయిలపై హైకోర్టు తీర్పు పునఃసమీక్ష చేయాలి

ఎఐఎస్ఎఫ్ డిమాండ్




**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** ఫీజు బకాయిల విషయంలో విద్యార్థుల నుండి వసూలు చేసి, తర్వాత ప్రభుత్వం చెల్లించాలని సూచించిన తెలంగాణ హైకోర్టు తీర్పు సరైనది కాదని ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్(ఎఐఎస్ఎఫ్)విమర్శించింది. ఈ తీర్పు పేద విద్యార్థుల చదువులకు తీవ్ర నష్టం కలిగిస్తుందని, వెంటనే పునఃసమీక్ష చేయాలని డిమాండ్ చేసింది. జిల్లా కేంద్రంలో ఈసందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు చేస్తామని హామీ ఇవ్వడంతోనే ప్రైవేటు కళాశాలలు విద్యార్థులను చేర్చుకున్నాయని తెలిపారు. అలాంటిది ప్రభుత్వమే బకాయిలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తుండగా, విద్యార్థులపై భారాన్ని మోపడం అన్యాయమని అన్నారు. రాష్ట్రంలో సుమారు 14లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పేద విద్యార్థులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని, తాజా తీర్పుతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఫీజు బకాయిల పేరుతో ప్రైవేటు కళాశాలలు విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధింపులకు గురిచేస్తున్నాయని, గతంలో ఇలాంటి ఒత్తిళ్లతో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు కూడా ఉన్నాయని గుర్తు చేశారు. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేసి సమస్యను పరిష్కరించాలని, హైకోర్టు తీర్పును పునః సమీక్షించి విద్యార్థులకు న్యాయం చేయాలని ఎఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో మాణిక్యాల వినయ్, సంజయ్ కీర్తన, వై. సంజన, మానస, స్వప్న, స్పందన, కవిత, సోనీ, ఉదయ్, రాజేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమానికి సోలార్ వితరణ



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండలం ఇరవెండికి చెందిన తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్టు మరోసారి తన ఔదార్యాన్ని చాటుకుంది. భద్రాచలంలోని సరోజిని వృద్ధాశ్రమానికి రూ.5లక్షల వ్యయంతో 10కేవీ సోలార్ విద్యుత్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పటికే ట్రస్టు ఆధ్వర్యంలో ఆశ్రమ భవనం నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టగా, తాజాగా సోలార్ విద్యుత్ ఏర్పాటు ద్వారా మరోసారి తన సేవాభావాన్ని ప్రదర్శించింది. ట్రస్టు ఛైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య మనవడు, ప్రవాస భారతీయుడు, తాజా మాజీ అధ్యక్షులు తాళ్లూరి జయశేఖర్, నీలిమ దంపతుల కుమారుడు సాయి పంచాక్షర్ తన మొదటి నెల వేతనం నుండి రూ. 5లక్షలతో ఈ సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేయించడం విశేషం. చిన్ననాటి నుంచే సమాజసేవపై ఆసక్తి కలిగిన ఆయన, స్వగ్రామ అభివృద్ధికి నిరంతరం చేయూతనిస్తున్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ వ్యవస్థను శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఆశ్రమానికి ఈ భారీ విరాళం అందించిన ట్రస్టు సభ్యులకు ఆశ్రమ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య, తానా మాజీ అధ్యక్షులు తాళ్లూరి జయశేఖర్, నీలిమ దంపతులు, ట్రస్టు ఛైర్మన్ వల్లూరిపల్లి వంశీకృష్ణ, బూర్గంపాడు పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణ, అడుసుమిల్లి జగదీశ్, పల్లంటి దేశప్ప, మోతుకూరి వీరయ్య, బొడ్డపాటి రామారావు, చావా లక్ష్మీనారాయణ, జలగం చంద్రశేఖర్, ఆశ్రమ నిర్వాహకులు సరోజిని తదితరులు పాల్గొన్నారు.

## పిహెచ్‌సి పనులను త్వరగా పూర్తి చేయాలి

అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరమ్మతుల పనులను శర వేగంగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. మండలంలోని చెరువుమాధారం, నేలకొండపల్లి ప్రభుత్వ హాస్పిటల్స్ ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత చెరువుమాధారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. హాస్పిటల్ వరకు సీసీ రోడ్డును ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం నేలకొండపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేసి, పలు రికార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్‌లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, హాస్పిటల్ చుట్టూ ప్రహరీ నిర్మాణంను చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ వైద్యం పట్ల ప్రజలకు నమ్మకం కలిగేలా సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ కె.రాజశేఖర్ గౌడ్, తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీఓ ఎం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి శివ, పీఆర్ ఏఈ ప్రసాద్, వైద్యాధికారులు డాక్టర్ మంగళ, డాక్టర్ కె.రాజేష్, డాక్టర్ శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ చట్టాన్ని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం



**ప్రజాపక్షం/కొణిజర్ల :** కొట్లాడి తెచ్చుకున్న ఉపాధిహామీ చట్టాన్ని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, ఇలాంటి చర్యలు మానుకోవాలని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతురావు అన్నారు. మండల పరిధిలోని చిన్నమునగాలలో శనివారం సిపిఐ సీనియర్ నాయకుడు పాపగంటి గురువయ్య సంస్మరణ సభలో బాగం హేమంతురావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండు సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు వామపక్ష కమ్యూనిస్టు పార్టీలు పార్లమెంట్ సభ్యులుగా భాగస్వామ్యులుగా ఉండి యుపిఎ ప్రభుత్వంలో పోరాడి వ్యవసాయ కార్మికులకు అవసరమైన గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని తీసుకువస్తే దానిని ఎత్తివేసేందుకు కేంద్రప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. దీంతోపాటు అనేక సంవత్సరాలుగా పోడు సాగుచేసుకుంటున్న గిరిజనులకు అటవీ హక్కుల చట్టాన్ని, సమాచార హక్కుచట్టాన్ని తీసుకురావడం జరిగిందని అన్నారు. బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ, ప్రజలకు ఉపయోగపడే చట్టాలను రద్దుచేయాలని చూడటం దుర్మార్గమైన చర్య అని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలుచేయడంలో విఫలమైందని విమర్శించారు. సాగర్ జలాలను ఏప్రిల్ చివరివరకు విడుదల చేసి పంటలను కాపాడాలని పేర్కొన్నారు. మొక్కజొన్నలను ఎటువంటి నిబంధనలు లేకుండా రైతులదగ్గర ఉన్నవి మొత్తం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పాపగంటి గురవయ్య తన జీవితం అంతా ఎర్రజెండా నీడలో ఉన్నాడని కొనియాడారు. మండలంలో పేదప్రజల సమస్యల పరిష్కారానికి, ఇండ్ల స్థలాలు ఇప్పించడానికి కమ్యూనిస్టుపార్టీ పోరాటంలో ముందువరుసలో ఉన్నదని స్పష్టంచేశారు. ఈ సంతాపసభలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు, మాజీ జెడ్‌పిటిసి యర్రా బాబు, సిపిఐ మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు, ఎఐవైఎఫ్ జిల్లా నాయకులు మనిగె కోటేశ్వరరావు, జిల్లా సమితి సభ్యుడు పాపగంటి సుదర్శన్, అచ్చన శ్రీను, పెద్దమునగాల గ్రామ ఉపసర్పంచ్ సుంకర రాధాకృష్ణ, శాఖ క్యాదర్శి తలారి కృష్ణ, పరిటాల భద్రయ్య, నారాయణ; రాజేష్, సంసోన్ కరుణాకర్, చిన్నమునగాల గ్రామ సర్పంచ్ పూనాటి బాబు తదితరులు పాల్గొన్నారు.

## 30 వరకూ సాగర్ నీటిని విడుదల చేయాలి: సిపిఐ వినతి



**ప్రజాపక్షం/ఖమ్మం :** నాగార్జున సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు పరిధిలో ఏప్రిల్ 30 వరకూ సాగర్ నీటిని విడుదల చేయాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు నేతృత్వంలో నాగార్జున సాగర్ చీఫ్ ఇంజనీర్ మంగళపూడి వెంకటేశ్వర్లుకు శనివారం ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో సాగర్ ఆయకట్టు ఎడమ కాలువ పరిధిలో సుమారు రెండున్నర లక్షల ఎకరాలు సాగవుతుందని ఆయన తెలిపారు. రెండవ పంటగా సాగు చేసిన వరి, మొక్కజొన్న, మిర్చితో పాటు ఇతర పంటలకు ఈనెలాఖరు వరకు సాగునీరు అవసరం ఉందన్నారు. వారబంధి లేదా నీటి విడుదల పరిమాణాన్ని తగ్గిస్తే చివరి ఆయకట్టుకు నీరందక రైతులు ఇబ్బందులు పడే ప్రమాదం ఉందన్నారు. ఏప్రిల్ చివరి వరకు పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేయాలని కోరారు. దీనికి సిఈ స్పందిస్తూ నీటి అవసరాలు ఉన్న మాట వాస్తవమేనని ఉన్నతాధికారులతో మాట్లాడి ఈనెలాఖరు వరకు సాగునీటిని అందించే ప్రయత్నం చేస్తామని, పంటలను కాపాడతామని ఆయన తెలిపారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సిపిఐ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, రైతు సంఘం నాయకులు నంబూరి శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టిజన్‌ల డిమాండ్లను నెరవేర్చాలి

కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్




**ప్రజాపక్షం/పాల్వంచ :** తమ న్యాయమైన డిమాండ్‌లను నెరవేర్చాలని పలుమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదని ఆర్టిజన్‌లు సమ్మెబాట పట్టారు. శనివారం కేకేటిపిఎస్ అంబేద్కర్ సెంటర్‌లో తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటి (జాక్) ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. కార్మిక సంఘాలతో పాటుగా అఖిలపక్ష నేతలు ధర్నాలో పాల్గొని సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సిపిఐ, సిపిఎం, ఇతర వామపక్షాలు, బిజెపినాయకులు పాల్గొన్నారు.

**సమస్యలు పరిష్కరించాలి: మేయర్ మూడ్ గణేష్**

ఎన్నో ఎండ్లుగా చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదీస్తున్న కార్మిక కుటుంబాలపై రాష్ట్ర ప్రభుత్వం కనికరం చూపి వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ డిమాండ్ చేశారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అసెంబ్లీలో ఆర్టిజన్‌ల సమస్యలపై మాట్లాడినట్లు గుర్తు చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్‌పాషా కార్మికుల సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర నాయకుడు రావుల మురళి, సిపిఐ పట్టణ కార్యదర్శి, 40వ, డివిజన్ కార్పొరేటర్ అడుసుమిల్లి సాయిబాబా, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉప్పుశెట్టి రాహుల్, బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సిపిఎం నాయకులు దొడ్డా రవికుమార్, పట్టణ కార్యదర్శి తులసీరామ్, సత్య, నిరంజన్, యాఖూబ్, ఖురేషి, నాయకులు శనగారపు శ్రీనివాసరావు, ఇట్టి వెంకటరావు, నిమ్మల రాంబాబు, ఆర్టిజన్ నాయకులు శంకర్, రాములు,క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

**పోరాటాన్ని ఉధృతం చేస్తాం :** అర్టిజన్‌ల న్యాయమైన సమస్యలను పరిష్కరించకుంటే తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని కార్మిక సంఘాల జెఎసి నాయకులు స్పష్టం చేశారు. ధర్నాను ఉద్దేశించి నాయకులు మాట్లాడారు.ఆర్టిజన్ కార్మికుల న్యాయమైన పోరాటానికి పార్టీలకు అతీతంగా తమకు మద్దతును ప్రకటించాలని కోరారు. ఆర్టిజన్‌ల బతుకు పోరాటానికి మేము చేస్తున్న పోరాటం సంకేతంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్‌వికేఎస్, 1635, 1104, 327, సిఐటియు, ఎఐటియుసి, బిఎంఎస్, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి: మున్సిపల్ చైర్‌పర్సన్ సుజాత



**ప్రజాపక్షం/ మధిర :** ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలను పరిష్కరించాలని మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత అన్నారు. శనివారం మధిర మున్సిపాలిటీ 4వ వార్డు ఇల్లందులపాడు, చెరుకుమల్లి వారి వీధిలో స్థానిక నేతలతో కలిసి విస్తృతంగా పర్యటించి ఆ ప్రాంత ప్రజలతో చైర్‌పర్సన్ సుజాత ముఖాముఖి నిర్వహించారు. ఇల్లందులపాడులో కొన్ని చోట్ల డ్రైనేజి వ్యవస్థ లేకపోవడంతో వరదల సమయంలో నీరు నిలిచి ఇళ్లల్లోకి చేరుతుందని స్థానికులు తెలపడంతో ఈ ప్రాంతంలో డ్రైనేజి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డ్రైన్ వ్యవస్థను పరిశీలించడంతో పాటు డ్రైన్ పూడిక తీస్తున్న పారిశుద్ధ్య కార్మికుల పనితీరును పర్యవేక్షించారు. అక్కడ కార్మికులతో మాట్లాడిన చైర్‌పర్సన్ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పట్టణ పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఎస్ఐ శివకృష్ణ, మేస్త్రి నరేష్, వార్డు ప్రజలు సత్యనారాయణ, షేక్.మదర్‌సాహెబ్, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కోతలు మొదలు.. కొనుగోళ్లు ఎప్పుడు?

7 కేంద్రాలు ప్రారంభం .. ఖాంటాలు నిల్




**ప్రజాపక్షం/చింతకాని :** జిల్లాలో గతేడాది కురిసిన భారీవర్షాలతో చెరువుల్లో , బోరు బావుల్లో పుష్కలంగా నీరుండటంతో రైతులు యాసంగిలో ఖమ్మం జిల్లాలో 1,85,000 ఎకరాల్లో మొక్కజొన్న పంటను విస్తారంగా సాగు చేశారు. ముఖ్యంగా బోనకల్, చింతకాని, కొణిజర్ల మండలాల్లో పెద్ద ఎత్తున సాగు చేశారు. పంట కోతలు మొదలైనా ప్రభుత్వం ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాల ఊసెత్తడం లేదు. జిల్లాలోని చింతకాని, బోనకల్, కొణిజర్ల తదితర మండలాల్లో మొక్కజొన్న పంట కోతలు మొదలయ్యాయి.ఈ మండలాల్లో ఇప్పటికే 30శాతం మొక్కజొన్న పంట కోతలు పూర్తయ్యాయి. రైతుల చేతిలోకి పంట రావడం మొదలవడంతో నేడు రూ1,800కు దళారులు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ పరంగా కొనుగోలు కేంద్రాల అరకొరగా ప్రారంభించినా నేటికి అవి తెరుచుకుని క్వింటా కొనుగోలు చేసిన పాపాన పోలేదని గత్యంతరం లేక దళారులకు తక్కువ ధరకు అమ్మాల్సివస్తుందని రైతులు వాపోతున్నారు. మూడేళ్ల నుంచి యాసంగిలో అన్నదాతలు ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోతున్నారు. ఈసారి కోత దశ వరకు వాతావరణం అనుకూలించింది. పంట ఏపుగా పెరగడంతో దిగుబడిపై గంపెడాశలు పెట్టుకున్నారు. దిగుబడి గణనీయంగా వచ్చే అవకాశం ఉంది. కాలం కలిసొచ్చినా పంటను కొనేవారు లేకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

**షరతులతో కొనుగోళ్లు..**

చింతకాని, మధిర, బోనకల్లు, వైరా, కొణిజర్ల , రఘునాధపాలెం, వేసూరు, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాల్లో మొక్కజొన్న విస్తారంగా దిగుబడి రావడంతో ఎకరాకు 4050 క్వింటాళ్లు దిగుబడి వస్తుంది. అయితే ఎకరాకు 26.50 క్వింటాళ్లనే మార్క్‌ఫెడ్ ద్వారా కొనాలని సర్కార్ నిర్ణయించింది. తేమ శాతం 14 ఉంటే క్వింటాకు మద్దతు ధర రూ.2400 దక్కుతుంది.

**తక్షణమే కొనుగోలు కేంద్రాలన్నీ ప్రారంభించాలి..**
**కొండపర్తి గోవిందరావు (ఎఐకెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి)**




జిల్లాలో రైతులు 1,85,000 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు.దళారులు రోజు రోజుకు ధర తగ్గించి రైతులను మోసం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే మార్క్‌ఫెడ్ ద్వారా జిల్లావ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు చేసి కొనుగోళ్లు ప్రారంభించి రైతులకు మద్దతు ధర కల్పించాలి.

**దళారులు రూ.1800కే అడుగుతున్నారు: దొబ్బల నర్సింహారావు (రైతు, రాఘవాపురం)**




పంట చేతికొచ్చి వారం రోజుల నుంచి కొనుగోలు కోసం ఎదురు చూస్తున్నాం . దళారులు రూ.1800కే అడుతున్నారు. ప్రభుత్వం కొనుగోళ్లు ప్రారంభిస్తే రైతులకు న్యాయం జరుగుతుంది.చింతకాని సహకార సంఘం పరిధిలో గతంలో లాగా సబ్ సెంటర్లు ఏర్పాటు చేస్తే రైతులకు న్యాయం జరుగుతుంది.

**నిబంధనలు సడలించి మొక్కజొన్నలన్నీ కొనాలి.**
**అబ్బూరి మహేష్ (రైతు రాఘవాపురం)**

ఆరెకరాలు కౌలుకు తీసుకుని యాసంగిలో మొక్కజొన్న సాగుచేశాను. దిగుబడి ఎకరాకు 40క్వింటాళ్లు వస్తాయి. ప్రభుత్వం 26.50 క్వింటాళ్లు కొనుగోలు చేస్తే మిగతావి ఎక్కడ అమ్మాలో అర్థం కావడం లేదు. నిబంధనలు సడలించి రైతులు పండించిన మొక్కజొన్నలన్నీ కొనుగోలు చేయాలి.

**కొనుగోళ్లు ప్రారంభిస్తున్నాం: శ్యామ్ కుమార్ జిల్లా మేనేజర్, మార్క్‌ఫెడ్**



జిల్లాలో మొక్కజొన్న పంట కోతలు మొదలయ్యాయి. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 7 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాం. సోమవారం నుంచి కొనుగోళ్లు మొదలు పెడుతున్నాం. త్వరలోనే ప్రభుత్వ అనుమతులు రాగానే మిగతా కేంద్రాలు ప్రారంభిస్తాం. మొక్కజొన్న మద్దతు ధర క్వింటాకు రూ.2,400 ఉంది. రైతులు పంటను ధళారులకు మద్దతు ధర కంటే తక్కువకు అమ్మి నష్ట పోవద్దు. పంటను ఎండలో ఆరబెట్టి తేమ శాతం 14లోపల ఉండేలా చూడాలి.

## హోటళ్లపై టాస్క్‌ఫోర్స్ దాడులు

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** నేలకొండపల్లి మండల కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా గృహావసర సిలిండర్లను వినియోగిస్తున్న హోటళ్లపై టాస్క్ ఫోర్స్ అధికారులు శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 6 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. మండల కేంద్రం లోని రెండు హోటళ్లలో నిర్వహించిన సోదాల్లో నిబంధనల ఉల్లంఘన స్పష్టంగా కనిపించింది. ప్రభుత్వం వాణిజ్య అవసరాల కోసం నిర్దేశించిన సిలిండర్లను కాదని, చట్టవిరుద్ధంగా గృహావసర సిలిండర్లను వాడుతుండటంతో అధికారులు వాటిని సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న సిలిండర్లను తదుపరి చర్యల కోసం స్థానిక పోలీసులకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్ ఫోర్స్ ఎస్ఐ రఘు, సిబ్బంది పాల్గొన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.

## అక్రమ గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

15 మందిపై ఈసీ యాక్ట్ కింద కేసు నమోదు



**ప్రజాపక్షం/కొడకండ్ల:** మండల కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్న గ్యాస్ సిలిండర్లపై అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. శనివారం ఎన్ఫోర్స్‌మెంట్ డీటీ లక్ష్మణ్ నాయక్, ఎస్ఐ సీహెచ్ రాజు ఆధ్వర్యంలో హోటళ్లు, చికెన్ సెంటర్లు, బేకరీలలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వ్యాపార అవసరాల కోసం వినియోగించాల్సిన కమర్షియల్ సిలిండర్ల స్థానంలో, గృహ వినియోగానికి కేటాయించిన సబ్సిడీ సిలిండర్లను అక్రమంగా వాడుతున్నట్లు అధికారులు గుర్తించారు. తనిఖీలలో భాగంగా మొత్తం 20 డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలను ఉల్లంఘించిన 15 మంది వ్యాపార యజమానులపై పోలీస్ స్టేషన్‌లో ఈసీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. అనంతరం వారు మాట్లాడుతూ గృహ సిలిండర్లను వ్యాపారాలకు వినియోగించడం చట్ట విరుద్ధమని, ఇటువంటి అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. సబ్సిడీ సిలిండర్ల దుర్వినియోగం, బ్లాక మార్కెట్ కార్యకలాపాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని, ఇలాంటి తనిఖీలు ఇకముందు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## భద్రకాళి చెరువులో పూడికతీత పనుల్లో వేగం పెంచాలి



**ప్రజాపక్షం/హనుమకొండ :** భద్రకాళి చెరువులో జరుగుతున్న పూడిక తీత పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు.శనివారం ఇరిగేషన్, కుడా శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ భద్రకాళి చెరువులో పూడిక తీత పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో సమీక్షించి, సమర్థవంతంగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చెరువులో మొత్తం ఏడు లక్షల డెబ్బై వేల క్యూబిక్ మీటర్ల పూడిక తీత లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు సుమారు ఒక లక్ష క్యూబిక్ మీటర్ల పూడికను తొలగించినట్లు తెలిపారు. మిగిలిన పనులను మరింత వేగంగా పూర్తి చేసి మే 15వ తేదీలోగా పూడిక తీత పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం శాయంపేటలో జరుగుతున్న భూముల సర్వే పనులను కూడా కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ భూములు అక్రమ ఆక్రమణలకు గురికాకుండా కుడా ఆధీనంలో నున్న భూములకు వెంటనే ప్రహరీ గోడలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో కుడా పీఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్రావు, ఇరిగేషన్ ఈఈ కిరణ్ కుమార్, డీఈ మధుసూదన్, ఏఈ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ రెసిడెన్షియల్ నిర్మాణ పనులను వేగవంతం



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం మైలారం గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్మాణం మ్యాపు ద్వారా సమీక్షించిన కలెక్టర్, వచ్చే సంవత్సరం జూన్ నాటికి పనులు పూర్తి చేయాలని గడువు విధించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పనుల నాణ్యతను కాపాడుతూ నిర్దేశించిన సమయంలోగా నిర్మాణం పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అదే విధంగా, టిజిఈడబ్ల్యూఐడిసి అధికారులు పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి ఆలస్యం లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేసి నిర్మాణం పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాజేందర్, టిజిఈ డబ్ల్యూఐడిసి ఈఈ అరుణ్ కుమార్, డీఈ రామకృష్ణ, ఏఈ జీవన్, కేఎంవి ప్రాజెక్టు సంస్థ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

## '(సర్)' ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి




**ప్రజాపక్షం/జనగామ:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ఎలక్టోరల్ అధికారి సి సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం తెలంగాణలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియపై సుదర్శన్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో దృశ్య మాధ్యమ సమావేశం ద్వారా సమీక్షించారు. ఈ సమావేశానికి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సందీప్ కుమార్ ఝూ హాజరవడం జరిగింది. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఈ ఎస్ఐఆర్ పై అవగాహన కలిగి ఉండాలని, బీఎల్వోలకు ఏ సందేహం ఉన్నా కూడా నివృత్తి చేయాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయం చేస్తూ అవసరమైన ఎస్ఐఆర్ సమాచారం అందించి అందులోని అంశాలను వారికి తెలియజేయాలని సూచించారు. ఈ దృశ్య మాధ్యమ సమావేశంలో స్టేషన్ ఘనపూర్ ఆర్డీవో వెంకన్న, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ రైతులకు అండగా సిఎం

రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు

వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా పెట్టుబడి తగ్గి రైతుకు లాభసాటి

ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/ధర్మసాగర్:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తున్నారని రైతు సంక్షేమానికి రైతు భరోసా, సన్నాలకు బోనస్, ఉచిత విద్యుత్, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వంటి పథకాలను అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. ధర్మసాగర్ మండల కేంద్రంలో పిఏసీఎస్ ద్వారా ఏర్పాటు చేసిన మొక్కజొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రిబ్బన్ కట్ చేసి మక్కల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే వ్యవసాయ శాఖ ద్వారా లబ్ధిదారులకు సబ్సిడీ పై డ్రోన్, బేయిలర్స్ వంటి వ్యవసాయ పనిముట్లను పంపిణి చేశారు. అనంతరం ధర్మసాగర్ మండలానికి సంబంధించిన 13మంది కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లబ్ధిదారులకు 13లక్షల 01వెయ్యి 508రూపాయల విలువ గల చెక్కులను 43మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు 14లక్షల 35వేల రూపాయల విలువల చెక్కులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పంపిణి చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తూ రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించాలని ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రేవంత్ రెడ్డి వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తూ రైతు సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరిగిందని ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే 3లక్షల 50వేల ఎకరాలలో మొక్కజొన్న సాగు చేస్తున్నారని అన్నారు. మన స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో 25వేల ఎకరాలలో మక్కల సాగు చేస్తున్నారని తెలిపారు. మొక్కజొన్నలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర 2400గా ఉన్నప్పటికీ మక్కల వ్యాపారాలు కుమ్మక్కై క్వింటాకు 1600 నుండి 1700 లకే కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. దింతో మక్క రైతులు ఎకరానికి 20వేల వరకు నష్టపోతున్నారని అన్నారు. రాష్ట్రంలో మొక్కజొన్న రైతులు మద్దతు ధర లభించక తీవ్రంగా నష్టపోతున్న విషయాన్నీ అసెంబ్లీలో ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వం మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో మక్కలు కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు వెల్లడించారు. నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో కడియం శ్రీహరి మార్క్ అభివృద్ధి కనిపించాలన్నదే తన తాపత్రయం అని చెప్పారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు చేసుకోవాలని కానీ ఇప్పుడు రాజకీయాలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుందామని సర్పంచులకు సూచించారు. గ్రామాలలో ప్రజల అవసరాలను గుర్తించి అందుకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుదామని పిలుపునిచ్చారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రజలదరి సహకారం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, తహసీల్దార్, ఎంపిడివో, వ్యవసాయ శాఖ అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు, రైతులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## తూకాలు, కొలతలపై ఆకస్మిక తనిఖీలు



**5ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వరంగల్ జిల్లాలో జిల్లా లీగల్ మెట్రోలజీ అధికారి కె మనోహర్ వివిధ ప్రాంతాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్పిజి గ్యాస్ ఏజెన్సీలలో గ్యాస్ సిలిండర్ల తూకాన్ని తిరిగి తూకం వేసి పరిశీలించారు. తనిఖీలలో భాగంగా గ్యాస్ సిలిండర్ల తూకం సరిగానే ఉన్నట్లు గుర్తించారు. అలాగే తూకం యంత్రాలను సరిచూసి, ముద్ర వేయించుకోకుండా వినియోగంలో ఉంచిన రెండు సందర్భాల్లో కేసులు నమోదు చేశారు. ఇదే సందర్భంగా కిరాణా దుకాణాల్లో విక్రయిస్తున్న నూనె ప్యాకెట్ల తూకాలను కూడా పరిశీలించగా అవి సరిగా ఉన్నట్లు గుర్తించారు. అయితే తుకాలు, కొలతలకు సంబంధించిన నిబంధనలు పాటించని వ్యాపారులపై మొత్తం ఐదు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వినియోగదారులు కొనుగోలు చేసే వస్తువుల తూకంలో ఏవైనా తేడాలు గమనించినట్లయితే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని జిల్లా లీగల్ మెట్రోలజీ అధికారి మనోహర్ సూచించారు.

## ఆలయ భూమిలో ఆక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

ప్రజాపక్షం/పాలకుర్తి: మండల కేంద్రంలోని శ్రీసోమేశ్వర లక్ష్మి నరసింహస్వామి ఆలయం గుట్ట సర్వే నెం. 542, 543లో ఆలయ భూమిలో అక్రమ ఇంటి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆలయ ఈవో లక్ష్మి ప్రసన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీ సోమేశ్వర లక్ష్మి నరసింహస్వామి ఆలయ భూమిలో అక్రమ ఇంటి నిర్మాణాలను దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బంది అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయ భూములలో అక్రమ నిర్మాణలు చేపడితే దేవాదాయ చట్టం 30/1987 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన సూపరిండెంట్ వెంకటయ్య, సిబ్బంది రాములు, రమేష్, ఓం ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

## మన ఫ్రెష్ మిల్క్"డెయిరీ ఔట్‌లెట్‌ను ప్రారంభించిన ఎంపి,ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండలోని కనకదుర్గ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన "మన ఫ్రెష్ మిల్క్"డెయిరీ ఔట్‌లెట్‌ను స్థానిక శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డితో కలసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవం సందర్భంగా షాపు యజమానులను, నిర్వాహకులను ఎంపీ డాక్టర్ కడియం కావ్య అభినందించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, స్థానికంగా నాణ్యమైన పాలు, పాలు ఉత్పత్తులు అందుబాటులోకి రావడం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఇలాంటి చిన్న వ్యాపారాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు ఆర్థిక వ్యవస్థకు బలం చేకూరుస్తాయని పేర్కొన్నారు. ప్రజలకు శుద్ధమైన, నాణ్యమైన ఆహార పదార్థాలు అందించడంలో ఇలాంటి డెయిరీ ఔట్‌లెట్ల పాత్ర కీలకమని, వినియోగదారుల నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా సేవలు అందించాలని నిర్వాహకులకు సూచించారు. స్థానిక యువత వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి స్వయం ఉపాధి సాధించేందుకు ఇలాంటి ప్రయత్నాలు ప్రోత్సాహకరమని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కాలనీ వాసులు, వ్యాపారవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సిపిఐకి విరివిగా విరాళాలతో చేయూతనివ్వాలి



సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మేకల రవి

**ప్రజాపక్షం/వరంగల్ :** దోపిడి పిడన లేని వ్యవస్థ కోసం పోరాటాలు చేస్తున్న సిపిఐ పార్టీకి విరివిగా విరాళాలు ఇచ్చి చేయూతనివ్వాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి కొరారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) వరంగల్ మండల సమితి ఆధ్వర్యంలో కూరగాయల మార్కెట్లో సామూహిక నిధి సేకరణ కార్యక్రమాన్ని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం పేద ప్రజల హక్కుల కోసం సమాజంలో దోపిడి, పిడనలేని వ్యవస్థ అయినా సోషలిజం లక్ష్యంగా కమ్యూనిస్టు పార్టీ అనేక పోరాటాలను నిర్మిస్తున్నదని, అనుబంధ సంఘాల ద్వారా వివిధ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను నడుపుతున్నదని, నేడు సమాజంలో పాలకవర్గాల అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాల్లో పాల్గొనాలని ఆకాంక్ష అనేక మందిలో ఉన్నప్పటికిని తమ వృత్తిరీత్యా వ్యక్తిగత పనుల అవసరాల రిత్యా సమయాన్ని కేటాయించలేకపోవచ్చు, కాని కమ్యూనిస్టు పార్టీ చేస్తున్నటు వంటి మహత్తరమైన రాజకీయ పోరాటంలో ఆర్థికంగా సహకరించి ప్రజా ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడం కోసం ప్రజలు సహకరించాలన్నారు. ఏప్రిల్ 1 నుండి 10 వ తారీకు వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని జయప్రదం చేయడం కోసం ప్రజల వద్దకు సిపిఐ పార్టీ కార్యకర్తలు నాయకులు వస్తున్న సందర్భంగా అన్ని రకాలుగా చేయూతను అందించి పటిష్టమైన పార్టీ నిర్మాణం కోసం ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వెలకట్టలేని త్యాగాలతో ఏర్పడిన కమ్యూనిస్టు పార్టీ అనేక నిర్బంధాలను దాటుకుంటూ ప్రజల కేంద్రంగా ఉద్యమాన్ని నిర్వహించిందన్నారు. దేశ స్వాతంత్ర పోరాటం నుంచి మొదలుకొని మహత్తరమైన తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రజా రాశులను ఏకం చేసి పాలకవర్గాల మెడలు వంచిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్, వరంగల్ మండల కార్యదర్శి గుండె బద్రి, జిల్లా సమితి సభ్యులు తాళ్లపల్లి రాహేలా, పరకీరాల రమేష్, మహేష్, యండి యాకుబ్, సంద్ర కుమార్,స్వేత, దాసు, లక్ష్మి రాఖేష్, హరిబాబు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే మొక్కజొన్నకు మద్దతు ధర

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర 2400 లభిస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. శనివారం భూపాలపల్లి నియోజకవర్గంలో భూపాలపల్లి మండలం గొర్లవేడు, గణపురం మండల కేంద్రం లోని కొత్తపల్లి మార్కెట్ యార్డులో మార్క్ఫెడ్ సౌజన్యంతో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునే సమయంలో రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం లోనే 2400 మద్దతు ధర లభిస్తుందని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగానే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. మొక్కజొన్నకు క్వింటాలుకు కనీస మద్దతు ధరగా రూపాయలు 2400 చెల్లిస్తూ రైతులకు చెల్లింపులు తక్షణమే జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఈ ప్రాంత రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టిఏ నెంబర్ సుంకరి రామచంద్రయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు రామినేని రవీందర్, భూపాలపల్లి తహసిల్దార్ శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య రైతులు పాల్గొన్నారు.

## శ్రీరాం సాగర్ నీటిని పాకాల ఏటికి విడుదల చేయాలి: జంపాల డిమాండ్



**ప్రజాపక్షం/గార:** సాగు నీరు లేక గార్ల మండలంలో ఎండిపోతున్న పంటలకు శ్రీరాం సాగర్ నీటిని పాకాల ఏటికి విడుదల చేసి ఈ ప్రాంత రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ గార్ల మండల సమితి ఆద్వర్యంలో ఎండిపోయిన పాకాల ఏటిలో మండుటెండటో నిలబడి శనివారంనాడు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న మాట్లాడుతూ పాకాల ఏటిలో నీరు ఎండిపోయి రాళ్లు తేలండం వలన ఏటి పరివాహకంలో నిండు పొట్ట మీద ఉన్న వరి పంటలు ఎండి పోతుంటే రైతులు తల్లడిల్లి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు తాగు నీరు లేకపోవడంతో రైతులతో పాటు అటు పశువలకు దాహం తీర్చుకోడానికి గుక్కెడు నీరు కూడా లేవని అన్నారు. ప్రతీఏడు ఈ సీజన్ లో రైతులు మండల ప్రజలు నీటి కష్టాలను ఎదురుకుంటుంటే ఈ ప్రాంత ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిదులు ఏమి పట్టనట్టు వ్యవహరించడం దుర్మార్గమని అన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు చొరవచూపి శ్రీరాం సాగర్ నీటిని పాకాల ఏటికి తరలించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాగం లోకేష్, కట్టెబోయిన. పిచ్చయ్య, ఇరుగు. వెంకటేష్, దొడ్డ. రాంబాబు, సాంబయ్య, మల్లెషం తదితరులు పాల్గోన్నారు.

## మారుమూల ప్రాంతాలకు మెరుగైన నెట్‌వర్క్ సేవలు

కలెక్టర్ దివాకర టిఎస్




**ప్రజాపక్షం/ములుగు:** ములుగు జిల్లాలో మారుమూల ప్రాంతాలకు మెరైగన నెట్‌వర్క్ సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లాలో టెలికాం సేవలను మెరుగుపరచడంపై జిల్లా స్థాయి టెలికాం కమిటీ సమావేశాన్ని నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రహదారి విస్తరణ ఇతర పనుల తవ్వకాల సమయంలో సంబంధిత అధికారులు అండర్‌గ్రౌండ్ టెలికాం కేబుల్స్ దెబ్బతినకుండా ఉండేందుకు తప్పనిసరిగా కాల్ బిఫోర్ యు డిగ్ మొబైల్ యాప్‌ను వినియోగించాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు వెంటనే కాల్ బిఫోర్ యు డిగ్ మొబైల్ యాప్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. టి..ఫైబర్, బిఎస్ఎన్ఎల్, ఇతర ప్రయివేట్ టెలికాం సంస్థలు అటవీ ప్రాంతాల్లో కేబుల్స్ వేయడానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అనుమతులను త్వరితగతిన పరిష్కరించాలని, టెలికాం టవర్ల ఏర్పాటులో ఎదురవుతున్న అనుమతుల సమస్యలను టవర్లకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంలో ఉన్న జాప్యాన్ని వెంటనే తొలగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రెవెన్యూ సిహెచ్ మహేందర్ సంపత్‌రావు, వెంకటేష్, డిఆర్‌డిఓ శ్రీనివాస్, వివిధ టెలికాం కంపెనీల ప్రొవైడర్లు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## మంచి నీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా చర్యలు: ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/నర్సంపేట :** నర్సంపేట నియోజకవర్గంలో మంచి నీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సంబధిత అధికారులను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశించారు. నర్సంపేట పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్ లో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మంచినీటి సరఫరాపై జిల్లా అధికారులు డిపిఓ కల్పన, ఈఈ పబ్లిక్ హెల్త్ , ఆర్ డబ్ల్యూస్ ఈఈ సురేందర్ , నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి లతో కలిసి సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. నర్సంపేట మునిసిపల్ కౌన్సిలర్లు, గ్రామ సర్పంచ్‌లతో, అధికారులతో ఉమ్మడిగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నీటి సరఫరాలో అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని, ఏదైనా సమస్య ఏర్పడితే అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి సమన్వయంతో ఆ సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ పెండెం లక్ష్మి రామానంద్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలయి శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈ సురేందర్ , పబ్లిక్ హెల్త్ ఈఈ సుచరణ్, మునిసిపల్ కమిషనర్ భాస్కర్, తహసీల్దార్లు , ఎంపీడీలు, మునిసిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన రేవూరి



**ప్రజాపక్షం/ఆత్మకూరు :** ఆత్మకూర్ మండలం గూడెప్పాడు వ్యవసాయ మార్కెట్ లో మక్కల కొనుగోలు కేంద్రాన్ని శనివారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి తూకం వేయించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలానికి అందుబాటులో ఉన్నటువంటి ప్రతి రైతు తమ మొక్కలను మార్కెట్కు తీసుకువచ్చి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మద్దతు ధరకు అమ్ముకొని లాభ పడాలని, దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ సునంద సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులు, రైతులు పాల్గొన్నారు..

# ఉత్కంఠ పోరులో పంజాబ్ విజయం

పంతొమ్మిదో సీజన్‌లో ఛేజింగ్ జట్టుకు మరో విజయం. తొలిపోరులో గుజరాత్ టైటాన్స్‌కు చెక్ పెట్టిన పంజాబ్ కింగ్స్ ఈసారి చెన్నై సూపర్ కింగ్స్‌ను చిత్తు చేసింది. భారీ స్కోర్ మ్యాచ్‌లో శ్రేయాస్ అయ్యర్(50) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడగా.. ఓపెనర్ ప్రభుసిమ్రన్ సింగ్(43), ప్రియాన్ష్ ఆర్య(39)లు దంచేశారు. ఫలితంగా పంజాబ్ వరసగా రెండో విజయం నమోదు చేయగా.. సొంత మైదానంలో గెలిచి బోణీ కొట్టాలనుకున్న సూపర్ కింగ్స్‌కు నిరాశే మిగిలింది. ఐపిఎల్లో ఐదు సార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ రెండో మ్యాచ్‌లోనూ కంగుతిన్నది. భారీ స్కోర్ కొట్టినా పంజాబ్ కింగ్ టాప్‌ఆర్డర్‌ను కట్టడి చేయడంలో బౌలర్లు విఫలమవ్వడంతో సొంత గడ్డపై చతికిలపడింది సిఎస్‌కె. 210 పరుగుల భారీ ఛేదనలో ఇంప్యాక్ట్ సబ్ ప్రియాన్ష్ ఆర్య(39) ఫోర్లు, సిక్సర్ల తో హోరెత్తించాడు. ఖలీల్ అహ్మద్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్లో 4, 6 బాదిన ఈ లెఫ్ట్ హ్యాండర్.. వరసగా 4, 6, 4తో మ్యాట్ హెన్రీ(254)కి చుక్కలు చూపించాడు. ప్రభసిమ్రన్ సింగ్(43)తో కలిసి సిఎస్‌కె బౌలర్లపై ఎదురుదాడితో ప్రియాన్ష్ పంజాబ్ స్కోర్ బోర్డును ఉరికించాడు. చితక్కొడుతున్న ప్రియాన్ష్ను హెన్రీ బౌల్ చేయడంతో 61 పరుగుల వద్ద తొలి వికెట్ పడింది. ఆ తర్వాత కూపర్ కొన్నొల్లి(36)తో సమన్వయం లోపంతో ప్రభ్సిమ్రన్ రనౌటయ్యాడు. శ్రేయాస్ అయ్యర్(50)తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాలనుకున్న కొన్నొల్లిని అన్షుల్ కంభోజ్ ఫుల్టాస్తో బోల్తా కొట్టించాడు. నేహల్ వధేరా(10) జతగా దూకుడు పెంచిన అయ్యర్ అర్ధ శతకం తర్వాత ఔటయ్యాడు. అప్పటికీ పంజాబ్ విజయానికి 24 రన్స్ కావాలి.హెన్రీ ఓవర్లో వధేరా ఔట్ కాగా.. మార్కస్ స్టోయినిస్(9), శశాంక్ సింగ్(14)లు లాంఛనం పూర్తి చేశారు. మరో 8 బంతులు ఉండగానే 5 వికెట్ల తేడాతో ఆతిథ్య జట్టును పంజాబ్ చిత్తు చేసింది. గత ఎనిమిదో మ్యాచుల్లో ఏడో విజయంతో సిఎస్‌కెపై పంజాబ్ తమ ఆధిపత్యం చాటుకుంది.సొంత మైదానంలో చెన్నై సూపర్ కింగ్స్ కుర్రాళ్లు కుమ్మేశారు. చెపాక్‌లో సుడిగాలి ఇన్నింగ్స్ ఆడిన ఆయుష్ మాత్రే(73) అర్ధ శతకంతో కదం తొక్కగా.. పంజాబ్ కింగ్స్ బౌలర్లకు సర్ఫరాజ్ ఖాన్(32) దడ పుట్టించాడు. మాత్రే మెరుపులతో డీలా పడిన ప్రత్యర్థిని డెత్ ఓవర్లలో శివం దూబే (45 నాటౌట్) మరింత కుంగదీసేలా బౌండరీలతో విరుచుకుపడ్డాడు. ఈ ముగ్గురి విధ్వంసంతో రెండొందలు కొట్టిన చెన్నై.. భారీ స్కోర్‌తో పంజాబ్‌కు సవాల్ విసిరింది.



# సెమీస్‌కు నిఖత్..

## భారత్‌కు మూడు పతకాలు ఖాయం



**ఉలన్‌బాతర్ :** ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు అదరగొడుతున్నారు. టోర్నీ ఐదో రోజు తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్‌తో పాటు ప్రియా, ప్రీతి పవార్ సైతం సెమీస్‌కు చేరి దేశానికి మూడు పతకాలు ఖాయం చేశారు. మహిళల 51 కిలోల క్యాటగిరీ క్వార్టర్ బౌట్‌లో ఆదినుంచే పూర్తి నియంత్రణతో ఆడిన నిఖత్.. రిఫరీ స్టాప్ కాంటెస్ట్ (ఆర్‌ఎఫ్‌సీ)తో ఫిలిప్పీన్స్‌కు చెందిన జియాన్ బగుహిన్‌ను ఓడించి సెమీస్ చేరింది.తెలంగాణ పర్యాటకం సెమీస్‌లో ఈ తెలంగాణ అమ్మాయి.. 2024 ఒలింపిక్స్ గోల్ మెడలిస్ట్ అయిన వు యు (చైనా)తో అమీతుమీ తేల్చుకోనుంది. మహిళల 60 కిలోల విభాగంలో ప్రియ.. 41తో చెంగ్యు యాంగ్ (చైనా)ను చిత్తుచేసింది. ఫైనల్ బెర్తు కోసం ఆమె సెమీస్‌లో నమున్ మొంఖోర్ (మంగోలియా)తో తలపడుతుంది. 54 కేజీల క్యాటగిరీలో వరల్ బాక్సింగ్ కప్ స్వర్ణ విజేత ప్రీతి.. 50తో మంగున్ సెత్సెగ్ (మంగోలియా)ను మట్టికరిపించి సెమీస్‌కు అర్హత సాధించింది.

# శ్రేయాస్ అయ్యర్‌కు రెండోసారి ఫైన్

**చెన్నై:** ఐపిఎల్‌లో భాగంగా శుక్రవారం చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ జట్టు అయిదు వికెట్ల తేడాతో విజయాన్ని నమోదు చేసింది. ఆ మ్యాచ్‌లో పంజాబ్ కెప్టెన్ అద్భుతమైన హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. అయితే ఈ మ్యాచ్‌లో పంజాబ్ జట్టు స్లో ఓవర్ రేట్‌కు పాల్పడింది. దీంతో పంజాబ్ కెప్టెన్ అయ్యర్‌కు జరిమానా విధించారు. 24 లక్షల ఫైన్ విధిస్తున్నట్లు ఐపిఎల్ పేర్కొన్నది. ఈ సీజన్‌లో రెండోసారి పంజాబ్ జట్టు ఐపిఎల్ ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు పాల్పడింది. ఐపిఎల్‌లోని ఆర్టికల్ 2.22 ప్రకారం పంజాబ్ కింగ్స్ తప్పిదం చేసినట్లు ఐపిఎల్ పేర్కొన్నది. తన తొలి మ్యాచ్‌లో కూడా పంజాబ్ జట్టుకు స్లో ఓవర్ రేట్ కింద ఫైన్ పడింది. ఫస్ట్ మ్యాచ్‌లో శ్రేయాస్ అయ్యర్‌కు 12 లక్షల జరిమానా విధించారు. ఇప్పుడు ఆ ఫైన్‌ను రెట్టింపు చేసి 24 లక్షల జరిమానా వేశారు. ఐపిఎల్ మీడియా అడ్వైజరీ ఓ ప్రకటనలో ఈ విషయాన్ని చెప్పింది. రెండో సారి తప్పు చేయడం వల్ల పంజాబ్ జట్టు మొత్తానికి ఫైన్ వేశారు. ఇంపాక్ట్ ప్లేయర్‌తో పాటు ఆటగాళ్లు అందరిపై ఆరు లక్షలు లేదా మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించనున్నారు.




## ఈ వారం స్టాక్ మార్కెట్లు

బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్‌ఇ/ క్లోజింగ్): సెన్సెక్స్ 73,319.55 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 74,532.96 పాయింట్లు. నష్టం1213.41 పాయింట్లు).

జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఇ/ క్లోజింగ్): నిఫ్టీ 22,713.10 పాయింట్లు (ఈ వారం ప్రారంభంలో 23,114.50 పాయింట్లు. నష్టం 404.40 పాయింట్లు).

## బులియన్ మార్కెట్

10 గ్రాముల ధర. రూపాయలలో

24 క్యారెట్లు : 1,49,506.53
22 క్యారెట్లు : 1,37,047,65
18 క్యారెట్లు : 1,12,129.89

# పెట్టుబడులు ఒకవైపు.. వైఫల్యాలు మరోవైపు..

భారత స్టార్టప్ రంగాన్ని అద్భుతమనిగానీ, పూర్తి వైఫల్యమనిగానీ చెప్పడానికి వీల్లేదు. ఒకవైపు భారీ పెట్టుబడులు.. కొత్త అవకాశాలు, మరోవైపు సమస్యలు.. వైఫల్యాలు. 'ఉడాన్' వంటి ఈకామర్స్ సంస్థ 340 మిలియన్ డాలర్ల మేర నిధులను సమీకరించడం, ఐపిఒకి ముందుగా తన ఆర్థిక స్థితిని బలపరచే ప్రయత్నమే. సాధారణంగా ఐపిఒకు ముందు కంపెనీలు లాభదాయకతకు దగ్గరగా ఉండాలి లేదా కనీసం స్థిరమైన ఆదాయ ప్రవాహాన్ని నిరూపించాలి. అయితే, ఇది నిజమైన వృద్ధి సంకేతమా, లేక మార్కెట్‌లో విశ్వాసాన్ని నిలుపుకోవడానికి అవసరమైన ఫండింగ్ మాత్రమేనా? అనే ప్రశ్న తలెత్తుతుంది. ఎందుకంటే గతంలో అనేక స్టార్టప్స్ ఐపిఒ ముందు అధిక మూలధనంపై ఆధారపడి తర్వాత కష్టాల్లో పడిన ఉదాహరణలు ఉన్నాయి. ఇక 'మైనస్‌క్యూల్' వంటి కృత్రిమ మేధస్సు (ఎఐ) స్టార్టప్ 41 మిలియన్ డాలర్లు సమీకరించడం, ప్రస్తుతం ఎఐ రంగంపై పెట్టుబడిదారుల అధిక ఆసక్తిని సూచిస్తోంది. కానీ ఇక్కడ కూడా మరో కోణాన్ని నిపుణులు ప్రస్తావిస్తున్నారు. ఎఐ స్టార్టప్స్‌లో చాలా వరకు ఇంకా స్పష్టమైన వ్యాపార నమూనా లేకుండా కేవలం భవిష్యత్తు సామర్థ్యం మీదే నడుస్తున్నాయి. దీని వల్ల ఒక తాత్కాలిక అభివృద్ధి కనిపించే అవకాశం ఉందా అన్నది పరిశీలించాల్సిన అంశం. ఇదే సమయంలో, 'జెస్ట్‌మనీ' కార్యకలాపాలను మూసివేయడానికి సిద్ధమవుతోంది. ఇది ఒక ముఖ్యమైన హెచ్చరిక సంకేతం. ఫిన్‌టెక్ రంగంలో భారీ వృద్ధి జరిగినప్పటికీ, నియంత్రణలు, నిధుల కొరత, లాభదాయకత సమస్యలు అనేక సంస్థలను ఒత్తిడిలోకి నెడుతున్నాయి. ఇది 'ఎట్టి పరిస్థితుల్లో అభివృద్ధి' మోడల్ ఇక స్థిరంగా లేదని సూచిస్తుంది. ఒకవైపు ఫండింగ్ పెరుగుతుండగా, మరోవైపు కంపెనీలు మూతపడుతున్నాయి. కానీ దీన్ని మరింత సూత్రప్రాయంగా చూస్తే, ఇది మార్కెట్ శుద్ధి ప్రక్రియగా కూడా భావించవచ్చు. బలమైన వ్యాపార నమూనాలు ఉన్న కంపెనీలు నిలబడతాయి. మిగతావి బయటకు వెళ్తాయి. మొత్తానికి, భారత స్టార్టప్ ఎకోసిస్టమ్ ఇప్పుడు ఒక ట్రాన్సిషన్ దశలో ఉంది. అతి వేగంగా వృద్ధి నుంచి, స్థిరమైన, లాభదాయకమైన వ్యాపారాల వైపు మార్పు జరుగుతోంది. ఈ మార్పును అర్థం చేసుకోవడానికి ఒక్కో వార్తను కాకుండా, మొత్తం నిర్మాణాత్మక మార్పులను పరిశీలించడం అవసరం.







# మధ్యప్రాచ్య ఘర్షణలతో ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం

మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ఘర్షణలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతున్నాయి. ముఖ్యంగా ఇంధన సరఫరా మార్గాలు, సముద్ర రవాణా వ్యవస్థ ఈ సంక్షోభానికి కేంద్రబిందువుగా మారాయి. ఈ ప్రాంతంలో ఉన్న హోర్ముజ్ జల సంధి ప్రపంచంలోనే అత్యంత కీలకమైన చమురు రవాణా మార్గాల్లో ఒకటి. ఇక్కడ ఉద్రిక్తతలు పెరగడం వల్ల నౌకలు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాల్సి వస్తోంది. ఈ మార్గమార్పులు కేవలం భౌగోళిక అంశం కాదు. ఇవి ఖర్చులను గణనీయంగా పెంచుతున్నాయి. ఒక నౌక సురక్షిత మార్గం కోసం ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తే, ఇంధన వినియోగం, బీమా ఖర్చులు, సమయం పెరుగుతాయి. ఈ పెరిగిన వ్యయాలు చివరకు వినియోగదారులపై పడతాయి. ప్లాస్టిక్, గాజు వంటి ఉత్పత్తులు చమురు, సహజ వాయువు ఆధారంగా తయారవుతాయి కాబట్టి, ఇంధన ధరల పెరుగుదల వాటి ఉత్పత్తి వ్యయాన్ని నేరుగా ప్రభావితం చేస్తుంది. రవాణా మార్గాల్లో నిరంతర అంతరాయం కొనసాగితే, సరఫరా గొలుసులు శాశ్వతంగా మారే అవకాశం ఉంది. కంపెనీలు భవిష్యత్తులో ప్రమాదాలను తగ్గించడానికి కొత్త మార్గాలు, కొత్త సరఫరాదారులను వెతకవచ్చు. దీని వల్ల గ్లోబల్ ట్రేడ్ నమూనాలు మారిపోవచ్చు. ఇంకా ఒక కోణం ఏమిటంటే, ఇంధన సంక్షోభం కేవలం ధరల పెరుగుదలతో ఆగిపోదు. ఇది పారిశ్రామిక ఉత్పత్తి మందగింపుకు, ద్రవ్యోల్బణం పెరుగుదలకు దారితీస్తుంది. ముఖ్యంగా దిగుమతులపై ఆధారపడే దేశాలుభారతదేశం వంటి దేశాలుఈ ప్రభావాన్ని ఎక్కువగా అనుభవిస్తాయి. మొత్తానికి, మధ్యప్రాచ్య ఘర్షణలు ఒక ప్రాంతీయ సమస్యగా కనిపించినా, వాటి ప్రభావం ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తుంది. ఇది తాత్కాలిక అంతరాయం మాత్రమే కాకుండా, దీర్ఘకాలిక ఆర్థిక మార్పులకు దారితీసే వ్యవస్థాత్మక సంక్షోభంగా కూడా మారే ప్రమాదం ఉంది.

# ఆదర్శ వివాహం చేసుకోవడం అభినందనీయం

సమాజ హితం కోసం పనిచేయాలని నూతన దంపతులకు మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి సూచన




**ప్రజాపక్షం/కరీంనగర్ :** జీవితంలో ఒకరినొకరు అర్థం చేసుకొని కలిసి జీవించడానికి నిర్ణయించుకొని ఆదర్శ వివాహం చేసుకోవడం అభినందించదగ్గ విషయమని, ఆదర్శ వివాహం చేసుకున్న నూతన దంపతులు సమాజ హితం కోసం పనిచేయాలని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి నూతన దంపతులకు సూచించారు. కరీంనగర్ నగరంలోని పద్మనగర్ ఇందిరా గార్డెన్‌లో శనివారం సిపిఐ కరీంనగర్ జిల్లా సహకారంతో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఎఐఎస్‌ఎఫ్ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర గర్ల్స్ వింగ్ కో–కన్వీనర్ కండె విజేత,పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతమ్ ఆదర్శ వివాహం శ్రీనివాస్ రెడ్డి, చాడ వెంకటరెడ్డిల సమక్షంలో జరిగింది. అమ్మాయి విజేత చేత వివాహ ప్రమాణ పత్రం శ్రీనివాస్ రెడ్డి చదివించగా, అబ్బాయి ప్రీతమ్ చేత చాడ వెంకట్‌రెడ్డి చదివించారు. అనంతరం అమ్మాయి, అబ్బాయి వివాహ పత్రాలపై సంతకాలు చేసి దండలు మార్చుకొని నూతన దంపతులుగా ఒక్కటయ్యారు. ఈ కార్యక్రమానికి ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన శ్రీనివాస్ రెడ్డి, వెంకటరెడ్డి మాట్లాడుతూ మానవ సమాజంలో మగవారికి ఆడవారి తోడు, ఆడవారికి మగవారి తోడు ఎంతో అవసరమని, కష్ట,సుఖాల్లో పాలుపంచుకోవడానికి ఒకరికి ఒకరు అండగా ఉండడం కోసం వివాహ బంధంతో ఒకటికావడం అనాదిగా వస్తున్న సంప్రదాయమని, ప్రపంచంలో వివిధ మతాలు, సాంప్రదాయాల కనుగుణంగా వివాహాలు జరగడం పరిపాటి కానీ వివాహానికి ముందే అన్ని విధాలుగా ఒకరినొకరు పూర్తిస్థాయిలో అర్థం చేసుకొని జీవితంలో ముందుకు సాగడానికి నిర్ణయించుకున్న తర్వాతనే నేటి సమాజంలో వివాహాలు చేసుకుంటున్నారని ఇది శుభ పరిణామమని, విద్యార్థి సంఘ నేతలుగా ఉన్న నాడే సురవరం సుధాకర్ రెడ్డి విజయలక్ష్మి లాంటి వారితో పాటు అనేకమంది అభ్యుదయ వాదులు ఆదర్శ వివాహాలు చేసుకున్నారని గుర్తు చేశారు. విజేత, ప్రీతమ్‌లు ఎఐఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘంలో పూర్తిస్థాయిలో పనిచేస్తూ విద్యారంగ సమస్యల పరిష్కారంతోపాటు, సమాజంలో జరిగే పరిణామాలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ సమాజ హితం కోసం పనిచేస్తూ నే, వైవాహిక జీవితంలో ఒడిదుడుకులను ఎదుర్కొని, ఒకరినొకరు అర్థం చేసుకుని కష్టసుఖాల్లో తోడుగా ఉండి అందరికీ ఆదర్శప్రాయంగా నిలవాలని ఆకాంక్షిస్తూ నూతన జంటకు ఆశీస్సులు, శుభాకాంక్షలు తెలిపారు. ఆదర్శ వివాహ కార్యక్రమంలో సిపిఐ కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల కార్యదర్శులు పంజాల శ్రీనివాస్, తాండ్ర సదానందం, మంద సుదర్శన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, గోషిక మోహన్, గౌతం గోవర్ధన్, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్, సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు కొయ్యడ సృజన్ కుమార్, రామగుండం మున్సిపల్ కార్పొరేటర్ మార్కాపురి సూర్య, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామారపు వెంకటేష్, మచ్చ రమేష్ తో పాటు సిపిఐ మరియు ఏఐఎస్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# ఆర్టిజన్‌ల సమస్యల పరిష్కారానికి కృషి

## ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హామీ

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** విద్యుత్ సంస్థలో గత 22 సంవత్సరాలుగా సేవలందిస్తున్న ఆర్టిజన్‌లకు తగిన గుర్తింపు ఇవ్వడంతో పాటు,వారి అర్హతలను బట్టి కన్వర్షన్ కల్పించాలని వారు చేస్తున్న న్యాయమైన పోరాటాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధిస్తానని సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నల్లగొండలోని సిపిఐ కార్యాలయంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్టిజన్‌ల సమస్యలను వివరిస్తూ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్సీ సత్యం సానుకూలంగా స్పందిస్తూ, ఆర్టిజన్‌ల న్యాయమైన డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో టివిఎఐ జెఎసి చైర్మన్ జిట్టబోయిన లింగస్వామి,కన్వీనర్ మద్ది శీను, జిల్లా నాయకులు గుండ లింగారెడ్డి,పెరికె శేఖర్, అద్దంకి వెంకన్న,ఉమాదేవి, లతీఫ్, రమేష్, మల్లేష్, కృష్ణ, ప్రసన్న,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పోరాటాల పార్టీ సిపిఐని ఆదరించండి


భువనగిరి పట్టణంలో...


వరంగల్‌లో.....


దేవరకొండలో.....

**ప్రజాపక్షం/భువనగిరి :** నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహిస్తున్న సిపిఐని ఆదరించి చేయూతనివ్వాలని, భవిష్యత్తులో ప్రజా పోరాటాలను మరింత బలోపేతం చేయడానికి సిపిఐకి అన్ని వర్గాల ప్రజలు ఆర్థిక సహకారం అందించి ప్రజా ఉద్యమాల నిర్మాణానికి తోడ్పాటు ఇవ్వాలని యాదాద్రి జిల్లా సిపిఐ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం భువనగిరి పట్టణంలో ఇంటింటా సిపిఐ కార్యక్రమాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికే రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటా సిపిఐ కార్యక్రమాన్ని సిపిఐ తెలంగాణ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ప్రారంభించామని తెలిపారు. ప్రధానంగా ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడానికి చేపడుతున్నామన్నారు. ఈ ప్రచారంలో పార్టీ నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సాధక బాధకాలను స్వయంగా అడిగి తెలుసుకుంటారని ముఖ్యంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ముఖ్యంగా 6 గ్యారెంటీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడంలో ఆలస్యం జరుగుచున్నదని తెలిపారు. దీంతో ప్రజలు హామీల అమలుపై ఆగ్రహంతో ఉన్నారన్నారు. స్థానిక సమస్యలపై త్వరలో పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించ బోతున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి ఇమ్రాన్, పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి గనబోయిన వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, నాయకులు బద్దం వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వరంగల్‌లో....

సిపిఐ చేపట్టిన పోరాటాలు, సాధించిన విజయాలు, అలాగే రాబోయే రోజుల్లో ప్రజల కోసం చేయాల్సిన కార్యక్రమాలను వివరించేందుకు సిపిఐ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని నేడు వరంగల్ లోని ఎల్బీ నగర్ ప్రాంతంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాషుమియా మాట్లాడుతూ సిపిఐ పార్టీ పోరాటాల ఫలితంగానే వరంగల్‌లో పేద ప్రజలు గుడిసెలు వేసుకుని నివాసం ఏర్పరచుకుని జీవించగలిగారని, ఆ ప్రాంతం నేడు మంచి పేరు, ప్రఖ్యాతలు సంపాదించుకోవడానికి సిపిఐ పార్టీ ప్రధాన కారణమని తెలిపారు. ప్రస్తుతం వరంగల్ లో నివాసం ఏర్పరచుకున్న కొత్తతరానికి జగద్గిరిగుట్ట వంటి ప్రాంతాల చరిత్ర తెలియదని, ఆ చరిత్రను ప్రజలకు తెలియజేయడం కూడా ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. అలాగే ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లాహ్ ఖాద్రి, గుండే భద్రి, సిపిఐ వరంగల్ మండల కార్యదర్శి మస్కా సుధీర్, శరత్ , విక్టోరియా శలీజా తదితరులు పాల్గొన్నారు.

### దేవరకొండ మండల కేంద్రంలో...

పోరాటాల సిపిఐకి విరివిరిగా విరాళాలిచ్చి ఆదరించండి, అభినందించడని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. శనివారం దేవరకొండ మండల కేంద్రంలో ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో భాగంగా విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ భ్యులు పల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ భారత దేశంలో 1925 లో ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకొని దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని పరాయి పాలన పోయి మన దేశాన్ని మనమే పరిపాలించుకోవాలని దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత స్వాతంత్ర్య ఫలాలు ప్రజలందరికి చేరాలని ఎన్నో పోరాటాలు చేసి ఎందరో అమరులయ్యారని అటువంటి సిపిఐని భవిష్యత్తులో కూడా ఈ దేశంలో గాని ప్రపంచంలో శాంతిని గాని ప్రజల హక్కుల కోసం పోరాడే పార్టీ కమ్యూనిస్టు పార్టీని ఆదరించి అభిమానించాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి, మండల కార్యవర్గ సభ్యులు పల్లా రంగా రెడ్డి, గోవర్ధన్ పాల్గొన్నారు.

### మక్తల్ పట్టణంలో...

ప్రజా సమస్యలు పరిష్కరించాలని నిరుపేదలైనటువంటి వారందరికీ ఇళ్ల స్థలాలు ఇండ్లు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని సిపిఐ నారాయణపేట జిల్లా కార్యదర్శి టీ. నరసింహులు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా శనివారం మక్తల్ పట్టణంలోని ఎల్లమ్మ కుంట వీధిలో ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ ప్రాంతంలో ఉన్న వారందరికీ చాలా మందికి ఇళ్ల స్థలాలు లేవని ఇళ్ల స్థలాలు ఉన్న ఇల్లు రాలేదని పెన్షన్స్ రాలేదని వారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలందరి గుర్తించి వారందరికీ ఇళ్ల స్థలాలు పెన్షన్స్ ఇవ్వాలన్నారు. నేడు దేశంలో నెలకొన్న పరిస్థితులలో కమ్యూనిస్టులు చేస్తున్న పోరాటాలను ప్రజలు ఆహ్వానిస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో ఇంటింటికి సిపిఐలో భాగంగా పార్టీ కార్యకర్తలు మీ సహాయం కోరుతూ మీ వద్దకు వస్తుందన్నారు. శ్రేయోభిలాషులు వ్యాపారులు అందరూ తమ వంతుగా ప్రజా పోరాటాలకు పార్టీకి చేయూతనిచ్చి విరాళాలు ఇవ్వగలరని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు సరోజమ్మ, నారాయణమ్మ, కొండయ్య, పద్మ, మాదేవమ్మ, సుజాత ,నర్సింగమ్మ, సుశీలమ్మ తదితరులు పాల్గొనడం జరిగింది.



మక్తల్ పట్టణంలో.....

# నిరుపేదల సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యం

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు



ప్రజాపక్షం/రామాయంపేట: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుపేదల సొంతింటి కల నెరవేరుస్తుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 16 గ్రామాలకు చెందిన 83 మందికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఉత్తర్వు పత్రాలను లబ్దిదారులకు అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు ఆపన్న హస్తం అందిస్తుందన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంతరెడ్డిదే అన్నారు. గత బిఆర్ఎస్ పాలనలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఎక్కడ కూడా ఇవ్వలేదని ఆరోపించారు. బిఆర్ఎస్ నాయకులు దోచుకొని దాచుకున్నారని దోచుకున్న డబ్బులతోనే సొంత విమానాలు, భూములు కొనుకున్నారని మండిపడ్డారు. బిఆర్ఎస్ నాయకులు ప్రజలను దోచుకొని సమారు ఒక్కొక్కరిపై రెండున్నర లక్షల అప్పు పెట్టారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఒక్కరికి గూడు కల్పించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతుందని వివరించారు. ఈకార్యక్రమంలో ఎంపీడివో షాజిలోద్దిన్, మున్సిపల్ కౌన్సిలర్ గజవాడ నాగరాజు, మండల పార్టీ అధ్యక్షులు బండారి మహేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు చింతల స్వామి, డీసీసీ ఉపాధ్యక్షులు దేమె యాదగిరి, సర్పంచులు బక్కయ్యగారి యాదగిరి, మానెగల్ల రామకిష్టయ్య, కొత్త స్రవంతి రాజేందర్‌గుప్తా, తార్యా నాయక్, చౌహాన్‌రాణి రాజు, బన్సీరాథోడ్, మస్కూరి బాల్‌రాజు, వెంకట్ రెడ్డి, ఉమాసంజీవరెడ్డి, పెండెల మమత రవీందర్, సునీల్, డానియల్, ఉప సర్పంచులు నింగరమైన లలిత రమేష్, బాలునాయక్, శ్యాంరాజ్, ఎంఎన్ ప్రసాద్, యాదగిరి, పిట్ల నరేష్, నాయకులు పడాల శివప్రసాద్, రంగ రాజాకిషన్, కుమార్ సాగర్‌తో పాటు ఉన్నారు.

## ఓపెన్ స్కూల్ పరీక్షల్లో పకడ్బందీ ఏర్పాట్లు



ప్రజాపక్షం/నిజామాబాద్ : ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డీఈఓ అశోక్ అన్నారు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఏప్రిల్/మే 2026 లో జరగబోయే ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేయగా డీఆర్డీవో పీడీ సాయగౌడ్, డీఈఓ అశోక్, వివిధ జిల్లా అధికారులు పాల్గొని మాట్లాడారు. ఏప్రిల్ 20 నుంచి నిర్వహించబడే ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా చూడాలని ఆదేశించారు. పరీక్షలకనుగుణంగా తగు ఏర్పాటు చేయాల్సిందిగా అందరం అధికారులకు సూచించడమైనదన్నారు. కార్యక్రమంలో పీడీ డీఆర్‌డీఏ మాట్లాడుతూ జిల్లాలో నిర్వహించబడే ఓపెన్ పరీక్షలు పకడ్బంధీగా నిర్వహించాలన్నారు. అన్ని డిపార్ట్‌మెంట్లు అవసరమైన మేరకు కోఆర్డినేషన్ అందించి పరీక్షలను సజావుగా జరిగేలా సహకరించాలని ఆదేశించారు. సమావేశానికి డీయంఅండ్‌హెచ్‌ఓ, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్లు హాజరయ్యారు.

## రేషన్ బియ్యం పంపిణీలో వదంతులు నమ్మొదు

జిల్లా సివిల్ సప్లై అధికారి నిత్యానంద్





ప్రజాపక్షం/మెదక్ : ప్రభుత్వం అందిస్తున్న మూడు నెలల రేషన్ బియ్యం ఈ నెల 30 వరకు పంపిణి చేయడం జరుగుతుందని జిల్లా సివిల్ సప్లై అధికారి నిత్యానంద్ తెలిపారు. జిల్లాలో మొత్తం 520 రేషన్ దుకాణాలు సమర్ధవంతంగా పనిచేస్తున్నాయన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన లబ్దిదారులకు అవసరమైన (03) నెలల సన్న బియ్యం నిల్వలు రేషన్ సమృద్ధిగా ఉంచబడి, నిరంతరంగా సరఫరా చేయబడుతున్నాయని వివరించారు. శనివారం జిల్లా కేంద్రంలోని 03, 15 నెంబర్ల రేషన్ షాపులను జిల్లా సివిల్ సప్లై అధికారి నిత్యానంద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బియ్యం సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సంబంధిత అధికారులు సిబ్బంది అందరూ అప్రమత్తం గా పనిచేస్తూ, పారదర్శకంగా సకాలంలో సన్న బియ్యం సరఫరా జరిగేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. గందరగోళానికి లోనుకాకుండా, ప్రశాంతంగా తమకు లభ్యమయ్యే (03) నెలల రేషన్ సరుకులను ఈ నెల 30వ తేది వరకు పొందాలని విజ్ఞప్తి చేశారు. ఏవైనా సమస్యలు ఉంటే సమీప తహశీల్దార్ కార్యలయం లేదా సంబంధిత జిల్లా సివిల్ సప్లై అధికారులను సంప్రదించవచ్చని సూచించారు.

## బేకరీలపై మున్సిపల్ అధికారుల దాడులు

కాలం చెల్లిన సామాగ్రి, రెండు బేకరీలకు జరిమాన



ప్రజాపక్షం/రామాయంపేట: రామాయంపేట పట్టణంలోని బేకరిలు హోటళ్లపై మున్సిపల్ అధికారులు దాడులు చేశారు. నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని వచ్చిన పిర్యాదుల మేరకు మున్సిపల్ మేనేజర్ రఘువరన్ నేతృత్వంలో సిబ్బంది శనివారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో సింగపూర్, గోల్డెన్ బేకరిల్లో కాలం చెల్లిన సామాగ్రి వాడుతున్నందుకు 5వేల చొప్పున జరిమాన విదించారు. డైమండ్ హోటల్ యజమానికి వెయ్యి రూపాయల జరిమాన విదించారు. ఈసందర్బంగా మేనేజర్ మాట్లాడుతూ పరిశుభ్రతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని అలా చేయడంలో విఫలమైతే జరిమానా విదించడంతో పాటు చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని తెలిపారు. గడువు ముగిసిన వస్తువులను ఉపయోగిస్తున్నట్లు తేలితే ఏ సంస్థపైనైనా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది శ్రీదర్‌రెడ్డి, బాలక్రిష్ణ, నవాత్ ప్రసాద్, చల్మెల ప్రసాద్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు

ఎస్‌పి నితికా పంత్




ప్రజాపక్షం / తిర్యాని : తిర్యాని పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ నితికా పంత్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణం, రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, హాజరు రిజిస్టర్‌ను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదిదారులతో మర్యాదగా వ్యవహరించి వారి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, బాలికల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని ఎస్‌హెచ్‌ఓ వెంకటేష్‌ను ఆదేశించారు.భద్రతకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## డాక్టర్ రవీందర్‌కు అరుదైన గౌరవం

ప్రజాపక్షం/నిజామాబాద్ : తెలంగాణ విశ్వవిద్యాలయం సారంగాపూర్ బీఈడీ కళాశాలలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ సిగ రవీందర్ గ్లోబల్ స్పాట్‌లైట్ ఇండియా మేగజైన్‌లో 'భారతదేశ అత్యంత స్ఫూర్తిదాయక వ్యక్తిత్వం 2026'గా గుర్తింపు లభించింది. రాష్ట్రానికి చెందిన ప్రముఖ విద్యావేత్త, ఉపాధ్యాయ శిక్షకులు, మనోవిజ్ఞాన శాస్త్రవేత్త అయిన గత రెండు దశాబ్దాలకు పైగా ఉపాధ్యాయ విద్యారంగంలో కృషి చేస్తున్నారు. మీరు కేవలం బోధనకే పరిమితం కాకుండా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు, విద్యార్థి కేంద్రీకృత కార్యక్రమాలతో కాబోయే ఉపాధ్యాయులను నిరంతరం ప్రోత్సహిస్తున్నారు. విద్యారంగంలో వారు చేస్తున్న ఈ విశేష కృషికి గాను ఈ అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ సీనియర్ ప్రొఫెసర్, మాజీ డీన్ టి.మృణాలిని, టియు వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి, ప్రిన్సిపాల్ సాయిలు, టియు మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బలరాములనాయక్, బీఓఎస్ ప్రొఫెసర్ శంకర్, సహచర అధ్యాపకులు కరుణాకర్, శ్రీనివాస్, సువర్చల, శ్రీకాంత్, హరిత, గణేష్, నరేందర్, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

## సిఎం పర్యటన ఏర్పాట్లపై.. కలెక్టర్ రాజర్షిషా సమీక్ష

ప్రజాపక్షం/ ఆదిలాబాద్ అర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 6న జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో, ఏర్పాట్లను అత్యంత పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని సూచించారు. ప్రారంభోత్సవాలు, శిలాఫలకాల ఆవిష్కరణల వద్ద నిబంధనలు పాటించాలని, కేటాయించిన విభాగాల వద్దే ప్రజాప్రతినిధులు, అధికారులు ఉండాలని స్పష్టం చేశారు. మహిళా సంఘాలకు చెక్కుల పంపిణీ, సర్టిఫికెట్ల అందజేత వంటి కార్యక్రమాలను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సభా వేదిక వద్ద తాగునీరు, సీటింగ్, పార్కింగ్ వసతుల్లో ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. హెలిప్యాడ్, వీఐపీ గ్యాలరీల వద్ద కఠిన భద్రతా ప్రమాణాలు పాటించాలని, అనుమతి ఉన్నవారు మాత్రమే అక్కడ ఉండేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీస్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీఓ స్రవంతి, డీఆర్డీ రవీందర్, వివిధ శాఖల ఈఈలు, తహశీల్దార్లు పాల్గొన్నారు.



## అర్హులైన కుటుంబానికి.. సిఎంఆర్‌ఎఫ్ అందేలా కృషి

ఎమ్మెల్యే పాయల్ శంకర్

ప్రజాపక్షం/ ఆదిలాబాద్ అర్బన్: అర్హులైన ప్రతి కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి అందేలా తన వంతు కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వివిధ అనారోగ్య కారణాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందిన 67 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఆదిలాబాద్ ప్రజలు వైద్యం కోసం పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రలోని యవత్మాల్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానిక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోనే మెరుగైన సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రిమ్స్ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. అసెంబ్లీ వేదికగా హెల్త్ కార్డులు, ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లుల చెల్లింపుల అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయన వివరించారు. మయూర్ చంద్ర, ఆకుల రేణుక, గంట జీవన్, రాకేష్, మనోజ్, సతీష్ యాదవ్, రాము, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## డిహెచ్‌పిఎస్ రాష్ట్ర మహాసభల పోస్టర్ల విడుదల

ప్రజాపక్షం / మంచిర్యాల : వరంగల్ నగరంలో ఏప్రిల్ 17, 18 తేదీలలో నిర్వహించనున్న దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర రెండో మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు మామిడి గోపి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దళితబంధు స్థానంలో అంబేద్కర్ అభయ హస్తం పేరుతో 12 లక్షల రూపాయలు ఇస్తామని చెప్పి దళితులను దగా చేసిందని విమర్శించారు. జిల్లా కార్యదర్శి దేవి పోచన్న మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. దేశంలో దళితులపై దాడులు పెరిగాయని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ద్వారా సామాజిక న్యాయాన్ని తుంగలో తొక్కుతున్నారని ధ్వజమెత్తారు. తక్షణమే కుల గణన చేపట్టి జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయించాలని, ప్రైవేట్ రంగంలోనూ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వరంగల్ మహాసభల్లో దళితుల అభివృద్ధి, దాడులు, అసమానతలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బడికల మదనయ్య, జిల్లా సమితి సభ్యులు పొనగంటి యోసేపు, గజ్జల తిరుపతి, మధు పాల్గొన్నారు.

## దీక్షను విరమింపజేసిన డిసిసి అధ్యక్షుడు రామకృష్ణ

కాంగ్రెస్ పార్టీలో అన్ని వర్గాల వారికి సమన్యాయం




ప్రజాపక్షం/నిజామాబాద్ : కాంగ్రెస్ పార్టీలో మాజీ మేయర్ ధర్మపురి సంజయ్‌కు అన్యాయం జరుగుతుందని భావించినతన అనుచరులు చేస్తున్న దీక్షా శిబిరాన్ని నగర కార్పొరేషన్ డీసీసీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ సందర్శించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో అన్ని వర్గాల వారికి సమాన న్యాయం జరుగుతుందని, నాయకులు పార్టీ కోసం చేసిన కృషిని చూసి సమాన న్యాయం చేస్తారన్నారు. హైకమాండ్ సమయాన్ని బట్టి పదవులు కేటాయిస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీలో మున్నూరుకాపులకు అన్యాయం జరుగుతుందని సంజయ్ అనుచరులు అనుకోవటం సరైంది కాదన్నారు. నగర కార్పొరేషన్ డీసీసీ అధ్యక్షులుగా మున్నూరుకాపు బిడ్డనైన తనకు అవకాశం ఇవ్వటం జరిగిందని, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో ప్రధాన కార్యదర్శిగా రాంభూపాల్‌కు ఇటీవల జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో 10 కార్పోరేటర్ స్థానాలను మున్నూరుకాపులకు కేటాయించటం జరిగిందన్నారు. అదేవిధంగా రాష్ట్రస్థాయిలో పలు మున్సిపాలిటీల్లో చైర్మన్లుగా, వైస్‌చైర్మన్లుగా తదితర నామినేట్ పదవులు కేటాయించటంతో పాటు యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ లాంటి ఇతర కీలక పదవులను మున్నూరుకాపులకు కాంగ్రెస్ పార్టీ ఇవ్వటం జరిగిందని, ఇంకా రావల్సిన అవసరమున్నప్పటికీ సమయాన్ని బట్టి అవకాశాలు కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ధర్మపురి సంజయ్ కూడా త్వరలోనే కీలక పదవి వస్తుందని చెప్పకనే చెప్పారు పార్టీకనుగుణంగా కలిసి పని చేయాలే పార్టీకి వ్యతిరేకంగా ఎలాంటి పనులు చేయకూడదని, ధర్మపురి శ్రీనివాస్ అనుచరులుగా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రతి ఒక్కరూ ముందుకు నడవాలని రాబోయే ఎన్నికల్లో 2029లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడేలా అర్బన్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేను గెలిపించుకునేలా కలిసి ముందుకు అడుగులు వేయాలని రామకృష్ణ తెలిపారు.

## జర్మనీలో ఉద్యోగావకాశాలు యువతకు స్వర్ణావకాశం

జిల్లా ఉపాధి అధికారి నిర్మల

ప్రజాపక్షం /సంగారెడ్డి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మిక ,ఉపాది శిక్షణ ,ఫ్యాక్టరీ శాఖ పరిధిలో పనిచేస్తున్న తెలంగాణ ఓవర్సీస్ మాన్ పవర్ కంపెని లిమిటెడ్ రిజిస్టర్ రిక్రూట్మెంట్ ఏజన్సీ ద్వారా రాష్ట్రానికి చెందిన అర్హత కలిగిన నైపుణ్యంతో కూడిన ,అర్ధ నైపుణ్య కార్మికులకు విదేశి ఉద్యోగావకాశాలు కల్పించడానికి నియామక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాది అదికారి నిర్మల శనివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. టామ్ కామ్ గల్ఫ్ దేశాలతో పాటు ఆస్ట్రేలియి ,కెనడా, జర్మనీ ,హంగేరీ , జపాన్ , పోలాండ్ ,గ్రీస్ , రోమెనియా , యుఏఈ , సౌదీ అరేబియా, యుకె , తదితర దేశాల్లో ప్రభుత్వ , ప్రైవేట్ నమోదిత సంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పరంచుకున్నదనీ తెలిపారు. ప్రస్తుతం జర్మనీలో ఎలక్ట్రిషియన్ ఉద్యోగాలకు అవకాశాలు ఉన్నాయని ఎలక్ట్రిషియన్ ట్రేడ్‌లో ఐటిఐ అర్హతతో పాటు కనీసం 2 సంవత్సరాల అనుభవం కలిగిన 19 నుండి 30 సంవత్సరాల మద్య దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి అర్హత గల అభ్యర్థులు తమ నవీకరించిన బయోటాను ఇమెయిల్ చిరునామాకు www. tomcom.telangana..govin వెబ్ సైట్‌లో పంపవచ్చనీ తెలిపారు. మిగిత వివరాలకు 9440049520,9440052081లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. TOMCOM 7న గవర్నమెంట్ ఐటీఐ కాలేజ్ ,పటాన్‌చెరు, బీరంగూడ, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

## ప్రతి అమ్మాయి కేన్సర్.. వ్యాక్సిన్ తీసుకోవాలి

ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా

ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ : ప్రతి అమ్మాయి కేన్సర్ వ్యాక్సిన్ ఖచ్చితంగా తీసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన అమ్మాయిలు కేన్సర్ బారిన పడకుండా వ్యాక్సిన్ ప్రచార గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 14 ఏళ్ల అమ్మాయిలకు సర్వైకల్ కేన్సర్ వ్యాక్సిన్ అందజేస్తుందన్నారని, దీనికి ప్రముఖ హీరో అల్లు అర్జున్ మద్దతుగా నిలవడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల భవిష్యత్తులో అమ్మాయిలు కేన్సర్ బారిన పడకుండా వ్యాక్సిన్ ఎంతో తోడ్పడుతుందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వ్యాక్సిన్ అందుబాటులో ఉందన్నారు. అల్లు అర్జున్ ఫ్యాన్స్ చొరవ తీసుకొని అవగాహన కల్పించడం సంతోషకరమని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు న్యాలం రాజు, అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల సురేష్, జిల్లా అధ్యక్షుడు నరేందర్, దీపక్, మహేశ్, కృష్ణ, కార్తీక్, గోపి పాల్గొన్నారు.

## రోడ్డు పక్కనే చెత్తా చెదారం.. ప్రాణాలతో చెలగాటం

ఆందోళనలో గ్రామ ప్రజలు



ప్రజాపక్షం/మెదక్, పెద్ద శంకరంపేట: ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత కలిగిన అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం, గ్రామాన్ని చెత్త కుప్పగా మార్చేస్తోంది.! ప్రభుత్వం 99 రోజుల యాక్షన్ ప్లాన్ పేరిట పారిశుధ్యంపై భారీ హంగామా చేస్తుంటే, మెదక్ జిల్లా పెద్ద శంకరంపేటలో మాత్రం పరిస్థితులు భిన్నంగా కనిపిస్తున్నాయి. గత కొన్ని నెలలుగా గ్రామ ప్రవేశ ద్వారానికే చెత్తతో స్వాగతం పలుకుతున్న దుస్థితి నెలకొంది. రహదారి పక్కనే టన్నుల కొద్ది చెత్తను పడేయడంతో ఆ మార్గం గుండా వెళ్లే ప్రజలు ముక్కులు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. చెత్త కుప్పల నుంచి వెదజల్లుతున్న దుర్గంధం ఊపిరి పీల్చుకోవడానికే కష్టంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే కాకుండా, కొన్ని ప్రాంతాల్లో చెత్తను తగలబెట్టడం వల్ల పొగతో పాటు విష వాయువులు వ్యాపించి ప్రజల ఆరోగ్యాన్ని ముప్పతిప్పలు పెడుతున్నాయి. చిన్న పిల్లలు, వృద్దులు శ్వాసకోశ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారత ప్రభుత్వం అమలు చేస్తున్న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనలు కాగితాలకే పరిమితమయ్యాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజాప్రదేశాల్లో చెత్త వేయడం, కాల్చడం నిషేధం అయినప్పటికి ఇక్కడ మాత్రం ఆ నిబంధనలు అమలే కానట్లుగా ఉంది. స్థానికుల ఆరోపణల ప్రకారం, ఇంటింటికీ సేకరించిన చెత్తను శాస్త్రీయంగా డంపింగ్ యార్డుకు తరలించకుండా, రహదారి పక్కనే పడవేస్తుండటమే సమస్యకు మూలం. హోటళ్లు, చికెన్ సెంటర్ల నుంచి వచ్చే వ్యర్థాలు కూడా పరిస్థితిని మరింత దారుణంగా మారుస్తున్నాయి. ''గ్రామంలోకి అడుగు పెట్టడమే కష్టంగా మారింది. దుర్గంధంతో జీవించడం అసాధ్యం'' అంటూ గ్రామస్తులు మండిపడుతున్నారు. వెంటనే చెత్తను తొలగించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి వెంకట్ రావు ను ప్రజాపక్షం వివరణ కోరగా ఆయన స్పందిస్తూ ట్రాక్టర్ ద్వారా చెత్త సేకరణ జరుగుతోందని, అయితే ప్రస్తుత డంపింగ్ యార్డులు సరిపోక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. కొత్త డంపింగ్ యార్డ్ కోసం స్థల సేకరణ జరుగుతోందని చెప్పినప్పటికి పరిష్కారం కనిపించకపోవడం గమనార్హం.

## నాచగిరి క్షేత్ర గిరిప్రదక్షిణ పూర్వజన్మ సుకృతం



ప్రజాపక్షం / గజ్వేల్ : లోక కళ్యాణార్థమై నిర్వహిస్తున్న నాచగిరి శ్రీ లక్ష్మీనృసింహ క్షేత్ర గిరి ప్రదక్షిణలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతమని, ఈ మహత్కార్యంలో పాల్గొన్న భక్తులకు పుణ్యఫలాలు దక్కనున్నట్లు శ్రీ గురు మదనానంద పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామీజీ ఉద్భోదించారు. శనివారం తెల్లవారుజామున విశేష సంఖ్యలో భక్తజనం తరలిరాగా, క్షేత్రంలో గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని చైర్మన్ రవీందర్ గుప్త, ఆలయ అధికారి బెల్లంకొండ రంగాచారితో కలిసి స్వామీజీ శ్రీకారం చుట్టారు. స్వామీజీ అనుగ్రహ భాషణం చేస్తూ శ్రీ నారసింహుడు నడయాడిన ఈ ప్రాంతం పవిత్రమైనదని, పుణ్యస్నానాలు ఆచరించి స్వామిని దర్శిస్తే సర్వపాపాలు తొలగి ముక్తికి మార్గం దక్కుతుందని అన్నారు. స్వామివారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం పురస్కరించుకొని వైకుంత ద్వారం నుండి గిరి ప్రదక్షిణ చేయడం చక్కటి ఫలితాలిస్తుందని, స్వామి నామస్మరణతో మానసిక ప్రశాంతత దక్కుతుందని తెలిపారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం దిగ్విజయంగా జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు ఉష్రశ్రీ రాజశేఖర శర్మ, చందా నాగరాజు గుప్త, జగ్గయ్యగారి శేఖర్ గుప్త, శ్రీనివాస్, రుద్ర శ్రీహరి, గాలి కిష్టయ్య, సురేందర్ రెడ్డి, సంతోష్ కుమార్, కర్రె పద్మ వెంకటేష్, ఎక్స్ అఫీషియో సభ్యులు జగన్నాథచార్యులు, సర్పంచ్లు సారిక యాదగిరి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భాను మూర్తి గారి కుటుంబ సభ్యులచే అల్పాహారము, మరియు తూప్రాన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు.

## దుప్పిని చంపిన ముగ్గురికి రిమాండ్

ప్రజాపక్షం / సిర్పూర్ టి : సిర్పూర్ రేంజ్ పరిధిలోని చీలపల్లి అటవీ ప్రాంతంలో అడవి కుక్కల దాడిలో గాయపడిన చుక్కల దుప్పిని హతమార్చిన ముగ్గురు వ్యక్తులను అటవీశాఖ అధికారులు శనివారం అరెస్ట్ చేశారు. నిందితులు చీలపల్లి గ్రామానికి చెందిన ఆదే కిషన్, వడాయి శేఖర్, నీకోడే మారుతిలను సిర్పూర్ టి జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ వన్యప్రాణులను వేటాడటం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. గాయపడిన జంతువులను కాపాడాల్సింది పోయి హతమార్చడం దారుణమన్నారు. చర్యలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణుల సంరక్షణకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## జనగణనపై సన్నాహక సమావేశం



**ప్రజాపక్షం/ముత్తారం :** ముత్తారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ సురేష్ ఆధ్వర్యంలో శనివారం జనగణన ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ జనాభా గణన 2011 తర్వాత 2021 జనాభా గణనపై వివరాలు పది సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ఈ జనాభా గణన లెక్కలపై నిర్వహించే సర్వేలోఇంటింటికీ వెళ్లి జనగణనపై వివరాలు సేకరించాల్సిన ఫారాలను పూర్తి చేసే విధానంపై గ్రామపంచాయతీ కార్యదర్శులకు, సూపర్వైజర్లకు,ఎన్యుమరేటర్లకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా జనగణన ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని ఎంపిడిఓ ఆదేశించారు.ఎన్యుమరేటర్లు అడిగే వివరాలకు ప్రజలు సరైన సమాచారం అందించి సహకరించాలని కోరారు.క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే సాంకేతిక ఇబ్బందులను తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ముత్తారం తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, ఎఎస్ఓ,పంచాయతీ కార్యదర్శులు రాజేందర్,నవ్య,సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లుతోపాటు ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

## భూభారతి ఫైళ్లపై అదనపు కలెక్టర్ విచారణ



**ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ బిఎస్. లతా శనివారం సందర్శించారు. అనంతరం భూభారతి, సాధబై నామ, పిడిసి ఫైళ్లపై విచారణ నిర్వహించి పెండింగ్ అంశాలను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం ఫారెస్ట్, ఎంపిడిఓ, అగ్రికల్చర్ అధికారులతో చెరువుల వెట్ల్యాండ్ పరిరక్షణపై సమావేశం నిర్వహించి, నీటి వనరుల సంరక్షణకు సమన్వయంతో పని చేయాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బిఎస్. వరప్రసాద్, ఎంపిడిఓ రామకృష్ణ, ఎఓ ఆకు రాజ్ కుమార్, ఫారెస్ట్ అధికారులు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లకు సర్వం సిద్ధం



**ప్రజాపక్షం /పెగడపల్లి :** రాబోయే రబీ సీజన్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వరి ధాన్యం కొనుగోలు చేయడానికి అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్బుర్ర రాములు గౌడ్ తెలిపారు. శనివారం ఆయన తహసీల్దార్ఆనంద్ కుమార్తో కలిసి స్థానిక మార్కెట్ యార్డును సందర్శించి, కొనుగోలు కేంద్రాల్లో ఉండాల్సిన వసతులను పరిశీలించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు ఎవరూ ధాన్యం రాకముందే స్థలాలను బ్లాక్ చేయకూడద ని సూచించారు. ధాన్యం కోసిన వెంటనే నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, కుప్పలు పోసిన వెంటనే టోకెన్లు తీసుకోవాలని కోరారు. దళారుల బారిన పడకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం విక్రయించాలని సూచించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఓరుగల శ్రీనివాస్, ఎఎంసి డైరెక్టర్లు చాట్ల విజయభాస్కర్, లింగంపల్లి మహేష్, నాయకులు వంశీధర్ రావు, ఫ్యాక్స్ సిఇఓ గోపాల్ రెడ్డి, ఆర్.ఐ. శ్రీనివాస్, జి.పి.ఓ. సల్మాన్ ఖాన్, ఫ్యాక్స్ సిబ్బంది బొమ్మన అనిల్, పాల్గొన్నారు.

## పట్టణ పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత



**ప్రజాపక్షం / హుస్నాబాద్:** హుస్నాబాద్ పట్టణ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని ప్రతి ఒక్కరు తడిచెత్తను పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనానికి ఇవ్వాలని మున్సిపల్ చైర్పర్సన్ దండి లక్ష్మి కొమురయ్య పట్టణ ప్రజలను కొరారు. శనివారం 12వార్డులో ముదిరాజ్ కాలని సంఘ భవనంలో తడి చెత్త పొడిచెత్త పై అవగాణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాలిడ్ వేస్టుమెనేజ్మెంట్ 2026 చట్టం ప్రకారం చెత్తను నాలుగు రకములగా విభజన చేసి మున్సిపల్ వాహనం కు అందచేయాలని కొరారు. డ్రైనేజ్లో చెత్త వేయడం నీటి నిల్వలు ఉన్న చోట చెత్తను వేయకుడదని అన్నారు. ప్రతి ఒక్కరు జూట్ చేతి సంచులు వాడలనిఆలాగే ఇంట్లలో జరుగు వేడుకలకు మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టీలు దుకాణంల ద్వారా ప్లేట్లను గ్లాసులను వాడాలని సూచించారు. పట్టణ పరిశుభ్ర కాపాడటంలో ప్రతి ఒక్కరి పాలు పంచుకొవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్ కేశవేని రమేశ్, ఆధికారులు రవికుమార్, శ్రీధర్ బాసిల్ ఫాండే, నవీన్, లు పాల్గొన్నారు.

## సబ్ స్టేషన్ తనిఖీ సాంకేతిక మెరుగుదలపై దృష్టి



**ప్రజాపక్షం /ముస్తాబాద్ :** ముస్తాబాద్ 33/11 కెవి సబ్ స్టేషన్ను సి.ఈ అశోక్ స్వయంగా తనిఖీ చేశారు. ట్రాన్స్ఫార్మర్లు, స్విచ్ యార్డ్, నిర్వహణ విధానాలు, భద్రతా చర్యలు, విద్యుత్ సరఫరా నాణ్యత, సాంకేతిక పనితీరును సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓవర్లోడ్ ఫీడర్లు ఉన్నచో వెంటనే లోడ్ బదలాయింపు చేపట్టాలని, అవసరమైన చోట కొత్త బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరా నాణ్యతను మెరుగుపరచేందుకు సాంకేతిక చర్యలు తీసుకోవాలని, అవసరాన్ని బట్టి పవర్ ట్రాన్స్ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచాలని అధికారులకు సూచించారు. విద్యుత్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా, సురక్షితంగా, వినియోగదారులకు అనుకూలంగా తీర్చిదిద్దే దిశగా ఎన్పీడీసీఎల్ కట్టుబడి ఉందని సి.ఈ అశోక్ తెలిపారు.

# రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

### జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వమని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర మార్క్ ఫెడ్, కరీంనగర్ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీల ఆద్వర్యం లో శనివారం జగిత్యాల వ్యవసాయ మార్కెట్ లో ఏర్పాటు చేసిన మొక్క జొన్న కొనుగోలు కేంద్రాన్ని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రారంభించి మాట్లాడారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కొంత ఇబ్బందిగా ఉన్నా అన్ని సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేయడం జరుగుతుందన్నారు.జిల్లాలో 46 వేల ఎకరాల్లో, జగిత్యాల నియోజకవర్గం 14 వేల ఎకరాల్లో రైతులు మొక్క జొన్న పంట సాగు చేశారన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరగానే సానుకూలంగా స్పందించి జగిత్యాల నియోజకవర్గానికి మక్కల కొనుగోలు కేంద్రాలు మంజూరు చేశారన్నారు.కేంద్రం మద్దతు ధర .2,400 గా నిర్ణయించినప్పటికి రాష్ట్ర ప్రభుత్వం నుండి మక్కలు మాత్రం కొనుగోలు చేయటం లేదన్నారు. దీంతో తెలంగాణ మార్క్ ఫెడ్ రూ.10 వేల కోట్ల నష్టాల్లో ఉందన్నారు.రైతులు ఒకే రకమైన వరి లాంటి పంట కాకుండా ఇతర పంటల సాగుపై మొగ్గు చూపాలని ముఖ్యంగా వాణిజ్య పంట అయినఆయిల్ ఫామ్ పంట సాగు తో లాభదాయకమన్నారు.ఫామ్ ఆయిల్ పంట సాగు తో ఫామ్ ఆయిల్ ధర నేడు బంగారంలా ఉందన్నారు. రైతులు దేశానికి వెన్నెముక అనిఇతర పంటల సాగు పై రైతులు ఆలోచన చేసి దేశం పై దిగుమతుల భారం తగ్గించాలని సూచించారు..ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, ఎఎంసి చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి ,మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం ,మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మాజీ ఎఎంసి చైర్మెన్ నక్కల రవీందర్ రెడ్డి ,మార్కెటింగ్ ఎడి ప్రకాష్, డిఎఓభాస్కర్ ,మార్క్ ఫెడ్ డిఎమ్ హబిబ్, ఎమ్మార్వో రామ్మోహన్, ఎఎంసి వైస్ చైర్మన్ సయ్యద్ అఖిల్, నాయకులుచిక్కులభూమయ్య ,మహేశ్వర్ రావు, బాలే శంకర్, సురేందర్ నాయక్,ఎఎంసి డైరెక్టర్ లు,కౌన్సిలర్ లు,సర్పంచులు, నాయకులు,రైతులు ,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా "ప్రజాబాట" కార్యక్రమం




**ప్రజాపక్షం/ముస్తాబాద్:** ముస్తాబాద్ మండలంలోని తెర్లుమద్ది గ్రామంలో ఎన్ పిడిసిఎల్ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రజా బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ బైతి దుర్గమ్మ నవీన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఈ ఆపరేషన్ ఎన్ పిడిసిఎల్రాజన్న సిరిసిల్లా వారు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా చేయడానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. విద్యుత్ సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని అన్నారు. రైతులు తమ సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువచ్చి, వెంటనే పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు కూడా సమస్యలను నమోదు చేసి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సి ఇ ఆపరేషన్ అశోక్,ఎడి ఇ శ్రీనివాసులు, ఎఇ ముస్తాబాద్ విష్ణు తేజ, ఎల్ ఐ శ్రీనివాస్, లైన్మెన్ రాంబాబు, అసిస్టెంట్ హెల్పర్ వెంగల గ్రామ కార్యదర్శి సౌజన్యతో పాటు వార్డు సభ్యులు ఉన్నారు.

## ఎఐటియుసిపై విమర్శలు చేయడం సరైంది కాదు


### ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి కార్మిక వర్గ శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎఐటియుసి పై కొన్ని సంఘాలు, స్వార్థం కోసం యూనియన్ లు మారే వారు విమర్శలు చేయడం సరైంది కాదని ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ పేర్కొన్నారు. శనివారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలోని ఓసిపి 5 లో ఆయన కార్మికులను కలిసి మార్చి 30 న కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ముందు జరిగిన ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న కార్మికులకు ధన్యవాదాలు తెలుపుతూ, అనంతరం మాట్లాడుతూ సింగరేణి లో కార్మికుల హక్కుల సాధన కోసం, సంస్థ పరిరక్షణ కోసం ఎఐటియుసి నిరంతరం కృషి చేస్తా ఉంటె కొన్ని కార్మిక సంఘాలు, యూనియన్ లు మారే వారుఎఐటియుసి పై మరియు నాయకులపై అవగాహన లేకుండా విమర్శలు చేయడాన్ని ఆయన ఖండించారు. కొన్ని కార్మిక సంఘాలు ప్రభుత్వానికి,యాజమాన్యానికి అనుకూలంగా ఉంటూ ఎఐటియుసి పై విమర్శలు చేస్తూ కార్మికులను తప్పు దోవ పట్టిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. సింగరేణి లో ఎఐటియుసి పోరాటాలు చేయడం వల్ల నేడు కార్మిక వర్గం అనేక హక్కులు అనుభవిస్తుదని ఆయన అన్నారు. అవగాహన లేకుండా ఆరోపణలు చేయడం మానుకోవాలని ఆయన హితవు పలికారు.ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ప్రాజెక్టు కార్యదర్శి గుర్రం ప్రభుదాస్, నాయకులు భక్తి శ్రీనివాస్,చంద తిరుపతి,తదితరులు పాల్గొన్నారు.

## హౌస్ లిస్టింగ్ బ్లాక్లకు ఫిజికల్ వెరిఫికేషన్ తప్పనిసరి

### జిల్లాలో జరుగుతున్న జనగణన కార్యక్రమాన్ని కచ్చితత్వంతో పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** కొత్తపల్లి దుబ్బపల్లి చిన్నకల్వల గ్రామాలలో పర్యటించిన జిల్లా కలెక్టర్ప్రజాపక్షం సుల్తానాబాద్ జిల్లాలో జరుగుతున్న జనగణన కార్యక్రమాన్ని కచ్చితత్వంతో, సమగ్రంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి మండలంలోని కొత్తపల్లి గ్రామం, సుల్తానాబాద్ మండలంలోని దుబ్బపల్లి, చిన్నకల్వల గ్రామాలలో జరుగుతున్న జనగణన ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూహౌస్ లిస్టింగ్ బ్లాక్లకు సంబంధించి ఫిజికల్ వెరిఫికేషన్ను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు.గ్రామ స్థాయిలో ల్యాండ్మార్క్లు, పాఠశాలలు, దేవాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు తదితర గుర్తులను బ్లాక్ వారీగా స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు.హౌస్ లిస్టింగ్ బ్లాక్కు సంబంధించిన వివరాలు ఖచ్చితమైన సమాచారంతో సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట తహసిల్దార్లు రాజయ్య, బషిరుద్దీన్, ఎంపిడిఓ దివ్యదర్శన్ రావు,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## మంచుకొండల్లో మీసేవ అమోఘం

### కేదారినాథ్ అన్నదాన కరపత్రాన్ని ఆవిష్కరించిన మాజీ మంత్రి హరీష్రావు



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట అన్నదాన కార్యక్రమం గొప్పతనం ఎల్లలు దాటేలా చేశారని మాజీ మంత్రి హరీష్రావు అన్నారు. శనివారం సిద్దిపేటలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేదారినాథ్లో అన్నదాన కార్యక్రమం చేపట్టి యాత్ర అక్కడికి పంపే ఆహారపదార్థాల వాహన ప్రారంభం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ మానవసేవయే మాధవ సేవగా భావిస్తూ కేదారినాథ్కు వచ్చే భక్తులు మీరు చేసే అన్నదానం గొప్ప సేవ కార్యక్రమం అన్నారు. ఎముకలు కొరికే చలిలో సై తం చేయకుండ మంచికొండల్లో మీరు చేస్తున్న సేవ ప్రశంసనీయమన్నారు. ఇది ఎప్పుడు కొనసాగాలని ఆకాంక్షించారు. యాత్రికులకు అన్నదాన సేవలు అందించేందుకు ఈసంవత్సరం ఏప్రిల్ 22 నుండి ప్రారంభమయ్యే కేదారినాథ్ యాత్ర యాత్రికులకు అన్నప్రసాద అందించేందుకు ఈనెల 14 తేదీన సాయంత్రం 4గంటలకు స్థానిక శరభేశ్వరస్వామి వారి దేవాలయ ప్రాంగణంలో ఆహార పదార్థాల వాహనాన్ని ప్రారంభిస్తారన్నారు. ఈకార్యక్రమంలో కేదారినాథ్ అన్నదాన సేవ ట్రస్టు ప్రతినిధులు చీకోటి మదుసూదన్, అయిత పురోషోత్తం, గంప శ్రీనివాస్, శ్రీనివాస్ శరభయ్య తదితరులుపాల్గొన్నారు. అలాగే నంగునూర్ మండలం రాంపూర్ సీతారామచంద్రస్వామి దేవాలయ ఉత్సవాల్లో ,గట్ల మల్యాల పెద్దమ్మ తల్లి ఉత్సవాల్లో మాజీ మం త్రి హరీష్రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

## ఆదర్శ వివాహాలను యువత ప్రోత్సహించాలి




**ప్రజాపక్షం/కరీంనగర్ :**నేటి యువత ఆదర్శ వివాహాలను ప్రోత్సహించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్,న్యాలపట్ల రాజు, కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజులు కోరారు. ఎఐఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా సమితి సహకారంతో నేడు పద్మ నగర్ లోని ఇందిరాభవన్ లొ జరిగిన కామ్రేడ్.విజేత ప్రీతమ్ల వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొయ్యడ సృజన్ కుమార్, న్యాలపట్ల రాజు, పైడిపల్లి రాజులు మాట్లాడుతూ సమాజంలో కంప్యూటర్ యుగం నడుస్తున్న వేళ ఆడంబరాలకు పోకుండా ఉద్యమంలో జరిగిన పోరాటాలలో వారు ఒక్కటై ఒకరిని ఒకరు అర్థం చేసుకుని ఆదర్శ వివాహం చేసుకొని ఎంతోమందికి స్ఫూర్తి దాయకమయ్యారని వారు తెలిపారు. ఇలాంటి ఆదర్శ వివాహాలను ప్రతి ఒక్కరు ప్రోత్సహించి అనవసరపు పెండ్లిల ఖర్చులను తగ్గించాలని రానున్న కాలంలో ఆదర్శ వివాహాలను ప్రోత్సహించి భవిష్యత్ తరాలకు వీరు బాటలు వేశారని తెలిపారు. ఇలాంటి వివాహాలు జరగడం సంతోషించదగ్గ విషయమని యువత దీనిపై ఆలోచనలు చేయాలని వారు పేర్కొన్నారు.

## రామనామస్మరణతో మార్మోగిన ఇల్లందకుంట

### చంద్రరథంపై కొలువుదీరిన కోదండ రాముడు * దర్శించుకున్న ఎంపి ఈటెల, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్




**ప్రజాపక్షం/ఇల్లందకుంట:**అపర భద్రాద్రి గా పేరు గాంచిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం అత్యంత ప్రధాన ఘట్టమైన చంద్ర రథోత్సవంపై కోదండ రాముడు భక్తులకు దర్శనం ఇచ్చారు. శుక్రవారం సాయంత్రం రాత్రి ఉత్సవ ముత్తులను ఆలయ అర్చకులు సర్వాంగ సుందరంగా అలంకరించి వేదమంత్రచరణల మధ్య చంద్ర రథోత్సవం పై ప్రతిష్ఠించారు. రాత్రి నుండి భక్తులు గంటల తరబడి భారీ క్యూ లైన్ లో నిలుచొని దర్శించుకున్నారు. స్వామివారిని మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ప్రత్యేక పూజలు నిర్వహించి సీతారామచంద్ర స్వామిని దర్శించుకున్నారు. భక్తుల కోసం మంచినీటి సౌకర్యం చలవ పందిళ్లు ఏర్పాటు చేశారు పోలీస్ సిబ్బంది భక్తులకు పార్కింగ్ స్థలాన్ని క్యూ లైన్ లో వచ్చేలా ఇబ్బంది కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టారు శనివారం సాయంత్రం ఐదు గంటలకు వేలాదిమంది భక్తుల మధ్య జయ జయ ధ్వనాల మధ్య మాడ వీధుల గుండా స్వామి వారి రథాన్ని ఆలయం ముందుకు శ్రీరామ నామస్మరణతో లాగారు. రథోత్సవానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ ఈవో కందుల సుధాకర్ దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**ఎసిపి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు**

అపర భద్రాద్రి చంద్ర రథోత్సవ సందర్భంగా భక్తుల తాకిడి ఎక్కువ ఉన్నందున హుజురాబాద్ ఏసిపి మాధవి పర్యవేక్షణలో జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ ఇల్లందకుంట ఎస్సై క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులకు లేకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాణా అధికారి కందుల సుధాకర్, దేవస్థాన చైర్మన్ ఇంగిలే రామారావు, అర్చకులు వంశీధనాచార్యులు, రవి కుమార్, ఆలయ కమిటీ సభ్యులు రామ్ రెడ్డి, గోలి కిరణ్, మూడెత్తుల మల్లేష్, కమిటీ సభ్యులు, సర్పంచ్ దార సురేష్, కడారి కుమారస్వామి, ఆలయ సిబ్బంది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 8న జాబ్ మేళా నిర్వహణ

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జిల్లాలోని నిరుద్యోగ యువకులకు పెద్దపల్లి జిల్లాలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, ఫైనాన్స్ కంపెనీలో ఉపాధి కల్పించుటకు ఏప్రిల్ 8న బుధవారం రోజున జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి వై.తిరుపతిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, ఫైనాన్స్ కంపెనీలో 15 మార్కెటింగ్ పోస్టులు వివిధ మండలాల్లో ఖాళీగా ఉన్నాయని జిల్లాలోని నిరుద్యోగ యువకులకు ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని , విద్యార్హత ఏదైనా డిగ్రీ, వయస్సు 25 సంవత్సరాలు నుండి 40 సంవత్సరాల లోపు ఉండాలని, ఆసక్తి గలవారు ఏప్రిల్ 08 ఉదయం 11 గంటలకు విద్యార్హత పత్రాలు, పని అనుభవం, ఆధార్ కార్డు జిరాక్స్ లతో పెద్దకాల్వల లోని నూతన కలెక్టర్ భవన సముదాయం మొదటి అంతస్థులో గది నెం బర్ 233లో వచ్చి తమ పేరు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 89853 36947, 8121262441 ఫోన్ నెంబర్ లో సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రజల దృష్టిని మళ్లించడానికి డైవర్షన్ పాలిటిక్స్

### మాజీ శాసనసభ్యుడు కోరుకంటి చందర్




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కార్యాలయంపై పరిపాలన చేతకాక ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే చర్య, రాష్ట్రంలో ప్రజా పాలన కాదు,గుండాల పాలన నడుస్తున్నదనీ,ఎన్నికల హామీల అమలు వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి డైవర్షన్ పాలిటిక్స్ కోసమే,గజ్వేల్ లోని మాజీ ముఖ్యమంత్రి, కెసిఆర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పై కాంగ్రెస్ గూండాల దాడిని ఖండిస్తున్నామని మాజీ శాసనసభ్యులు పెద్దపల్లి జిల్లా అధ్యక్షులుకోరుకంటి చందర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ దాడి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కనుసన్నల్లో జరిగిన దాడి అని, దీనికి పూర్తి బాధ్యత రేవంత్ రెడ్డి దని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.అధికారంలో ఉన్నామనే గర్వంతో వివేకం కోల్పోయి కాంగ్రెస్ నాయకుల ప్రవర్తనా తీరును ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కాంగ్రెస్ పాలనలో ఇలాంటి దాడులు కొత్త కాదని, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలు, మీడియాపై దాడులు రోజు వారిగా జరగడం సిగ్గుచేటని అన్నారు.తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల హామీల అమలు వైఫల్యాలు, సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి డైవర్షన్ పాలిటిక్స్కు పాల్పడుతోందని అందుకే కెసిఆర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి చేయించారని తీవ్రంగా ఆరోపించారు. అసలు రాష్ట్రంలో ప్రజా పాలన కాదు.. రాక్షస పాలన నడుస్తోందని, శాంతి భద్రతలను కాపాడాల్సిన పోలీసులే కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలు మారిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇందిరమ్మ పాలన అని చెబుతూ ,రాక్షస పాలనను నడుపుతున్నరని మంత్రులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర పాలన గాలికి వదిలేసి, ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో ప్రచారంలో బిజీగా ఉన్నారని ఆయన అన్నారు.మీరు చేస్తున్న దౌర్జన్యాలు, నిర్బంధ చర్యలకు బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు వెనుకడుగు వేయరని, ప్రజల మధ్య మిమ్మల్ని ప్రశ్నిస్తూ, ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తూనే ఉంటామని హెచ్చరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ గూండాలను గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు.

12 ప్రజాపక్షం Telugu National Daily
కరీంనగర్
ఆదివారం
05-04-2026
www.prajapaksham.in

> విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో టి– సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న 'రణబాలి'. 'రణబాలి' సెప్టెంబర్ 11న రిలీజ్‌కు రాబోతోంది. తాజాగా ఈ సినిమా అనంతపూర్ షెడ్యూల్ కంప్లీట్ చేసుకుంది.

# రీల్

## 'రణబాలి' అనంతపూర్ షెడ్యూల్ పూర్తి




విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో టి– సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న 'రణ బాలి'. ఈ సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. 'రణబాలి' సెప్టెంబర్ 11న రిలీజ్‌కు రాబోతోంది. తాజాగా ఈ సినిమా అనంతపూర్ షెడ్యూల్ కంప్లీట్ చేసుకుంది. అనంతపూర్‌లో షూటింగ్ సందర్భంగా అక్కడి స్థానికులు, రౌడీ ఫ్యాన్స్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంట మీద ఎంతో ప్రేమాభిమానాలు చూపించారు. అభిమానులు బైక్ ర్యాలీలతో విజయ్ పట్ల ప్రేమను చాటుకున్నారు. విజయ్ దేవరకొండ తన రాయలసీమ అభిమానులను ఫ్యాన్స్ మీట్‌లో కలుసుకున్నారు. రాయలసీమకు ఎప్పుడు షూటింగ్‌కు వచ్చినా తన సొంతూరుకు వచ్చినట్లు అనిపిస్తుందా, తన లోపల సీమ ఫీల్ ఉందని విజయ్ దేవరకొండ అన్నారు. ఇలా ఎన్నో ఎమోషనల్ మూవ్ మెంట్స్‌తో 'రణబాలి' అనంతపూర్ షెడ్యూల్ పూర్తయ్యింది. ఈ సినిమాలో రణబాలి అనే యోధుడి పాత్రలో విజయ్ దేవరకొండ, జయమ్మగా రష్మిక మందన్న ప్రేక్షకుల్ని ఆకట్టుకోనున్నారు. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా 'రణ బాలి' సినిమా రూపొందుతోంది. విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న, ఆర్నాల్ వోస్లూ, తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి కో– ప్రొడ్యూసర్స్ అనురాగ్ పర్వతనేని, శివ్ చనన, మ్యూజిక్ అజయ్ అతుల్, డిఒపి నీరవ్ షార్రైటర్ ప్రమోద్ తమ్మినేని, ఎడిటర్ కార్తీక శ్రీనివాస్ ఆర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఆర్ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ చెంబోలు సాయి ఆదిత్య, కొరియోగ్రఫీ కృతి మహేశ్, ఆర్ట్ డైరెక్టర్ విఠల్ కోసనం, యాక్షన్ కొరియోగ్రాఫర్స్ యెన్నిక్ బెన్, ఆండి లాంగ్ గ్యుయెన్, రాబిన్ సుబ్బు.

'డైమండ్ డెకాయిట్'

## ట్రైలర్ రిలీజ్ చేసిన దిల్ రాజు




తెలుగు ఇండ్రస్టీలో హాట్ టాపిక్‌కు తెర లేపుతూ, పార్థ గోపాల్ నిర్మాణంలో, దర్శకుడు సూర్య జి. యాదవ్ రూపొందిస్తున్న మూవీ డైమండ్ డెకాయిట్. ఈ సినిమా చిత్ర ట్రైలర్‌ను ఆంధ్రప్రదేశ్ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ప్రముఖ నిర్మాత చైర్మన్ దిల్ రాజు ఆవిష్కరించారు. ఈ ట్రైలర్‌ను వీక్షించిన అయ్యన్నపాత్రుడు దిల్ రాజు చిత్రయూనిట్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ వాకడ అప్పారావు, శివాజీరాజా, థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వీరాజ్ తదితరులు పాల్గొని చిత్రయూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక అతిథులుగా స్టార్ నిర్మాత శిరీష్ రెడ్డి చిత్ర యూనిట్ ని అభినందించారు. ట్రైలర్ చాలా గ్రిపింగ్‌గా ఉంది. విజువల్స్, బ్యాగ్రౌండ్ స్కోర్, కథలో ఉన్న థ్రిల్.. వంటి అంశాలు చాలా స్ట్రాంగ్ ఇంపాక్ట్ క్రియేట్ చేస్తున్నాయి. ఈ సందర్భంగా హీరో పర్థ గోపాల్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అలాగే ప్రముఖ నిర్మాత దిల్ రాజు 'డైమండ్ డెకాయిట్ మూవీ ట్రైలర్‌ను ఆవిష్కరించి అభినందించడం సంతోషంగా ఉంది వారికి ధన్యవాదాలు. ట్రైలర్‌కు వస్తున్న స్పందన ఎంతో ఆనందంగా ఉంది. ఇది సాధారణ కథ కాదు, సస్పెన్స్, ఎమోషన్స్, థ్రిల్ అన్నీ కలిసిన పూర్తి ఎంటర్టైనర్. ప్రేక్షకులకు ఒక సరికొత్త అనుభూతి ఇస్తుంది. ప్రతి ఒక్కరూ మా సినిమాను ఆదరించాలని కోరుతున్నాం అని తెలిపారు.. ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదలయ్యే మా సినిమాను ప్రతి ఒక్కరూ థియేటర్లో వీక్షించి సపోర్టు తెలపాలి అని కోరారు. ఈ చిత్రానికి సంగీతం ఆర్ ఆర్, ఎడిటర్ శివ సర్వాణి, సినిమాటోగ్రఫీ శివ అచంట.

## 'సఖీ' సాంగ్ రిలీజ్



సమైరా, సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రల్లో అభినయ కృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న థ్రిల్లింగ్ 'కామాఖ్య'. మై ఫిల్మ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వడ్డేపల్లి శ్రీ వాణీ నాథ్, యశ్వంత్ రాజ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ కామాఖ్య మ్యూజిక్ ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు. ఫస్ట్ సింగిల్ సఖీ పాటని రిలీజ్ చేశారు. ట్యాలెంటెడ్ కంపోజర్ జ్ఞానీ ఈ పాటని ఎప్పటికీ నిలిచిపోయే ఫ్రెండ్‌షిప్ సాంగ్‌గా స్వరపరిచారు. అనంత శ్రీరాం రాసిన లిరిక్స్ మనసుని హత్తుకునేలా వున్నాయి. లక్ష్మీ మేఘన వాయిస్ పాటకు మరింత మాధుర్యాన్ని జోడించింది. లిరికల్ వీడియో ఆకట్టుకునే భావోద్వేగాలను, మ్యూజికల్ ట్రీట్‌ని అందిస్తుంది. ఈ చిత్రానికి రమేష్ కుశేందర్ రెడ్డి డిఒపి, వరప్రసాద్ ఎడిటర్. సమైరా, సముద్రఖని, అభిరామి, ఆనంద్, శరణ్య ప్రదీప్, వైష్ణవ్, ధనరాజ్, రాఘవ, నటిస్తున్నారు బిపిఒ : రమేష్ కుశేందర్ రెడ్డి, సంగీతం: గ్యాని ఎడిటర్: వరప్రసాద్, ఆర్ట్: భూపతి యాదగిరి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శ్రీహరి గౌడ్.

## ఉత్తరాంధ్ర జానపద జీవితం 'గరివిడి లక్ష్మి'



శ్రీ పుల్ మీడియా ఫ్యాక్టరీ, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కి చెందిన లెజెండరీ జానపద గాయని 'గరివిడి లక్ష్మి' కథని ప్రేక్షకులు ముందుకు తీసుకొస్తుంది. గరివిడి లక్ష్మి పాత్రలో ఆనంది మెరుస్తోంది. గౌరి నాయుడు జమ్ము ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. బుర్ర కథలు చెప్పడమే కాదు, ఓ ఉద్యమంగా మార్చిన లక్ష్మి జీవితాన్ని ఈ సినిమా ఆవిష్కరించనుంది. టి.జి.విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్న 'గరివిడి లక్ష్మి' ఓ పాటతో వేలాది హృదయాల్లో నిలిచిపోయిన లెజెండరీ జానపద గాయని జీవితాన్ని రిక్రియేట్ చేస్తోంది. ఇటీవల విడుదలైన రిలీజ్ చేసిన జానపదం కోసింది కొయ గూర సాంగ్ కు శ్రోతల నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. చరణ్ అర్జున్ ఈ జానపదాన్ని రాఎనర్జీ వుండే డ్యాన్స్ నెంబర్ గా కంపోజ్ చేశారు. ఈ సాంగ్‌లో ఆనంది ఫర్ఫామెన్స్ అదిరిపోయింది. నరేష్, రాశి, ఆనంది, రాగ్ మయూర్, శరణ్య ప్రదీప్, అంకిత్ కొయ్య, మీసాల లక్ష్మణ్, కంచరపాలెం కిషోర్, శరణ్య ప్రదీప్, కుశాలిని నటిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ ఆదిత్య, సంగీతం: చరణ్ అర్జున్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సుజిత్ కుమార్ చౌదరి కొల్లి, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: సుకుమార్ కిన్నెర,ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: దుర్గా ప్రసాద్, క్రాంతి కుమార్ దత్తి.

## కరుప్పు తెలుగులో 'వీరభద్రుడు'




సూర్య హీరోగా నటిస్తున్న తాజా మాస్ కమర్షియల్ ఎంటర్టైనర్ 'కరుప్పు' కోసం దర్శకుడు ఆర్.జె బాలాజీతో చేతులు కలిపారు. ఈ మోస్ట్ ఎవైటెడ్ మూవీని అనేక విజయవంతమైన చిత్రాలను నిర్మించడం ద్వారా పేరును తెచ్చుకున్న నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తోంది. తమిళం, తెలుగు, హిందీ పరిశ్రమలలో పాపులర్ కంటెంట్‌ను అందించిన డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని స్కేల్, కంటెంట్ రెండింటినీ దృష్టిలో ఉంచుకుని ప్రతిష్టాత్మకగా తెరకెక్కిస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ భారీ అంచనాలని సృష్టించింది. తాజాగా ఈ చిత్రానికి తెలుగులో వీరభద్రుడు అనే టైటిల్ పెట్టారు. సూర్య పవర్‌ఫుల్ అవతార్‌లో కనిపించిన టైటిల్ పోస్టర్ అదిరిపోయింది. ఈ చిత్రంలో త్రిష హీరోయిన్ గా నటిస్తోంది. ఇంద్రన్స్, నట్టి, స్వసిక, అనఘ మాయ రవి కీలక పాత్రలు పోషిస్తున్నారు. సాయి అభ్యంకర్ మ్యూజిక్ అందిస్తున్న ఈ చిత్రానికి జికె విష్ణు సినిమాటోగ్రఫీ. మే 14న ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. సూర్య, త్రిష, ఇంద్రన్స్, నట్టి, స్వసిక, అనఘ మాయ రవి, శ్శివాడ, సుప్రీత్ రెడ్డి నటిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ జికె విష్ణు, సంగీతం సాయి అభ్యంకర్ యాక్షన్ అన్బరివ్ విక్రమ్ మోర్ ఎడిటర్ ఆర్.కళైవానన్, నిర్మాతలు: ప్రకాష్ బాబు, ఎస్.ఆర్. ప్రభు.

తెలుగు సినిమా

## గర్వంగా చెప్పుకునే 'బైకర్'

ఇది నా బెస్ట్ ఫిల్మ్ హీరో శర్వానంద్ చార్మింగ్ స్టార్ శర్వా లేటెస్ట్ బంపర్ బ్లాక్ బస్టర్ బైకర్. మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో రాజశేఖర్ పవర్‌ఫుల్ పాత్రని పోషించారు. అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో ప్రతిష్టాత్మక బ్యానర్ యూవి క్రియేషన్స్ నిర్మించింది. ఏప్రిల్ 3న ప్రపంచ వ్యాప్తంగా విడుదలైంది. ఈ సందర్భంగా మేకర్స్ బంపర్ బ్లాక్ బస్టర్ మీట్‌ని నిర్వహించారు. ఈ సందర్భంగా శర్వానంద్ మాట్లాడుతూ ఈ క్యారెక్టర్ కోసం దాదాపు 22 కిలోలు తగ్గాను. 'బైకర్' ద్వారా నా జీవితంలో చాలా మార్పులు వచ్చాయి. ఇండియా గర్వించే సినిమా తీస్తామని చెప్పాం..తీసాం. ఇప్పుడు ఆడియన్స్‌కు చూపిస్తున్నాం. తెలుగు సినిమా గర్వంగా చెప్పుకునే సినిమా ఇది. ఇది నా బెస్ట్ ఫిల్మ్ అని నేను గర్వంగా చెప్పుకుంటాను. రేసింగ్ సీక్వెన్స్‌లు అద్భుతంగా రావడానికి కారణం యాక్షన్ మాస్టర్ దిలీప్. సంపత్ నంది, హీరోయిన్ మాళవిక నాయర్ , డైరెక్టర్ అభిలాష్ రెడ్డి , నిరూప్ నందకుమార్ డిఒపి యువరాజ్, ఎడిటర్ అనిల్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





సిపిఐ ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శిగా పనిచేసిన కామ్రేడ్ బట్టు దయానంద రెడ్డి మనవరాలి వివాహం హైదరాబాదులో జరిగిన సందర్భంగా సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె. నారాయణ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా దయానంద రెడ్డి నారాయణ ద్వారా 15 వేల రూపాయల పార్టీ నిధిని సిపిఐ తెలంగాణ స్టేట్ కౌన్సిల్‌కి అందజేశారు.

### హైదరాబాద్‌లో వెక్టార్ బోర్న్
## వ్యాధుల నివారణపై అవగాహన

ఎఐ సాంకేతికతతో దోమల నియంత్రణకు జిహెచ్‌ఎంసి శ్రీకారం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో పెరుగుతున్న దోమల బెడదను అరికట్టడానికి, సీజనల్ వ్యాధులను నియంత్రించడానికి మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటోంది. జిహెచ్‌ఎంసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శనివారం 'ఉద్భవిస్తున్న వెక్టార్ బోర్న్ వ్యాధులు నివారణ వ్యూహాలు' అనే అంశంపై శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, అదనపు కమిషనర్ (ఆరోగ్యం) డాక్టర్ ప్రియాంక అలా, అదనపు కమిషనర్ (పారిశుద్ధ్యం) ఎన్. రవికిరణ్, ఉస్మానియా యూనివర్సిటీ జువాలజీ విభాగం హెడ్ డాక్టర్ బి. రెడ్యా నాయక్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె. పద్మజతో పాటు 60 సర్కిళ్ల వైద్య అధికారులు, ఎంటమాలజీ నిపుణులు హాజరయ్యారు. దోమల ఉత్పత్తి కేంద్రాలను గుర్తించడానికి ఏఐ (ఎఐ), శాటిలైట్ ఇమేజింగ్, స్మార్ట్ మస్కిటో సర్వైలెన్స్ సిస్టమ్స్ వంటి సాంకేతికతను ఉపయోగించాలని నిర్ణయించారు. నగరంలోని నీటి నిల్వలు, చెరువులు, మురుగు కాలువల వద్ద డ్రోన్ల ద్వారా దోమల నివారణ చర్యల సాధ్యాసాధ్యాలను కమిషనర్ సమీక్షించారు. దోమల నియంత్రణకు శాస్త్రీయ పద్ధతులను రూపొందించడానికి ప్రజారోగ్యం, ఎంటమాలజీ, విద్యావేత్తలతో కూడిన ఒక ఉన్నత స్థాయి సాంకేతిక కమిటీని ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆదేశించారు. జాతీయ మార్గదర్శకాలకు అనుగుణంగా సీజనల్ వ్యాధులపై పోరాడేందుకు ప్రత్యేక స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ సిద్ధం చేయనున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని శాస్త్రీయ పద్ధతులతో కూడిన పౌరకేంద్రీకృత విధానాన్ని అనుసరించాలన్నారు. సాంకేతికతను వాడుకుంటూనే క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయాలన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ బి. రెడ్యా నాయక్ 'వెక్టార్ మేనేజ్‌మెంట్ కోసం ఏఐ వినియోగం' అనే అంశంపై ప్రసంగిస్తూ, పట్టణ ప్రాంతాల్లో దోమల ప్రవర్తనను గుర్తించడం, లార్వా నిర్మూలనలో గ్లోబల్ ఇన్నోవేషన్‌ల ప్రాముఖ్యతను వివరించారు. హైదరాబాద్ నగరాన్ని దోమల రహితంగా మార్చేందుకు, ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు జిహెచ్‌ఎంసి కట్టుబడి ఉందన్నారు.




### విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి
## ఇటువంటి అకాడమీల పాత్ర కీలకం




తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

**ప్రజాపక్షం/రంగారెడ్డి :** విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ఇటువంటి అకాడమీలు కిలక పాత్ర పోషిస్తాయని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు.శనివారం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఫ్యూచర్ సిటీ కమిషనరేట్,రంగారెడ్డి జిల్లా,శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న వర్ధమాన్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో రాష్ట్రంలోని మొట్టమొదటి ఎటిఎల్ సారథి మెంటర్ ఇండియా అకాడమీ'ని ప్రారంభించారు.ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ఇటువంటి అకాడమీలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.గవర్నర్ పర్యటన సందర్భంగా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.చేవెళ్ల ఎసిపి బి.కిషన్ మార్గదర్శకత్వంలో, శంషాబాద్ ఎస్‌హెచ్ ఒ కె నరేందర్ రెడ్డి పర్యవేక్షణలో పోలీస్ బందోబస్తు ప్రకద్బందీగా నిర్వహించడం జరిగింది.పోలీసుల ముందస్తు ప్రణాళిక సమన్వయంతో ఎటువంటి ఎలాంటి ఇబ్బందు చోటుచేసుకోకుండా కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### లైసెన్స్ లేకుండా నడుస్తున్న
## సెక్యూరిటీ ఏజెన్సీలపై కఠిన చర్యలు

ఇంటెలిజెన్స్ అదనపు డిజి విజయ్‌కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీస్ (రెగ్యులేషన్) చట్టం2005, తెలంగాణ ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీస్ నియమాలు 2022ను ఉల్లంఘిస్తూ అనుమతి లేకుండా పనిచేస్తున్న ఏజెన్సీలపై రాష్ట్ర ఇంటెలిజెన్స్ శాఖ కఠిన చర్యలు ప్రారంభించింది. రాష్ట్ర కంట్రోలింగ్ అథారిటీకి అందిన సమాచారం మేరకు ఇంటెలిజెన్స్ శాఖ, కాచిగూడ పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా తిలక్‌నగర్‌లో ఉన్న 'క్రిష్ సెక్యూరిటీ ఫోర్స్ (ఫైర్ ఫైటింగ్ విజిలెన్స్)' అనే సంస్థపై దాడి చేసి, సరైన పిఎస్‌ఎఆర్‌ఎ లైసెన్స్ లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఆ సంస్థ యజమానిపై ఎఫ్ఐఆర్ నంబర్ 121/2026 కింద బిఎన్‌ఎస్ చట్టంలోని సెక్షన్ 223(ఎ)తో పాటు పిఎస్‌ఎఆర్‌ఎ చట్టం2005లోని సెక్షన్ 20 ప్రకారం కేసు నమోదు చేశారు. చట్టం ప్రకారం, లైసెన్స్ లేకుండా సెక్యూరిటీ ఏజెన్సీలు నిర్వహించడం నేరంగా పరిగణించబడుతుందని, దోషులకు ఒక సంవత్సరం వరకు జైలు శిక్ష లేదా రూ.25 వేల వరకు జరిమానా లేదా రెండూ విధించవచ్చని అధికారులు తెలిపారు. లైసెన్స్ లేకుండా పనిచేస్తున్న అన్ని ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలు వెంటనే అధికారిక పిఎస్‌ఎఆర్‌ఎ పోర్టల్ ద్వారా అనుమతి పొందాలని ఆదేశించారు. నిబంధనలు పాటించని డైరెక్టర్లు, యజమానులు, భాగస్వాములపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఇంటెలిజెన్స్ అదనపు డిజి విజయ్‌కుమార్ హెచ్చరించారు.

## సికింద్రాబాద్‌లో భారీగా గంజాయి పట్టివేత



రూ.50 లక్షల విలువైన గంజాయి స్వాధీనం.. నలుగురు అరెస్ట్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసరాల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు భారీగా గంజాయి పట్టుకుని, నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. సుమారు రూ.50 లక్షల విలువైన 42.9 కిలోల గంజాయితో పాటు రూ.72,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం రైల్వే స్టేషన్ పరిసరాల్లో దాడులు నిర్వహించి, నిందితుల బ్యాగులను తనిఖీ చేయగా 20 ప్యాకెట్లలో 42.9 కిలోల గంజాయి లభించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఖాన్ సజావర్ నవాజ్ ఖాన్ వద్ద రూ.72,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన వారిని గణేష్ శివనాథ్ బోడుగే (42), పరమేశ్వర్ దామోదర్ బాలప్ (33), విన్నీ శైలేష్ మేశారాం (32), ఖాన్ సజావర్ నవాజ్ ఖాన్ (54)గా గుర్తించారు. వీరంతా మహారాష్ట్రకు చెందిన వారని పోలీసులు తెలిపారు. దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం ఎపి రాష్ట్రంలోని నర్సీపట్నం, తుని ప్రాంతాల నుంచి గంజాయిని కిలోకు రూ.4 వేల చొప్పున కొనుగోలు చేసి, ముంబై, పుణే వంటి ప్రాంతాల్లో రూ.12 వేల నుంచి రూ.20 వేల వరకు విక్రయిస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నారు. సికింద్రాబాద్‌ను కేంద్రంగా చేసుకుని ఖాన్ నవాజ్ ఖాన్ ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నట్లు తెలిసింది.
కేసుకు సంబంధించి నిందితులను సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ఆపరేషన్‌లో సిఐలు చంద్రశేఖర్ గౌడ్, కోటమ్మ, ఎస్సైలు శ్రీనివాసులు, రూప, భూపాల్ తదితర సిబ్బంది పాల్గొన్నారు. పెద్ద మొత్తంలో గంజాయి పట్టుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాన్ని హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ అనిల్ కుమార్ రెడ్డి అభినందించారు.



## బిఆర్ఎస్ కైవసం

(మొదటి పేజీ తరువాయి)

కూడా గులాబీ పార్టీ దక్కించుకుంది. చైర్మన్‌గా బిఆర్ఎస్ అభ్యర్థి సంధ్యారాణి ఎన్నికయ్యారు. వైస్ చైర్‌పర్సన్ పదవిని సిపిఐ అభ్యర్థి సరిత దక్కించుకున్నారు. ఈ ఎన్నికకు కాంగ్రెస్ కౌన్సిలర్లు దూరంగా ఉన్నారు. మరోవైపు ఖానాపూర్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చేతులు ఎత్తే క్రమంలో కౌన్సిలర్ల మధ్య వివాదం నెలకొంది. అధికారులతో ఎమ్మెల్యే, కాంగ్రెస్ కౌన్సిలర్లు వాగ్వాదానికి దిగారు. దీంతో చైర్మన్ ఎన్నిక గందరగోళం మధ్య వాయిదా పడింది. ముందుగా ఛైర్‌పర్సన్ ఎన్నిక వేళ అధికారులు బిజెపి అభ్యర్థి మౌనిక పేరు ప్రతిపాదించారు. మౌనికకు మద్దతుగా ఎనిమిది మంది కౌన్సిలర్లు చేతులెత్తారు. ఎన్నిక తీరుపై ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అభ్యంతరం వ్యక్తం చేశారు. ముందుగా బిజెపి అభ్యర్థి పేరు ఎలా ప్రతిపాదిస్తారంటూ ఆందోళన చేశారు. అధికారులతో వెడ్మ బొజ్జు వాగ్వాదానికి దిగారు. ఛైర్మన్ ఎన్నికను రేపటికి వాయిదా వేశారు. ఎప్పుడు నిర్వహించాలనే దానిపై సందిగ్ధత నెలకొంది. సమావేశం నుంచి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు బయటకు వెళ్లిపోయారు. మున్సిపల్ కార్యాలయం ముందు బిజెపి, బిఆర్ఎస్ నేతలు ఆందోళన చేశారు. వెడ్మ బొజ్జుకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ అభ్యర్థికి మెజారిటీ ఉన్నా చైర్మన్‌గా ప్రకటించలేదని బిజెపి, బిఆర్ఎస్ నేతలు ఆందోళన చేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com